ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

ప్రజా కలం

Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
5 Lines Rs.250 only
&
Public Notice Advertising
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

శుక్రవారం | 02-10- 2026 | సంపుటి: 17, సంచిక: 181, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ



ఉద్యోగులకు
శుభవార్త

ఉద్యోగులకు 2 డీఏలు చెల్లింపునకు ఆమోదం రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం

- రాష్ట్రంలో 235 మండలాల్లో కరువు పరిస్థితులు..
- కోహెడ పండ్ల మార్కెట్‌కు రూ.650 కోట్లు..
- జలయజ్ఞం నాటి 10 సాగునీటి ప్రాజెక్టుల రద్దు
- రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు

హైదరాబాద్, అక్టోబరు 1 (ప్రజాకలం) :

రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. దసరా కానుకగా రెండు కరువు భత్యాల(డీఏ)ను ప్రకటించింది. 2024 నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏల్లో రెండింటిని విడుదల చేయడానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రెండింటి బకాయిలను వాయిదాల్లో చెల్లిస్తారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో మంత్రివర్గ సమావేశం సుదీర్ఘంగా సాగింది. సమావేశం అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఆర్థికంగా భారమైనప్పటికీ ఉద్యోగ సంఘాలతో చర్చల సందర్భంగా ఇచ్చిన హామీకి కట్టుబడి సీఎం ఉద్యోగులకు డీఏ, పెన్షనర్లకు డీఆర్ మంజూరు చేయడానికి అంగీకరించారని తెలిపారు. దీంతో ఏటా రాష్ట్ర ప్రభుత్వంపై రూ.2500 కోట్ల భారం పడుతుందని చెప్పారు. సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొంచుకుంటున్న ఉద్యోగులు, వారి కుటుంబాలు కూడా సంతోషంగా ఉండాలన్న ఉద్దేశంతో ఈ డీఏలను ఆమోదించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎన్నినో పరిస్థితులపై క్యాబినెట్‌లో సుదీర్ఘంగా చర్చ జరిగింది. ఈ వానాకాలంలో 17 శాతం వర్షపాతం లోటు ఉందని నిర్ధారించారు. బుధవారంతో నైరుతి రుతుపవనాల కాలం కూడా ముగిసిన నేపథ్యంలో రాష్ట్రంలో 235 మండలాల్లో తీవ్ర వర్షాభావంతో కరువు పరిస్థితులు నెలకొన్నాయని తేల్చారు. పంటలకే కాకుండా తాగునీటికి కూడా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అంచనాకు వచ్చారు. కరువు ప్రాంతాల్లో తక్షణం చేపట్టాల్సిన చర్యలపై క్యాబినెట్ సబ్ కమిటీ చర్చించాలని మంత్రివర్గం నిర్దేశించింది. సబ్ కమిటీ త్వరగా సమావేశమై ఎల్‌నినో నష్ట నివారణపై చర్చించి, నివేదికను కేబినెట్‌కు అందించాలని చెప్పారు. ఈ నివేదికపై చర్చించేందుకు మంత్రివర్గం అత్యవసరంగా సమావేశం అవుతుంది. దీంతో పాటు అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రైతు సంఘాలతో పాటు వివిధ రంగాల నిపుణులు, అన్ని రాజకీయ పార్టీల నేతలతో ఈ సమావేశాన్ని నిర్వహిస్తారు. వారి సూచనలు, సలహాలు తీసుకుని, చర్యలు చేపట్టాలని క్యాబినెట్ నిర్ణయించింది. కరువు మండలాల ప్రకటనతో పాటు రాష్ట్రానికి తగిన సాయాన్ని అందించాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర మంత్రివర్గం విజ్ఞప్తి చేసింది. త్వరలోనే మంత్రుల బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర పరిస్థితిని నివేదిస్తుంది.

తరువాయి 2వ పేజీలో...



ఉప ఎన్నికకు
బ్రేక్

'ఖైరతాబాద్'పై ఈసీకి హైకోర్టు ఆదేశం

విజయారెడ్డి పిటిషన్‌తో అనూహ్య మలుపు - ఈ నెల 6కు విచారణ వాయిదా

హైదరాబాద్, అక్టోబరు 1 (ప్రజాకలం) :

రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ఆసక్తి కలిగిస్తున్న ఖైరతాబాద్ ఉపఎన్నిక వ్యవహారం ఊహించని మలుపు తిరిగింది. ఈ నియోజకవర్గం నుంచి ఎన్నికైన దానం నాగేందర్‌కు వ్యతిరేకంగా దివంగత నేత పీ జనార్దన్‌రెడ్డి కుమార్తె పీ విజయారెడ్డి గతంలో దాఖలు చేసిన ఎలక్షన్ పిటిషన్‌పై తీర్పు వెలువడే వరకూ ఉపఎన్నిక నిర్వహించడం సరికాదని హైకోర్టు అభిప్రాయపడింది. ఎన్నికల సంఘం (ఈసీ) తరఫు న్యాయవాది కూడా దీనికి ప్రాథమికంగా అంగీకరించారు. ఈమేరకు, తీర్పు వెలువడేవరకూ ఉపఎన్నిక నిర్వహించబోమంటూ ఈసీ అఫిడవిట్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. పార్టీ మారినట్లు నిరూపణ కావడంతో ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా ఉన్న దానం నాగేందర్ ఫిరాయింపుల చట్టం ప్రకారం పదవి కోల్పోయిన విషయం తెలిసిందే. ఫలితంగా ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో విజయారెడ్డి పిటిషన్‌తో ఒక్కసారిగా ఈ ప్రక్రియకు బ్రేక్ పడినట్లయింది.

ఇదీ నేపథ్యం... 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన దానం నాగేందర్ విజయం సాధించారు. కాంగ్రెస్ తరఫున బరిలో నిలిచిన విజయారెడ్డి రెండోస్థానంలో నిలిచారు. ఎన్నికల ఫలితంపై విజయారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికల అఫిడవిట్, ఫారం-26లో దానం నాగేందర్ తప్పుడు వివరాలు ఇచ్చారని, వాస్తవాలు దాచిపెట్టారని.. ఆయనను అనర్హుడిగా ప్రకటించి, రెండోస్థానంలో నిలిచిన తనను ఎమ్మెల్యేగా ప్రకటించాలని పేర్కొంటూ హైకోర్టును ఆశ్రయించారు. 2024 జనవరి 20న దాఖలైన ఎన్నికల పిటిషన్.. జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం ఎదుట విచారణలో ఉంది. ఇటీవల దానం నాగేందర్‌పై వేటు పడటం,

తరువాయి 2వ పేజీలో...

కరువు మండలాల ప్రతిపాదనలకు
అవసరమైన సమాచారాన్ని అందించాలి

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో మద్దతు ధర ప్రకటించిన పంటలన్నింటినీ మద్దతు ధరకు 100 శాతం కేంద్రం కొనుగోలు చేయాలి : మంత్రి తుమ్మల

ప్రకటించిన మద్దతు ధర ప్రతి రైతుకు అందేలా కేంద్రం చిత్తశుద్ధి చూపించాలి

హైదరాబాద్, అక్టోబరు 1 (ప్రజాకలం) :

రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న ప్రాంతాలను గుర్తించి, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకొని మండలం యూనిట్‌గా కరువు మండలాల ప్రతిపాదనలకు డిపార్ట్ మెంట్ సేకరించిన సమాచారాన్ని వారికి అందచేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. కేంద్ర వ్యవసాయ శాఖ రూపొందించిన కరువు నిర్వహణ మార్గదర్శకాల ప్రకారం కేవలం వర్షపాతం లోటును మాత్రమే పరిగణనలోకి తీసుకోకుండా, వర్షపాతం వ్యత్యాసం, SPI, పొడి కాలం, విత్తిన విస్తీర్ణం,

తరువాయి 2వ పేజీలో...



వృద్ధుల సంక్షేమానికి తెలంగాణ
ప్రభుత్వం కట్టుబడి ఉంది

33 జిల్లాల్లో దశలవారీగా వృద్ధాశ్రమాలు

చేయూత పింఛన్ ద్వారా 15.60 లక్షల మందికి లబ్ధి

ప్రతి జిల్లాలో వృద్ధుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అధికారి

వృద్ధాప్యంలో ఆర్థిక భారం పడకుండా పది లక్షల వరకు నగదు రహిత వైద్యం

వృద్ధుల సంరక్షణ కోసం 1700 మందికి జెరియాట్రిక్ కేర్ వింగ్ లో శిక్షణ

30 డే కేర్ కేంద్రాల్లో ఉచిత సేవలు - ట్రిబ్యునళ్లలో కేసుల దాఖలు ప్రక్రియ సులభతరం

ట్రిబ్యునళ్లలో 2,505 భరణం కేసులు దాఖలు కాగా 1,346 కేసులు పరిష్కారం


సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



హైదరాబాద్, అక్టోబరు 1 (ప్రజాకలం) :


వృద్ధుల గౌరవం, భద్రత, ఆరోగ్యం, ఆర్థిక భరోసాకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పష్టం చేశారు. వృద్ధులు తమ సమస్యలను సులభంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా ప్రతి జిల్లాలో ప్రత్యేక అధికారిని నియమించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వృద్ధుల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాల అమలు, వారి హక్కుల పరిరక్షణ, ఫిర్యాదుల పరిష్కారాన్ని జిల్లా స్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ముఖ్య అతిథిగా అలాగే సహచర బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ తో కలిసి పాల్గొన్నారు.

తరువాయి 2వ పేజీలో...



రాహుల్ మెప్పు కోసం సనాతన ధర్మంపై దాడి

కలం కౌంటర్



ఆరేళ్ల సంపాదనతోనే
మూడు స్టార్ హోటళ్లు కొన్నారా?

కేటీఆర్‌ను నిలదీసిన కాంగ్రెస్ ఎంపీ చామల



హైదరాబాద్, అక్టోబరు 1 (ప్రజాకలం):

అమెరికాలో 30 ఏళ్లుగా ఉంటున్న వాళ్లు సైతం జూబ్లీహిల్స్‌లో ఒక ఇల్లు గానీ, హోటల్ కానీ కొనలేకపోతున్నారని, ఆ దేశంలో కేవలం ఆరేళ్లు ఉండి వచ్చిన కేటీఆర్ హైటెక్‌సిటీ దగ్గర మూడు స్టార్ హోటళ్లు

తరువాయి 2వ పేజీలో...

నాకు హోటల్ ఉందని 2009 ఎన్నికల
అఫిడవిట్‌లోనే చెప్పా

- ఇప్పుడు నువ్వు కొత్తగా చెప్పింది ఏముంది సీఎం రేవంత్..?

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, అక్టోబరు 1 (ప్రజాకలం):

అమెరికాలో కష్టపడి సంపాదించుకున్న డబ్బుతో తాను 2006లో హోటల్ వ్యాపారం ప్రారంభించానని.. కుటుంబం కోసం వ్యాపారం చేయడం తప్పా..? అని సీఎం రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఆర్మూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు గురువారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'సిరిసిల్లలో సీఎం రేవంత్ చెప్పినదంతా నేను ఎప్పుడో చెప్పా.. నాకు హోటల్ ఉన్నట్లు 2009 ఎన్నికల అఫిడవిట్‌లోనే రాశాను. ఆ విషయాన్ని కొలంబస్ లెక్క.. వాస్కోడిగామా లెక్క ఏదో కనుగొన్నట్లు నువ్వేంది చెప్పేది. అఫిడవిట్‌లో ఉన్నదే నువ్వు చెప్పినవ్. భార్యాపిల్లలకు బువ్వ పెట్టాలె కదా.. వాళ్లకోసం వ్యాపారం చేయడం తప్పా? నేను ఉన్నత చదువులు చదివా.. నీలా (రేవంత్) ఏళ్ల తరబడి డిగ్రీ చదవలేదు. 2006లో ప్రారంభించిన హోటల్ వ్యాపారం 20 ఏళ్లలో మూడు హోటళ్లకు పెరిగింది.



తరువాయి 2వ పేజీలో...

ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే విచారిస్తాం

- గవర్నర్ కోటా ఎమ్మెల్సీల కేసుపై సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ, అక్టోబరు 1: తెలంగాణలో ఖాళీ కానున్న మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీల కేసును విచారిస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎమ్మెల్సీల వివాదాలకు సంబంధించిన అన్ని పిటిషన్లు గురువారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చాయి. తెలంగాణలో నవంబరులో మూడు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కాబోతున్నాయని పిటిషనర్ల తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. పిటిషనర్లలో ఒకరైన ఆమీర్ అలీఖాన్ తరఫున సీనియర్ న్యాయవాది సంజయ్ ఎమ్. నులి వాదనలు వినిపిస్తూ.. తాము ప్రస్తుతానికి తమ పిటిషన్‌ను ముందుకు తీసుకెళ్లటం లేదని కోర్టుకు తెలిపారు. ధర్మాసనం స్పందిస్తూ.. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే, నవంబరు 18వ తేదీన ప్రాధాన్యత క్రమంలో కేసు విచారణ చేపడతామని పేర్కొంది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీల వివాదం సుదీర్ఘకాలంగా కొనసాగుతూ వస్తోంది. బీఆర్ఎస్ హయాంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ పేర్లను ప్రభుత్వం ప్రతిపాదించగా.. అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తిరస్కరించారు. గవర్నర్ నిర్ణయాన్ని శ్రవణ్, సత్యనారాయణ హైకోర్టులో సవాల్ చేశారు. ఆ క్రమంలోనే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. కోదండరాం, ఆమీర్ అలీఖాన్ పేర్లను గవర్నర్ కోటాలో సిఫార్సు చేయగా గవర్నర్ ఆమోదం తెలిపారు. దీనిని శ్రవణ్, సత్యనారాయణ వ్యతిరేకించటంతో హైకోర్టు వారికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. కోదండరాం, అలీఖాన్ల పేర్లను ప్రభుత్వం మరోసారి సిఫారసు చేయగా గవర్నర్ ఆమోదం తెలిపారు. వారు ఎమ్మెల్సీలుగా నియమితులయ్యారు. గత ఏడాది సుప్రీంకోర్టు వారి నియామకాలను రద్దు చేస్తూ సంచలన తీర్పునిచ్చింది. ఆ తీర్పుపై ఆమీర్ అలీఖాన్ సుప్రీంకోర్టులో మళ్లీ పిటిషన్ దాఖలు చేశారు.

ఉద్యోగులకు శుభవార్త

మొదటి పేజీ తరువాయి...

భారీగా పెరిగిన విద్యుత్తు డిమాండ్

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో విద్యుత్తు వినియోగం భారీగా పెరిగింది. సగటున రోజుకు 15 వేల మెగావాట్ల వినియోగం ఉంటోంది. బుధవారం వాడకం ఏకంగా 19,892 మెగావాట్లు నమోదైంది. వర్షాలు లేక రైతులు బోర్లతో సాగు చేయడం, వాతావరణ మార్పులు, గృహ వినియోగం పెరగడం వల్ల విద్యుత్తు డిమాండ్ భారీగా నమోదవుతోంది. డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి, సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రివర్గం నిర్ణయించింది. కోత లేకుండా సరఫరా చేయడానికి అవసరమైనంత విద్యుత్తును సమకూర్చుకోవాలని, డిమాండ్ మేరకు కొనుగోళ్లు చేపట్టాలని అధికారులకు నిర్దేశించింది. కొత్తగా పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి, విద్యుత్తు సమీకరణపై దృష్టి పెట్టాలని నిర్ణయించింది. 7800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యంగా యూనిట్లను నెలకొల్పేందుకు ఆమోదం తెలిపింది. ఇందులో 3,000 మెగావాట్ల సోలార్ విద్యుత్తు, 4000 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్, 800 మెగావాట్ల పవన విద్యుత్తు యూనిట్ల ఏర్పాటు ప్రతిపాదనలపై మంత్రివర్గం చర్చించింది. కేంద్ర నిబంధనల మేరకు టెండర్లను పిలిచి, ఈ ప్రాజెక్టులు చేపట్టాలని నిర్ణయించింది.

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో సమగ్ర పళ్ల మార్కెట్ ఏర్పాటు

పనులను వేగవంతం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. పూర్తిగా ప్రభుత్వ నిధులతోనే ఈ మార్కెట్ ఏర్పాటు చేస్తారు. మొదటి దశ కింద రూ.650 కోట్లను మంజూరు చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పునఃసమీక్షించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. రాజశేఖర్‌రెడ్డి హయాంలో జలయజ్ఞంలో భాగంగా ఈపీసీ విధానంలో చేపట్టిన కొన్ని ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉండిపోయాయి. ఈపీసీ విధానంలో చేపట్టిన ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉంటే రద్దు చేయాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు వెళ్లాయి. 10 ఈపీసీ సాగునీటి ప్రాజెక్టుల నిలిపివేతకు గురువారం మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కింద 14, 15 వేల ఎకరాల ఆయకట్టుకు సంబంధించి కెనాల్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని పూర్తి చేయడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు మంత్రివర్గం ఓకే చెప్పింది. త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తారు. ఈ సీజన్‌లో దాదాపు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనాల్సి ఉంటుందని అంచనా. సాఫీగా జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని మంత్రివర్గం అధికారులకు సూచించింది. డిజిటల్ మీడియా అడ్వర్టయిజింగ్‌కు ప్రత్యేక పాలసీని అమలు చేసే ప్రతిపాదనను మంత్రివర్గం పరిశీలించింది. కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ రూపొందించిన డిజిటల్ అడ్వర్టయిజింగ్ పాలసీకి అనుగుణంగా రాష్ట్రంలో ఈ పాలసీకి ఆమోదం తెలిపింది. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ పోస్టు మంజూరుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మరో నలుగురు గ్రూప్-1 అధికారులను కూడా ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున పని చేసేందుకు నియమించాలని నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులకు సంబంధించి వీరు లైజనింగ్ చేస్తుంటారు. 22-ఏ అంశంపై కొన్ని జీఓలు, మెమోలు జారీ ఇప్పటికే ప్రభుత్వం జారీ చేసింది. యూఎల్‌సీ కింద పెండింగ్ ఉన్న అప్లికేషన్లు, లే-అవుట్లు, భవనాలకు అనుమతులు ఇచ్చి, నిషేధిత జాబితాలో ఉన్న భూముల వివరాలను తర్వాతి క్యాబినెట్ సమావేశం దృష్టికి తీసుకొస్తారు. 118, 76 జీఓల జారీ అనంతరం వచ్చిన దరఖాస్తులను కూడా తర్వాతి క్యాబినెట్ సమావేశంలో పెడతారు.

వృద్ధుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది

మొదటి పేజీ తరువాయి...

ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ...ఐక్యరాజ్యసమితి 1990 డిసెంబర్ 14న తీర్మానం 45/106 ద్వారా అక్టోబర్ 1ను అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంగా ప్రకటించిందని గుర్తు చేశారు. వృద్ధుల సేవలను గుర్తించడం, వారి జీవనాన్ని ప్రభావితం చేస్తున్న సమస్యలపై సమాజంలో అవగాహన కల్పించడం ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశమన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణలో 3.53 కోట్ల జనాభాలో 32.69 లక్షల మంది వృద్ధులు ఉన్నారని, వృద్ధుల సంక్షేమంపై అవగాహన పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 1 వరకు వారోత్సవాలు నిర్వహించారని, ఇందులో భాగంగా జిల్లాల వారీగా వివిధ అవగాహన, వైద్య, సామాజిక కార్యక్రమాలు చేపట్టారని మంత్రి తెలిపారు తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయకుండా పిల్లల్లో బాధ్యత పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. తల్లిదండ్రుల పోషణ, సంరక్షణకు సంబంధించిన చట్టపరమైన నిబంధనలను సమర్థంగా అమలు చేస్తూ వృద్ధులకు ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

30 డే కేర్ కేంద్రాల్లో ఉచిత సేవలు

వృద్ధుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా 30 డే కేర్ కేంద్రాలను ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. ఆయా కేంద్రాల్లో పౌష్టికాహారం, వైద్య సేవలు, ఆటలు, వినోద కార్యక్రమాలను ఉచితంగా అందిస్తున్నారనీ వివరించారు. వృద్ధుల నమన్యలను వేగంగా పరిష్కరించేందుకు నిర్వహణ ట్రిబ్యునళ్లలో కేసుల దాఖలు ప్రక్రియను సులభతరం చేశారు. గత ఏడాది నిర్వహణ ట్రిబ్యునళ్లలో 2,505 భరణం కేసులు దాఖలు కాగా 1,346 కేసులు పరిష్కారమయ్యాయన్నారు. అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో దాఖలైన 409 అప్పీళ్లలో 234 పరిష్కరించారనీ తెలిపారు.తల్లిదండ్రులను నిరాదరించిన పిల్లల నుంచి ఆస్తిని తిరిగి తల్లిదండ్రుల పేరున బదలాయించేందుకు కలెక్టర్ల ఆధ్వర్యంలోని అథారిటీల వద్ద 209 కేసులు నమోదుకాగా 135 పరిష్కరించారనీ అప్పిలేట్ అథారిటీ వద్ద నమోదైన 18 అప్పీళ్లలో 15 పరిష్కరించడం జరిగిందని వివరించారు.

14567కు ఫోన్ చేస్తే చేయూత

వృద్ధులకు అత్యవసర సమయంలో సహాయం అందించేందుకు 14567 టోల్‌ఫ్రీ ఎల్డర్ లైన్ అందుబాటులో ఉందనీ మంత్రి తెలిపారు.వేధింపులు, నిరాదరణ, ఒంటరితనం, ఆశ్రయం వంటి సమస్యలపై వృద్ధులు ఈ సేవలను వినియోగించుకోవచ్చన్నారు. అవసరమైన సందర్భాల్లో క్షేత్రస్థాయిలో సహాయక బృందాలు స్పందించి వారికి అండగా నిలుస్తున్నాయన్నారు.

రాష్ట్రంలో సామాజిక భద్రతకు చేయూత పింఛన్లు కీలకంగా నిలుస్తున్నాయనీ అర్హులైన 15.60 లక్షల మంది వృద్ధులకు నెలకు రూ.2,016 చొప్పున పింఛన్ అందిస్తూ ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. వృద్ధాప్యంలో ఎదురయ్యే తీవ్రమైన అనారోగ్య సమస్యలతో కుటుంబాలపై ఆర్థిక భారం పడకుండా ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.10 లక్షల వరకు నగదు రహిత వైద్య చికిత్స అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

నిరాదరణకు గురైన, నిరాశ్రయులైన వృద్ధులకు సురక్షితమైన ఆశ్రయం, దుస్తులు, పౌష్టికాహారం, ప్రాథమిక సౌకర్యాలు కల్పించేందుకు 33 జిల్లాల్లో దశలవారీగా వృద్ధాశ్రమాలను ఏర్పాటు చేస్తున్నమన్నారు. ప్రస్తుతం 10 వృద్ధాశ్రమాలు నిర్వహణలో ఉన్నాయన్నారు. వృద్ధుల సంరక్షణలో నైపుణ్యం కలిగిన సిబ్బందిని తీర్చిదిద్దేందుకు 1,700 మందికి జెరియాట్రిక్ కేర్‌గివింగ్‌లో శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

ఈ కార్యక్రమంలో పలువురు వృద్ధులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు.వృద్ధుల కోసం ప్రత్యేక సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటు, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, ప్రత్యేక గుర్తింపు కార్డులు, మెరుగైన వైద్య సదుపాయాలు, ఆర్థిక భద్రత వంటి అంశాలపై ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేశారు. వృద్ధులు తమ జీవితానుభవాన్ని, జ్ఞానాన్ని సమాజానికి అందించిన మార్గదర్శకులని, వారిని గౌరవించడం ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడి బాధ్యత అని వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వృద్ధుల సంక్షేమం, సేవా కార్యక్రమాలకు విశేషంగా కృషి చేసిన పలువురు ప్రముఖులను మంత్రులు సన్మానించారు.

ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీమతి విజేంద్ర బోయి, దివ్యాంగుల సంక్షేమ శాఖ సంచాలకులు సర్వేశ్వర్‌రెడ్డి, పలువురు అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, వృద్ధులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికకు బ్రేక్

మొదటి పేజీ తరువాయి...

ఖైరతాబాద్ ఉప ఎన్నిక జరగనుందన్న వార్తల నేపథ్యంలో.. విజయారెడ్డి తాజాగా గురువారం హైకోర్టు డివిజన్ బెంచ్ ఎదుట పిటిషన్ దాఖలు చేశారు. తన ఎలక్షన్ పిటిషన్‌పై తీర్పు వెలువడే వరకు ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయినట్లు లేదా ఉపఎన్నిక నిర్వహించనున్నట్లు నోటిపై చేయకుండా ఈసీని అడ్డుకోవాలని కోరారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ రామకృష్ణారెడ్డిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది.

బీఆర్ఎస్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు

విజయారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది వేదుల వెంకట రమణ వాదనలు వినిపించారు. దానం నాగేందర్ ఎన్నిక చెల్లదని తాను దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్ (ఈపీ) హైకోర్టు సింగిల్ జడ్జి వద్ద పెండింగ్‌లో ఉందని.. అందులో తాను విజయం సాధిస్తే ఓట్లపరంగా రెండోస్థానంలో నిలిచిన తానే ఎమ్మెల్యే అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సదరు ఈపీపై నిర్ణయం వెలువడే వరకు ఖైరతాబాద్ ఉప ఎన్నిక కోసం నోటిపై చేయకుండా ఈసీని నిలువరించాలని కోరారు. 'ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా వర్సెస్ తెలంగాణ రాష్ట్ర సమితి అండ్‌అదర్స్' కేసులో సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు ప్రస్తుత నందర్భానికి వర్తిస్తుందన్నారు. తమ ఈపీపై తీర్పు వచ్చే వరకూ ఖైరతాబాద్ స్థానాన్ని సాధారణ ఖాళీగా ప్రకటించడానికి, ఉప ఎన్నిక నిర్వహించడానికి వీల్లేదని పేర్కొన్నారు. ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయి స్పందిస్తూ.. పిటిషనర్ వాదనతో తాము ప్రాథమికంగా ఏకీభవిస్తున్నామన్నారు. ఎలక్షన్ పిటిషన్‌పై తీర్పు వెలువడే వరకు ఖైరతాబాద్ స్థానానికి ఉపఎన్నిక నోటిఫికేషన్ ఇవ్వబోమన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఈపీపై ఫలితం తేలేవరకు ఖైరతాబాద్ ఉపఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయబోమని పేర్కొంటూ అఫిడవిట్ దాఖలు చేయాలని ఈసీకి ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను అక్టోబర్ 6వ తేదీకి వాయిదా వేసింది.

ఆరేళ్ల సంపాదనతోనే మూడు స్టార్ హోటళ్లు కొన్నారా?

మొదటి పేజీ తరువాయి...

ఎలా కొనగలిగారని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. పదేళ్లలో స్టార్ హోటళ్లు కట్టే సామర్థ్యం కలిగిన కేటీఆర్.. ఈ పదేళ్లు ఐటీ, మునిసిపల్ మంత్రిగా ఉండి తెలంగాణను ధనిక రాష్ట్రంగా ఎందుకు చేయలేకపోయారని నిలదీశారు. ఆర్థిక మాంద్యంతో దేశంలో చాలా హోటళ్లు మూతపడ్డాయని, కేటీఆర్ మాత్రం ఒక్క హోటల్‌ను మూడు హోటళ్లుగా చేసుకోగలిగారని ఎద్దేవాచేశారు. కాళేశ్వరం, ఫార్ములా ఈకార్ రేస్ అవినీతి సొమ్మును హోటళ్లుగా మార్చారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనతో సిరిసిల్ల వులకించిందని, ఆయన పాదయాత్రతో తమ కష్టాలు తొలగిపోతాయన్న ఆనందం అక్కడి ప్రజల్లో కనిపించిందని ప్రభుత్వ విప్ వేముల వీరేశం వ్యాఖ్యానించారు. ప్రజల కళ్లల్లో ఆనందం కనిపిస్తుంటే.. కేటీఆర్‌లో భయం కనిపిస్తోందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కేటీఆర్ ఓటమి ఖాయమని, అక్కడ కాంగ్రెస్ అభ్యర్థి గెలిచి తీరతారని ధీమా వ్యక్తం చేశారు. సిరిసిల్ల సభలో సీఎం ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోతున్న కేటీఆర్.. పాత చింతకాయ పచ్చడి కబుర్లు చెబుతున్నాడని ఎద్దేవా చేశారు. అమెరికా నుంచి తెచ్చిన డబ్బులతో హోటల్‌లో పెట్టానని బుకాయిస్తున్న కేటీఆర్.. ఒక్క హోటల్‌ను మూడు హోటళ్లు చేసే ట్రిక్కు ఏంటన్నది తెలంగాణ యువతకు నేర్పాలన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం పదవి చేపట్టాక ఎమ్మెల్యే కోటాలో రెండుసార్లు ఎమ్మెల్సీ అవకాశాలు వస్తే రెండింట్లో ఒక్కసారి కూడా రెడ్డి సామాజిక వర్గానికి ఇవ్వలేదని, కష్టపడి గెలవాల్సిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలనే రెడ్డిలకు ఇచ్చారని ఎంపీ మల్లు రవి అన్నారు. కాగా, భద్రాచలంలో 4న నిర్వహిస్తున్న సీతారామచంద్రస్వామి కల్యాణానికి హాజరుకావాలని టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌ను హరిహర ఫౌండేషన్ ఆహ్వానించింది.

కరువు మండలాల ప్రతిపాదనలకు అవసరమైన సమాచారాన్ని అందించాలి

మొదటి పేజీ తరువాయి...

NDVI/NDWI, VCI, నేల తేమ, రిజర్వాయర్ నిల్వలు, భూగర్భజల పరిస్థితులు, ప్రవాహ జలాలు, పశుగ్రాసం, తాగునీరు, ఉపాధి, వలసలు తదితర అంశాలను సమగ్రంగా పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందని, దీనికి గాను వ్యవసాయశాఖ ద్వారా అందించాల్సిన నివేదికలను వారికి ఇవ్వాల్సిందిగా మంత్రి ఆదేశించారు. కరువు తీవ్రతను బహుళ సూచికల ఆధారంగా అంచనా వేసి, అవసరమైన చోట క్షేత్రస్థాయి పరిశీలనతో పంట నష్టాన్ని నిర్ధారించాలని పేర్కొన్నారు.

సాధారణ వర్షపాతంతో పోలిస్తే 20 నుంచి 59 శాతం లోటు ఉంటే లోటు వర్షపాతంగా, 60 నుంచి 99 శాతం లోటు ఉంటే భారీ లోటుగా, వర్షం పూర్తిగా లేకపోతే అత్యంత తీవ్రమైన పరిస్థితిగా పరిగణించాలని కరువు నిర్వహణ మార్గదర్శకాలు పేర్కొంటున్నాయి. అదే విధంగా, సాగు విస్తీర్ణం సాధారణంతో పోలిస్తే 85 శాతం కంటే తక్కువగా ఉండటం కరువు పరిస్థితికి, 75 శాతం లేదా అంతకంటే తక్కువగా ఉండటం తీవ్రమైన కరువు పరిస్థితికి సూచికగా పరిగణించాలని పేర్కొన్నట్లు మంత్రి తెలిపారు.

మద్దతు ధర ప్రకటించిన పంటలన్నింటినీ 100 శాతం కొనుగోలు చేయాలి - కేంద్రానికి మంత్రి తుమ్మల సూచన

మద్దతు ధర ప్రకటించడంతో కేంద్రం బాధ్యత అయిపోదని, ఆ మద్దతు ధర ప్రతి రైతుకు అందేలా చూడటం కూడా కేంద్ర ప్రభుత్వం యొక్క బాధ్యతే అని మంత్రి తుమ్మల అన్నారు. నిన్న కేంద్ర కేబినెట్ రబీ మార్కెటింగ్ సీజన్ 2027-28కు సంబంధించి కనీస మద్దతు ధరలను పెంచింది. ఇందులో కుసుమ పంటకు క్వింటాల్‌కు రూ.675, రేప్‌సీడ్-ఆవాలకు రూ.413, మసూర్‌కు రూ.390, బార్లీకి రూ.136, శనగకు రూ.83, గోధుమకు రూ.25 చొప్పున పెంపు ప్రకటించింది.

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పిఎస్ఎస్ లో ఆయా రాష్ట్రాలలో సాగవుతున్న పప్పుధాన్యాలు, నూనెగింజల మొత్తం ఉత్పత్తిలో నాఫెడ్ ద్వారా కేవలం 25 శాతం మాత్రమే సేకరిస్తుందని, అలా కాకుండా ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులు, వాతావరణ మార్పుల నేపథ్యంలో మద్దతు ధర ప్రకటించిన పంటలన్నింటినీ మద్దతు ధరకు కేంద్ర ప్రభుత్వం 100 శాతం కొనుగోలు చేయాలని మంత్రి తుమ్మల సూచించారు. మద్దతు ధర ప్రకటించడం మాత్రమే కాకుండా, రైతు పండించిన పంటను ఆ ధరకు విక్రయించుకునే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రతి రైతుకు అందేలా చిత్తశుద్ధితో కేంద్రం చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల కోరారు. ప్రకటించిన మద్దతు ధరకు 100 శాతం పంటల సేకరణ జరిగినప్పుడే రైతులకు కలుగుతుందని ఆయన అన్నారు.ఈ సమావేశంలో వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, మార్కెటింగ్ ఎండి రాహుల్ రాజ్ మరియు హార్టికల్చర్ ఎండి యాస్మిన్ బాషా పాల్గొన్నారు.

రాహుల్ మెప్పు కోసం సనాతన ధర్మంపై దాడి - కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ, అక్టోబరు 1: ఢిల్లీలో సోనియా గాంధీ కుటుంబానికి, హైదరాబాద్‌లో మజ్లిస్ కుటుంబానికి సీఎం రేవంత్ రెడ్డి బానిస అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ప్రజల ఆశీస్సులతో అధికారంలోకి వచ్చిన రేవంత్ తెలంగాణ అభివృద్ధి, సమాజం కోసం ప్రాణత్యాగం చేస్తానని చెప్పకుండా.. సోనియా కుటుంబం కోసం ప్రాణత్యాగం చేస్తాననడం సిగ్గుచేటని విమర్శించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ మెప్పు కోసం సనాతన ధర్మం, రాజ్యాంగ సంస్థలపై రేవంత్ దాడి చేస్తున్నారని ఆరోపించారు. హిందూ దేవుళ్ల గురించి మాట్లాడుతూ హిందువులను అవహేళన చేస్తున్న ఆయనకు ఇతర మతస్థుల దేవుళ్లగురించి మాట్లాడే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. గురువారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. రేవంత్ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన గ్యారెంటీలు, 420 సబ్ గ్యారెంటీలను అమలు చేయకుండా రోజుకో కొత్త డ్రామా ఆడుతున్నారని విమర్శించారు. కులాల పేరుతో చిచ్చు పెట్టడం, మతాలు, భాషల పేరుతో రెచ్చగొట్టం, ఉత్తరం, దక్షిణం మధ్య విభేదాలు సృష్టించడం స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కాంగట?స్రకు అలవాటేనన్నారు. రాజకీయ అవసరాల కోసం కాంగ్రెస్ ఎంతకైనా దిగజారుతుందని, రేవంత్ కూడా అదే పాలసీ అవలంబిస్తున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ ప్రజల హృదయాలను మాత్రమే చోరీ చేస్తారని, ఓటు చోరీకి పాల్పడబోరన్నారు. సర్ ప్రక్రియ గురించి మాట్లాడుతూ తెలంగాణలో ఒక్కొక్కరికి రెండు, మూడు స్థానాల్లో ఓట్లు ఉన్నాయని, వారు ఒకేచోట ఓటేసేలా చేస్తే కూడా ఇబ్బంది అనిపిస్తోందా? అని కాంగ్రెస్ నేతలను ప్రశ్నించారు. సింగరేణి బొగ్గుకు అనుగుణంగా యాదాద్రి పవర్ ప్లాంట్ ఎందుకు నిర్మించలేదో? ఎవరి కోసం ఇలా చేశారో కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని బీజేపీ గెలుచుకుంటుందన్నారు. కాగా, ఢిల్లీలోని యశ్వంత్ ప్లాజెస్ మార్కెట్‌లో చేపట్టిన 'స్వచ్ఛతా హీ సేవా'లో కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన చీపురు పట్టి రోడ్లు ఊడ్చారు. పారిశుధ్య కార్మికులతో మాట్లాడి.. వారి సేవలను కొనియాడారు.

నాకు హోటల్ ఉందని 2009 ఎన్నికల అఫిడవిట్‌లోనే చెప్పా : కేటీఆర్

మొదటి పేజీ తరువాయి...

ఈ రాజకీయాల్లోకి రాకుండా వ్యాపారంపై మరింత దృష్టిపెట్టి ఉంటే మరో పది హోటళ్లు కూడా ఏర్పాటు చేసేవాడిని. ఏదేమైనానా హోటళ్లకు ఉచిత ప్రచారం కల్పించినందుకు సంతోషంగా ఉంది' అని వ్యాఖ్యానించారు. కుటుంబం కోసం బుద్ధిగా వ్యాపారం చేసుకుంటున్నానని.. సీఎం రేవంత్‌లాగా మందిమీద పడి దోచుకోలేదని అన్నారు. సీఎం బావమరిది సృజన్‌రెడ్డి కంపెనీకి అర్హత లేదని తాము ప్రశ్నించిన తర్వాత కూడా రూ.1,000 కోట్ల టెండర్ ఎలా వచ్చిందని ప్రశ్నించారు. తొమ్మిదో తరగతి ఫెయిల్ అయిన వ్యక్తి ఏరోస్పేస్ ఇంజనీర్ ఎలా అయ్యారని, రూ.200 కోట్ల విలువైన భూమిని రూ.7కోట్లకు ఆయనకు ప్రభుత్వం ఎలా ఇచ్చిందని నిలదీశారు. 'నీకు దమ్ముంటే.. నీ ఆస్తులు, నా ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించు' అని సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు.

ఓటమి భయంతోనే పిటిషన్..

ఖైరతాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఓటమి పాలవుతుందన్న భయంతోనే... రేవంత్‌రెడ్డి అడ్డదారులు తొక్కుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. అందుకే ఉప ఎన్నికను ఎలాగైనా ఆపాలని కాంగ్రెస్ నాయకురాలు విజయారెడ్డి ద్వారా కోర్టులో పిటిషన్ వేయించారని విమర్శించారు. సీఎంకు దమ్ముంటే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన మిగిలిన 9 మంది ఎమ్మెల్యేలతోనూ రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయిందని, ఒక సంవత్సరం తర్వాత కాంగ్రెస్ దుకాణం బంద్ అవుతుందని ఎద్దేవా చేశారు. రేవంత్ ఏ పార్టీలో అడుగుపెడితే ఆ పార్టీ నాశనమవుతుందని అన్నారు. శత్రుదేశంపై దండయాత్రకు వెళ్లినట్లు సీఎం సిరిసిల్ల పర్యటన సాగిందని మండిపడ్డారు. నల్లమల పులిని అని చెప్పుకుంటున్న ఆయన 4 వేల మంది పోలీసులను వెంట పెట్టుకొని వెళ్లారని తెలిపారు. 'నువ్వు నల్లమల పులివి కాదు.. చంద్రబాబు దగ్గర పిల్లివి' అని ఎద్దేవా చేశారు. సిరిసిల్ల పర్యటనలో సీఎం చుట్టూ పోలీసులు తప్ప ప్రజలు కనిపించలేదని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేనేత కార్మికుల ఆత్మహత్యలు ఆగిపోతే.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సిరిసిల్లలో 35 మంది చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని విమర్శించారు. కాగా, దక్షిణ కొరియా అధ్యక్షుడి సలహాదారు ప్రొఫెసర్ యంగ్‌టే చో, సియోల్ నేషనల్ యూనివర్సిటీ ప్రతినిధి బృందంతో కేటీఆర్ తెలంగాణ భవన్‌లో భేటీ అయ్యారు. కొరియా కంపెనీలకు తెలంగాణలో అపారఅవకాశాలున్నాయని తెలిపారు.

ఎమ్మెల్సీ టికెట్లపై తీన్మార్ మల్లన్న ఫైర్

జానారెడ్డి కుట్ర అంటూ సంచలన ఆరోపణ - రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్‌రెండు స్థానాలు రెడ్లకే ఇచ్చారని తీన్మార్ మల్లన్న విమర్శ రాష్ట్రంలో బీసీ వాదం లేదని నిరూపించే ప్రయత్నం జరుగుతోందని మండిపాటు



హైదరాబాద్ : తెలంగాణలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించడం రాజకీయంగా వేడి పుట్టించింది. రెండు సీట్లనూ రెడ్డి సామాజిక వర్గానికే కేటాయించడంపై తెలంగాణ రాజ్య అధికార పార్టీ నేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తీవ్ర ఆరోపణలు చేశారు. దీని వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, సీనియర్ నేత జానారెడ్డి నాటక మాడారని సంచలన వ్యాఖ్యలు చేశారు. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ స్థానానికి సామ రామ్మోహన్ రెడ్డిని, నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానానికి రామిరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని కాంగ్రెస్ అభ్యర్థులుగా ప్రకటించింది. దీనిపై మల్లన్న మాట్లాడుతూ... ఈ నిర్ణయం తనకు ఆశ్చర్యం కలిగించలేదన్నారు. "రెడ్ల పార్టీ రెడ్లకు కాకుండా బీసీలకు టికెట్లు ఇస్తేనే ఆశ్చర్యపడాలి" అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌లోని రెడ్లు ఓ నాటకమాడారని, ఈ కేటాయింపుల వెనుక జానారెడ్డితో పాటు మరో టీచర్ ఎమ్మెల్సీ, ఇంకో రెడ్డి నేత కుట్ర ఉందని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రకటించిన ఇద్దరు అభ్యర్థులు కేవలం 'బలిపశువులు' మాత్రమేనని మల్లన్న అభివర్ణించారు. పార్టీ గెలవడం కాదు, రెడ్లు గెలవాలన్నదే వారి లక్ష్యమని, దీని కోసం బీఆర్ఎస్‌లోని ఒక వ్యక్తితో రహస్య ఒప్పందం కూడా కుదిరిందని ఆరోపించారు. ఈ స్థానాల్లో కాంగ్రెస్‌కు గతంలో కనీసం డిపాజిట్లు కూడా దక్కలేదని, తాను గెలిచిన తర్వాతే అక్కడ ఆ పార్టీకి గుర్తింపు వచ్చిందని గుర్తుచేశారు. ఈ ఎన్నికలు రెడ్లు, వెలమలకు, బీసీలకు మధ్య జరుగుతున్న పోరాటంగా ఆయన అభివర్ణించారు. రాష్ట్రంలో బీసీ వాదం లేదని నిరూపించే ప్రయత్నం జరుగుతోందన్నారు. తమ తెలంగాణ రాజ్య అధికార పార్టీ తరఫున రెండు స్థానాల్లోనూ బీసీ అభ్యర్థులను నిలబెట్టి గెలిపిస్తామని తీన్మార్ మల్లన్న ధీమా వ్యక్తం చేశారు. తన అభ్యర్థిత్వంపై త్వరలోనే స్పష్టత వస్తుందని తెలిపారు.

పేదలకు అండగా సీఎం సహాయ నిధి

- ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం
- టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 01 (ప్రజాకలం):-పేద ప్రజలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు అన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గురువారం మెట్‌పల్లిలోని తన నివాసంలో ముఖ్యమంత్రి సహాయ నిధికి సంబంధించిన రూ.8.55 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుజిత్ రావు మాట్లాడుతూ.. అనారోగ్యం, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ, అర్హులైన వారికి సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, టీపీసీసీ ఫిషర్‌మెన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, జిల్లా కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు దామెర రాజశేఖర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లూరి సాగర్, మాజీ ఉప సర్పంచ్ సల్ల సునీల్, కల్లెడ గంగాధర్, తోగిటి నాగరాజు, బైండ్ల శ్రీకాంత్, కళ్లెం శ్రీనివాస్, ఎట్టేం మల్లేష్, రెబ్బాస్ మల్లేష్, కనుక దినేష్‌తో పాటు సీఎం సహాయ నిధి లబ్ధిదారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టిపిసిసి డెలికేట్ ను మర్యాదపూర్వకంగా కలిసిన పాషా

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 01 (ప్రజాకలం):-

జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా ఖుతుబుద్దీన్ పాషా గురువారం టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు, మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్‌లను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనకు పదవి లభించేందుకు కృషి చేసిన సుజిత్ రావు, కూన గోవర్ధన్‌లను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఫిషర్‌మెన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, జిల్లా యూత్ కాంగ్రెస్ మీడియా కోఆర్డినేటర్ కూన రాకేశ్, బైండ్ల శ్రీకాంత్, కళ్లెం శ్రీనివాస్, మొగిలి రాజేందర్ పాల్గొన్నారు.

స్వచ్ఛత హి సేవ కార్యక్రమం

-పాఠశాల ఆవరణ లో ఏక్ దిన్, ఏక్ గంట, ఏక్ సాథ్ శ్రమదానం



ధర్మారం, అక్టోబర్ 01 : (ప్రజా కలం ప్రతినిధి) మండలంలోని కమ్మర్ ఖాన్ పేట గ్రామం లో గ్రామ సర్పంచ్ ఇరుగురాల మహేష్ గ్రామ ప్రజలతో, పాఠశాల విద్యార్థులతో గ్రామం లో స్వచ్ఛతాహి సేవ శ్రమదాన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఇరుగురాల మహేష్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు, విద్యార్థులు తమ తమ యొక్క పరిసరాల లో ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని తమ ఇంటిని ఎలాగయితే శుభ్రంగా ఉంచుకుంటామో పరిసరాలని కూడా శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమం లో గ్రామ ఉప సర్పంచ్ ప్రమోద్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

దళిత యువకుడిపై దాడి అమానుషం

- బీజేపీ రాష్ట్ర నాయకులు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి

పెద్దపల్లి,అక్టోబర్ 01:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

సుల్తానాబాద్‌లో దళిత యువకుడిపై జరిగిన దాడి ఘటనను బీజేపీ రాష్ట్ర నాయకులు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి తీవ్రంగా ఖండించారు.కరీంనగర్‌లోని జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత యువకుడిని ఆయన గురువారం నేరుగా పరామర్శించి,బాధితుడి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ దళిత యువకుడిపై విచక్షణా రహితంగా దాడి చేసిన నిందితులను పోలీసులు వెంటనే గుర్తించి,చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.బాధితుడికి పూర్తిస్థాయిలో మెరుగైన వైద్యం అందించడంతో పాటు,అతడి కుటుంబానికి తగిన పోలీస్ రక్షణ కల్పించాలని అధికారులను కోరారు.సమాజంలో ఇటువంటి అమానుష ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠినంగా వ్యవహరించాలని,కేసుపై సమగ్ర విచారణ జరిపి బాధితుడికి తక్షణమే పూర్తి న్యాయం చేయాలని ఆయన నిలదీశారు.ఈ పరామర్శ కార్యక్రమంలో సురేష్ రెడ్డితో పాటు బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కొల్లూరి సంతోష్ కుమార్,యువమోర్చా అధ్యక్షుడు కొమ్మిడి రాజేందర్ రెడ్డి,ఎర్రం సంతోష్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.



వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

– సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



వెల్గటూర్, అక్టోబర్ 1, ప్రజాకలం, ప్రతినిధి :

తెలంగాణలోని వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా హైదరాబాదులో నిర్వహించిన సమావేశానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 1990 డిసెంబర్ 4న ఐక్యరాజ్య సమితి అక్టోబర్ 1వ తేదీన ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయం తీసుకుందని అన్నారు. ఐక్యరాజ్యసమితి తీసుకున్న నిర్ణయం మేరకు ప్రతి ఏడాది అక్టోబర్ 1న వయోవృద్ధుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో 3.53కోట్ల జనాభా ఉందని, ఇందులో వయోవృద్ధులు 32. 69 లక్షల మంది ఉన్నట్లు వివరించారు. ఐక్యరాజ్య సమితి తీర్మానం మేరకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాస్థాయిలో రాష్ట్ర స్థాయిలో వయోవృద్ధుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించే వయోవృద్ధుల వారోత్సవాలకు ప్రభుత్వం తరఫున జిల్లా కలెక్టర్లకు రూ. 50 వేలు అందజేస్తుం దని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వయోవృద్ధుల సంక్షేమ కోసం అనేక చర్యలు తీసుకుంటూ దేశానికి తెలంగాణ రాష్ట్ర ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తల్లిదండ్రుల సంరక్షణ పోషణ 2026 చట్టాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ చట్టంలో ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధులు సైతం వచ్చే విధంగా చట్టాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రుల పోషణ మరిచిన ప్రభుత్వ ఉద్యోగులు ప్రజా ప్రతి నిధుల వద్దనుండి వారి జీవితంలో 15%కు మించకుండా నెలకు రూ. 17,000 తగ్గకుండా చెల్లించే విధంగా చట్టాన్ని రూపొందించి అమలు చేస్తున్నామని తెలిపారు. వయోవృద్ధులు మానసికంగా ఉల్లాసంగా ఉండడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వయోవృద్ధుల సమస్యలను పరిష్కరించడానికి ప్రతి జిల్లా కేంద్రంలో ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని ముఖ్యమంత్రిని కోరినట్లు మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.

వృద్ధుల అనుభవాలే నేటి సమాజానికి దిక్సూచి

సీనియర్ సివిల్ జడ్జి శ్రీనిజ కోయిర్కర్ - పెద్దబొంకూర్ లో వృద్ధులకు ఘన సత్కారం



పెద్దపల్లి,అక్టోబర్ 01:(ప్రజాక,లం జిల్లా ప్రతినిధి)

వృద్ధుల అనుభవాలే నేటి సమాజానికి దిక్సూచి.వారిని గౌరవించి,కంటికి రెప్పలా కాపాడుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత. వృద్ధుల హక్కులను పరిరక్షించేందుకు న్యాయ వ్యవస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది అని జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీనిజ కోయిర్కర్ స్పష్టం చేశారు.ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని పెద్దబొంకూర్ గ్రామంలో గురువారం ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ కార్యదర్శి,సీనియర్ సివిల్ జడ్జి శ్రీనిజ కోయిర్కర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సమాజంలో వృద్ధుల సేవలు అనన్యమైనవని,వారి అనుభవం రాబోయే తరాలకు మార్గదర్శకమని అన్నారు.వృద్ధుల సంక్షేమం, భద్రత,వారి చట్టపరమైన హక్కుల పరిరక్షణకు న్యాయ సేవా సాధికార సంస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.తల్లిదండ్రులను, వృద్ధులను గౌరవించి,వారి సంరక్షణను బాధ్యతగా స్వీకరించాలని ఈ సందర్భంగా గ్రామస్థులకు సూచించారు.అనంతరం వృద్ధులను సత్కరించి,వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్,రూరల్ ఎస్సై మధుకర్,స్థానిక సర్పంచ్ తిరుపతి ,డాక్టర్ శ్రీనిషతో పాటు వివిధ శాఖల అధికారులు,ఆశా సిబ్బంది,ప్రజాప్రతినిధులు,గ్రామ వృద్ధులు పాల్గొన్నారు.

వృద్ధుల సంక్షేమానికి సత్వర చర్యలు

పెద్దపల్లి డీసీపీ రామ్‌రెడ్డి - ఘనంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం



పెద్దపల్లి,అక్టోబర్ 01:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పోలీస్ స్టేషన్లకు వచ్చే వయోవృద్ధులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి,వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని డీసీపీ రామ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకల్లో సీనియర్ సివిల్ జడ్జి శ్రీనిజ కోయిర్కర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లలో ఇబ్బందులు ఎదురైతే వయోవృద్ధులు 112కు లేదా నేరుగా తనకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.తెలంగాణలోనే తొలిసారిగా వయోవృద్ధుల చట్టం ద్వారా పిల్లల పేరిట ఉన్న భూముల రిజిస్ట్రేషన్లను రద్దు చేసి,తిరిగి వృద్ధ తల్లిదండ్రుల పేరిట మార్చిన ఘనత పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కే దక్కుతుందని,జిల్లాలో ఇప్పటివరకు ఇలాంటి రెండు ఘటనల్లో న్యాయం చేశామని పేర్కొన్నారు.బస్ స్టాండ్లు,రైల్వే స్టేషన్లలో ఆదరణ లేని వృద్ధులు కనిపిస్తే వారిని సుల్తానాబాద్‌లోని ప్రభుత్వ వృద్ధాశ్రమానికి తరలించాలని సూచించారు. అనంతరం పలువురు వయోవృద్ధులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సెర్ప్ డైరెక్టర్ కృష్ణమూర్తి,డీఆర్‌డీఏ కాళిందిని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వై.పవిత్ర,కలెక్టరేట్ పరిపాలన అధికారి బండి ప్రకాష్,అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్,జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రవీందర్,రిటైర్డ్ జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య,రిటైర్డ్ బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి,వయోవృద్ధులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధన వైపు యువత అడుగులు వేయాలి

ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ బి.వెంకట్ రెడ్డి



పెద్దపల్లి,అక్టోబర్ 01:(ప్రజాకకం జిల్లా ప్రతినిధి)

యువత దురలవాట్లకు దూరంగా ఉంటూ లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ బి.వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు.స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల నిర్మూలన,రహదారి భద్రత,ఇండియన్ ఆర్మీలో చేరే విధానంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ,విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తూ శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలి.క్రమశిక్షణే మీ బంగారు భవిష్యత్తుకు నాంది పలుకుతుందని పేర్కొన్నారు.అనంతరం మాజీ సైనికులు పల్లె శ్యామ్ సుందర్ రెడ్డి,అంతర్జాతీయ పర్వతారోహకుడు లెంకల మహిపాల్ రెడ్డిమాట్లాడుతూ.యువత మాదకద్రవ్యాల బారిన పడి తమ విలువైన జీవితాలను, భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన,ప్రతి ఒక్కరూ ప్రయాణాల్లో తప్పనిసరిగా రహదారి భద్రతా నియమాలను పాటిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా మెలగాలి అని సూచించారు.దేశసేవలో భాగస్వాములు కావడం ప్రతి ఒక్కరికీ లభించే గొప్ప అవకాశం.పట్టుదల,కఠోర శ్రమ ఉంటే ఇండియన్ ఆర్మీలో సులువుగా అవకాశాలు సాధించవచ్చు అని విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు.

మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలు,వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు,ఇండియన్ ఆర్మీలో చేరేందుకు ఉన్న అర్హతలు, నియామక ప్రక్రియ,ఇతర కెరీర్ అవకాశాలపై విద్యార్థులకు నవివరంగా అవగాహన కల్పించారు.యువత దేశ సేవ వట్ల ఆనక్తిని పెంపొందించుకోవాలని కోరారు.కార్యక్రమానంతరం నిషేధిత మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచార పత్రాలను ప్రాన్సిపాల్,అతిథులు, అధ్యాపకులు,విద్యార్థులు కలిసి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో న్యూట్రీ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలి - సూపర్వైజర్ జానకి

గొల్లపల్లి, అక్టోబర్ 01 ప్రజా కలం ప్రతినిధి

గొల్లపల్లి మండల తిర్మలపూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో సూపర్వైజర్ జానకి ఆధ్వర్యంలో గురువారం పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్యఅతిథిగా సర్పంచ్ కాషా అంజలి,గంగాధర్ పాల్గొన్నారు. సూపర్వైజర్ జానకి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు రక్తహీనతకు గురయ్యే అవకాశం ఉన్నందున పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. తాజా ఆకుకూరలు, కూరగాయలు, పాలు, పండ్లు, మొలకెత్తిన గింజలను ఆహారంలో భాగంగా చేసుకోవాలని, సమతుల్య ఆహారం తీసుకోవడంతో పాటు ప్రతి ఇంట్లో న్యూట్రి గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.అనంతర...



ట్రాలీ ఆటో యూనియన్ ఏకగ్రీవ ఎన్నిక



గొల్లపల్లి, అక్టోబర్ 01 ప్రజా కలం ప్రతినిధి

గొల్లపల్లి మండల కేంద్రంలో శ్రీ బాలాజీ ట్రాలీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గురువారం నూతన కార్యవర్గాన్ని,ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ సభ్యులంతా కలిసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.యూనియన్ నూతన అధ్యక్షుడిగా తాండ్ర కిరణ్ ఎన్నుకోగా గౌరవధ్యక్షులుగా నేరెళ్ల మహేష్, ఉపాధ్యక్షులు చెవులమద్ది రాజేష్,కోశాధికారి సామల వీరస్వామి లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ యూనియన్ సభ్యుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం కలిసికట్టుగా పనిచేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. ట్రాలీ ఆటో డ్రైవర్ల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులకు యూనియన్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ట్రాలీ ఆటో యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డి మహిళా పక్షపాతి

- ఇందిరమ్మ చీరల పంపిణీ చేసిన కౌన్సిలర్ రమాదేవి



పెద్దపల్లి,అక్టోబర్ 01:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళ సంక్షేమానికి పెద్దపీట వేస్తూ మహిళా పక్షపాతిగా నిలిచారని పెద్దపల్లి మున్సిపాలిటీ 35వ వార్డు కౌన్సిలర్ దేవనంది రమాదేవి అంజయ్య కొనియాడారు.గురువారం స్థానిక అమర్ నగర్‌లోని సిరి ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు చీరలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి మహిళల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్,స్థానిక ఎమ్మెల్యే విజయ రమణారావు సహకారంతో పెద్దపల్లి పట్టణంతో పాటు తన 35వ వార్డును అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేసేందుకు శ్రమిస్తున్నానని తెలిపారు.రాబోయే రోజుల్లో ప్రజాప్రతినిధులు,అధికారుల భాగస్వామ్యంతో వార్డు రూపురేఖలు మారుస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో బిపిఓ అనుపమ,ఆర్పీ ప్రవంతిలతో పాటు లబ్ధిదారులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే మన లక్ష్యం

- టాస్క్ ఫోర్స్ ఎస్ఐ లక్ష్మణ్ రావు
- మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు

పెద్దపల్లి,అక్టోబర్ 01:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

మాదక ద్రవ్యాల బారిన పడి యువత,విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పోలీసు అధికారులు పిలుపునిచ్చారు.గురువారం పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి టాస్క్ ఫోర్స్ ఎస్ఐ జె.లక్ష్మణ్ రావు,పెద్దపల్లి ఎస్ఐ కె.నరేష్ మరియు పోలీసు సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ ఎస్ఐ లక్ష్మణ్ రావు మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య,సామాజిక మరియు చట్టపరమైన తీవ్ర పరిణామాలను విద్యార్థులకు వివరంగా తెలియజేశారు. యువత ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.సమాజంలో ఎక్కడైనా మాదక ద్రవ్యాల విక్రయాలు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.సమాచారమిచ్చిన వారి వివరాలను రహస్యంగా ఉంచుతామని తెలిపారు.సమాజ శ్రేయస్సు కోసం,మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పోలీసులు పిలుపునిచ్చారు.



ప్రజా కలం
శుక్రవారం, అక్టోబర్ 2, 2026

విద్యుత్ డిమాండ్‌కు దీర్ఘకాలిక వ్యూహం అవసరం

దేశంలో విద్యుత్ వినియోగం వేగంగా పెరుగుతున్న వేళ సరఫరా వ్యవస్థలో కనిపిస్తున్న ఒత్తిడి భవిష్యత్తుకు హెచ్చరికగా భావించాలి. సెప్టెంబర్‌లో దేశవ్యాప్తంగా విద్యుత్ కొరత 56 కోట్ల యూనిట్లకు చేరడం ఆందోళన కలిగిస్తోంది. ఇది 2023 ఆగస్టు తర్వాత అత్యధిక స్థాయి. అదే సమయంలో మొత్తం విద్యుత్ ఉత్పత్తి గత ఏడాది సెప్టెంబర్‌తో పోలిస్తే 11.3 శాతం పెరిగి 174.17 బిలియన్ యూనిట్లకు చేరింది. ఉత్పత్తి భారీగా పెరిగినా కొరత ఏర్పడటం విద్యుత్ డిమాండ్ ఎంత వేగంగా విస్తరిస్తోందో తెలియజేస్తోంది. పారిశ్రామిక కార్యకలాపాల విస్తరణ, అధిక ఉష్ణోగ్రతలు, వర్షపాతంలో హెచ్చుతగ్గులు విద్యుత్ అవసరాలను పెంచుతున్నాయి. జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గడం కూడా సమస్యను మరింత తీవ్రం చేసింది. ఈ పరిస్థితుల్లో మళ్లీ బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలే ప్రధాన భారం మోయాల్సి వచ్చింది. సెప్టెంబర్‌లో బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి ఏడాది ప్రాతిపదికన 13.3 శాతం పెరిగింది. దేశ మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో బొగ్గు వాటా ఆగస్టులో 64.6 శాతం ఉండగా సెప్టెంబర్‌లో 66.03 శాతానికి చేరింది. మరోవైపు సుమారు 40 శాతం బొగ్గు విద్యుత్ కేంద్రాల్లో ఇంధన నిల్వలు అత్యంత తక్కువ స్థాయిలో ఉండటం విద్యుత్ భద్రతపై కొత్త ప్రశ్నలను లేవనెత్తుతోంది. పునరుత్పాదక విద్యుత్ రంగంలో పురోగతి కనిపిస్తున్నప్పటికీ సమస్యకు అది ఒక్కటే సమాధానం కాదు. సెప్టెంబర్‌లో పునరుత్పాదక వనరుల నుంచి ఉత్పత్తి 25.1 శాతం పెరిగి 29.62 బిలియన్ యూనిట్లకు చేరింది. అయినప్పటికీ మొత్తం ఉత్పత్తిలో స్వచ్ఛ ఇంధన వాటా ఆగస్టులోని 19.5 శాతం నుంచి సెప్టెంబర్‌లో సుమారు 17 శాతానికి తగ్గింది. పగటిపూట ఉత్పత్తయ్యే సౌర విద్యుత్‌ను రాత్రి గరిష్ఠ డిమాండ్ సమయంలో వినియోగించుకునేంత నిల్వ సామర్థ్యం లేకపోవడం ప్రధాన బలహీనత. అందుకే పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యం పెంపుతో సమాన వేగంలో నిల్వ వ్యవస్థలూ విస్తరించాలి. ఈ లోటును గుర్తించిన కేంద్రం తాజాగా రూ. 1.86 లక్షల కోట్ల పునరుత్పాదక విద్యుత్ కార్యక్రమానికి ఆమోదం తెలిపింది. ఇందులో రాష్ట్రాల విద్యుత్ ప్రసార వ్యవస్థలను బలోపేతం చేసేందుకు రూ. 1.36 లక్షల కోట్లు, 50 గిగావాట్ గంటల బ్యాటరీ నిల్వ వ్యవస్థల ఏర్పాటుకు రూ. 50 వేల కోట్ల ప్రోత్సాహక కార్యక్రమాన్ని ప్రతిపాదించింది. ప్రస్తుతం దేశంలో శిలాజేతర విద్యుత్ సామర్థ్యం సుమారు 304 గిగావాట్లు ఉండగా, 2030 నాటికి దాన్ని 500 గిగావాట్లకు చేర్చాలన్నది లక్ష్యం. లక్ష్యాలు భారీగానే ఉన్నా వాటికి అనుగుణంగా గ్రిడ్, నిల్వ సామర్థ్యం పెరగకపోతే అదనపు ఉత్పత్తి ప్రయోజనం పూర్తిగా అందదు. కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ అంచనాల ప్రకారం 2026-27లో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 277.2 గిగావాట్లకు, 2031-32 నాటికి 366.4 గిగావాట్లకు చేరవచ్చు. 2031-32 నాటికి దేశానికి సుమారు 2,474 బిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరమవుతుందని అంచనా. అంటే నేటి అవసరాలకు సరిపడా విద్యుత్ సమకూర్చుకోవడంతోనే బాధ్యత పూర్తికాదు. రాబోయే ఐదారేళ్ల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఇప్పుడే మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలి. ఇందుకోసం కేంద్రం, రాష్ట్రాలు స్పష్టమైన గడువులతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి. ప్రతి రాష్ట్రం వచ్చే ఐదేళ్ల విద్యుత్ అవసరాలను ముందుగానే అంచనా వేసి ఉత్పత్తి, ప్రసారం, నిల్వ సామర్థ్యాలను దానికి అనుగుణంగా పెంచాలి. సౌర, పవన విద్యుత్‌తోపాటు బ్యాటరీ నిల్వలు, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలి. అంతర్రాష్ట్ర ప్రసార మార్గాలను బలోపేతం చేసి ఒక ప్రాంతంలోని మిగులు విద్యుత్‌ను కొరత ఉన్న ప్రాంతానికి వెంటనే తరలించే వ్యవస్థను విస్తరించాలి. డిస్కమ్‌ల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం, ప్రసార-పంపిణీ నష్టాలను తగ్గించడం, పరిశ్రమలు-వ్యవసాయంలో విద్యుత్ సమర్థ వినియోగాన్ని ప్రోత్సహించడం అవసరం. బొగ్గు నిల్వలపై నిరంతర పర్యవేక్షణతో ఆకస్మిక కొరతలకు ముందస్తు ప్రణాళిక ఉండాలి. విద్యుత్ భద్రత అంటే మరిన్ని ప్లాంట్లు నిర్మించడం మాత్రమే కాదు; ఉత్పత్తి, నిల్వ, ప్రసారం, పంపిణీని ఒకే సమగ్ర వ్యవస్థగా తీర్చిదిద్దడం. ప్రతి లక్ష్యానికి గడువు, ప్రతి ప్రాజెక్టుకు బాధ్యత, ప్రతి దశకు సమీక్ష ఉండాలి. నేటి కొరతను పూడ్చడం తాత్కాలిక అవసరం; రేపటి కొరత రాకుండా చూడటమే అసలైన విద్యుత్ విధానం.

- సి.హెచ్. ప్రతాప్

దళిత సంక్షేమానికి కేసీఆర్ హయాంలోనే ప్రాధాన్యం

మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ - చేవెళ్ల హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం



పెద్దపల్లి,అక్టోబర్ 01:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని గత భారత రాష్ట్ర సమితి పాలనలోనే దళితుల విద్య,ఉపాధి,ఆర్థిక వికాసంతో పాటు ఆత్మగౌరవానికి అత్యున్నత ప్రాధాన్యత లభించిందని మానకొండూరు మాజీ శాసనసభ్యులు రసమయి బాలకిషన్ పేర్కొన్నారు.పెద్దపల్లి నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ పార్టీ దళిత విభాగం ముఖ్య నాయకుల సమావేశం గురువారం రంగంపల్లిలోని ఆర్.ఆర్. ప్రాంగణంలో నియోజకవర్గ ఇన్చార్జి,మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి చొప్పదండి మాజీ శాసనసభ్యులు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రసమయి బాలకిషన్ మాట్లాడుతూ దళితబంధు,విదేశీ విద్యానిధి,అంబేద్కర్ అభ్యయన వేదికల ద్వారా పోటీ పరీక్షల శిక్షణ,కల్యాణలక్ష్మి,రైతుబీమా వంటి విశిష్ట పథకాలతో ప్రతి దళిత కుటుంబానికి ఆర్థిక లబ్ధి చేకూరిందని తెలిపారు.రాజధాని నగరంలో 125 అడుగుల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మహోన్నత విగ్రహావిష్కరణతో పాటు రాష్ట్ర పరిపాలనా ప్రధాన కార్యాలయానికి ఆయన పేరు పెట్టడం కేసీఆర్ ప్రభుత్వ దళిత ప్రగతి సంకల్పానికి నిదర్శనమని గుర్తుచేశారు.మిషన్ కాకతీయ ద్వారా తటాకాల పునరుద్ధరణ చేపట్టి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రాణం పోశామన్నారు.ఎన్నికల సమయాన కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల దళిత,గిరిజన ప్రకటనా పత్రంలో ఇచ్చిన రూ. 12 లక్షల ఆర్థిక సాయం సహా పలు వాగ్దానాలను పక్కనబెట్టి దళితులను తీవ్రంగా వంచించిందని ఆరోపించారు.

వాగ్దానాల అమలుపై స్పష్టత ఇవ్వాలి
- చొప్పదండి మాజీ శాసనసభ్యులు సుంకె రవిశంకర్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన అంబేద్కర్ అభయహస్తం'కింద రూ. 12 లక్షల సాయం పెద్దపల్లి,సుల్తానాబాద్ ప్రాంతాల్లో ఎంతమందికి అందిందో ప్రభుత్వం తక్షణమే వివరాలు వెల్లడించాలని చొప్పదండి మాజీ శాసనసభ్యులు సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో దళిత యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు నైపుణ్య శిక్షణ,ఆర్థిక ప్రోత్సాహకాలు అందించామని చెప్పారు.కాళేశ్వరం జలాల ద్వారా రాళ్లపల్లి లింక్ కాలువ అనుసంధానంతో పెద్దపల్లి రక్షిత సాగునీటి వ్యవస్థ బలపడిందని వివరించారు.ప్రతిపక్ష నాయకులు,కార్యకర్తలపై అక్రమ కేసులు బానాయిస్తూ అరెస్టులు చేయడాన్ని ఖండిస్తూ, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును ప్రభుత్వం గౌరవించాలని హితవు పలికారు.

ప్రభుత్వం తక్షణమే కార్యాచరణ ప్రకటించాలి
-పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

2023 శాసనసభ ఎన్నికల వేళ కాంగ్రెస్ ఇచ్చిన అభయహస్తం ప్రణాళిక,చేవెళ్ల దళిత-గిరిజన ప్రకటనలోని హామీల అమలు తీరుపై ప్రభుత్వం క్షేత్రస్థాయి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని పెద్దపల్లి నియోజకవర్గ ఇన్చార్జి,మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.దళిత రిజర్వేషన్లను 18 శాతానికి పెంపు,నిరుపేదలకు ఉచిత నివేశన స్థలంతో పాటు గృహ నిర్మాణ సాయం, విద్యార్థులకు రూ. 5 లక్షల విద్యా భరోసా కార్డు,ఉపాధి సహాయం,విదేశీ విద్యా నిధుల విడుదలలో జరుగుతున్న విలంబనాన్ని తక్షణమే నివారించి స్పష్టమైన కార్యాచరణను ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ పార్టీ దళిత విభాగం ముఖ్య నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జన్ను భాస్కర్ కి కాంగ్రెస్ నాయకుల నివాళి



ఐనవోలు, అక్టోబర్ 1:(ప్రజా కలం ప్రతినిధి)పంతిని గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అడ్వకేట్ జన్ను భాస్కర్ మృతి పట్ల కాంగ్రెస్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ ఆదేశాల మేరకు ఐనవోలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్ పంతినిలోని జన్ను భాస్కర్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం భాస్కర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన మృతి కాంగ్రెస్ పార్టీకి, గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కక్కిరాలపల్లి సర్పంచ్ కంజర్ల వాణి, రవికుమార్ రామ్‌నగర్ సర్పంచ్ స్వాతి, పంతిని గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండి మహేందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కంకర శ్రీనివాస్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

ఎల్కూర్‌లో గ్రామాభివృద్ధికి కీలక అడుగు

- గ్రామంలో 375 అభివృద్ధి పనుల గుర్తింపు
- సర్పంచ్ పి. వినోద్‌కుమార్



గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 1 (ప్రజా కలం): జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పరిధిలోని ఎల్కూర్ గ్రామ పంచాయతీలో వీబీ-జీ రామ్ జీ కార్యక్రమంలో భాగంగా గ్రామ పటం, వనరుల పటాన్ని రూపొందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టాల్సిన 375 అభివృద్ధి పనులను గుర్తించారు.గ్రామంలో ఉన్న వనరులు, ప్రజల అవసరాలు, ఉపాధి అవకాశాలు, మౌలిక వసతుల అభివృద్ధి తదితర అంశాలను పరిశీలించి భవిష్యత్‌లో చేపట్టాల్సిన పనులను గుర్తించినట్లు సర్పంచ్ పి. వినోద్‌కుమార్ తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుభావతి, ఉప సర్పంచ్ తిమ్మప్ప, సాంకేతిక సహాయకుడు నరేష్, వార్డు సభ్యులు, పంచాయతీ అధికారులు, పశువైద్య శాఖ సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బంది, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య జన్మదిన వేడుకలు

- రోగులకు పండ్ల పంపిణీ బీజేపీ శ్రేణులు

పెద్దపల్లి,అక్టోబర్ 01:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య బీసీల ప్రతినిధిగా ఉపాధ్యాయ, నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అమరగాని ప్రదీప్ కుమార్ కొనియాడారు. గురువారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య జన్మదిన వేడుకలు బీజేపీ ఆధ్వర్యంలో జూలపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అమరగాని ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ పెద్దపల్లి ప్రాంతం నుండి బీసీ బిడ్డ ఎమ్మెల్సీగా ఎన్నిక కావడం మన ప్రాంతానికి గర్వకారణమని,ఉపాధ్యాయ నిరుద్యోగ సమస్యల పట్ల పోరాడుతూ ప్రజా సమస్యల



పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో వారు ఇంకా ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షిస్తూ,మండల ప్రజల పక్షాన జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొమ్మా ఐలయ్య,పెద్దల ఐలయ్య,దొడ్ల రాజయ్య, కొమ్మ సతీష్,కొల్లూరి స్వామి,మెరుగు కనకయ్య,సాంబారి శ్రీనివాస్,అమరగాని ఎల్లేష్,సది తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధ యుగంలో మానవత్వం - మానవ విలువలే మనిషికి నిజమైన ఆభరణాలు

- సాంకేతిక ప్రగతికి తోడుగా నైతికత, సహానుభూతి, సామాజిక బాధ్యతలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన సమయం ఇది

హైదరాబాద్ అక్టోబర్:01 (ప్రజా కలం న్యూస్) నేడు ప్రపంచం శరవేగంగా మారుతోంది. ఒకప్పుడు మనిషి ఊహకు మాత్రమే పరిమితమైన ఎన్నో ఆవిష్కరణలు నేడు వాస్తవ రూపం దాల్చుతున్నాయి. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ - ఏఐ) సాంకేతికత మానవ జీవితంలోని దాదాపు అన్ని రంగాల్లోకి ప్రవేశించి, మనిషి ఆలోచించే విధానాన్ని, పనిచేసే పద్ధతులను, జీవనశైలిని గణనీయంగా ప్రభావితం చేస్తోంది. వైద్యం, విద్య, వ్యవసాయం, పరిశ్రమలు, రవాణా, సమాచార రంగాలతో పాటు పాలనలోనూ ఏఐ కీలక పాత్ర పోషిస్తోంది. అయితే ఈ సాంకేతిక విప్లవం మధ్య మనం విస్మరించకూడని అత్యంత ముఖ్యమైన అంశం మానవత్వం, మానవ విలువలు. సాంకేతిక పరిజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినా, మానవ జీవితానికి దిశానిర్దేశం చేసేది మనిషిలోని ఆలోచనా శక్తి, విచక్షణ, నైతికత, సహానుభూతి, సామాజిక బాధ్యతలే. యంత్రాలు సమాచారాన్ని విశ్లేషించగలవు. సంక్లిష్టమైన సమస్యలకు పరిష్కారాలను సూచించగలవు. క్షణాల్లో అనేక పనులను పూర్తి చేయగలవు. కానీ ఒకరి కష్టాన్ని మరొకరు అర్థం చేసుకోవడం, బాధలో ఉన్నవారికి అండగా నిలవడం, ఇతరుల పట్ల కరుణ చూపడం, సమాజ శ్రేయస్సు కోసం త్యాగం చేయడం వంటి మానవీయ లక్షణాలకు మనిషిలోని విలువలే పునాది. అందుకే కృత్రిమ మేధ ఎంతగా అభివృద్ధి చెందినా, సహజ మేధస్సు, మానవ ఆలోచనా శక్తి, నైతిక విచక్షణ ప్రాధాన్యతను ఏమాత్రం విస్మరించకూడదు. సాంకేతిక ప్రగతికి మానవత్వం తోడైనప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. ఏఐ ద్వారా పనులను వేగంగా పూర్తి చేయగలిగినా, వాటి వల్ల సమాజంపై కలిగే ప్రభావాలను అంచనా వేయగల వివేకం మనిషికి అవసరం. సాంకేతికతను కేవలం వ్యక్తిగత ప్రయోజనాలకే పరిమితం చేయకుండా, సమాజంలోని పేదలు, బలహీన వర్గాలు, నిరుపేద విద్యార్థులు, గ్రామీణ ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా వినియోగించాలి. సాంకేతిక విజ్ఞానం కొందరికే పరిమితమైతే అభివృద్ధిలో అసమానతలు పెరిగే అవకాశం ఉంది. అదే పరిజ్ఞానాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురాగలిగితే సమాజంలో సమాన అవకాశాలను కల్పించేందుకు మార్గం సుగమమవుతుంది. ఈ నేపథ్యంలో యువత పాత్ర అత్యంత కీలకం. నేటి యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని వేగంగా అందిపుచ్చుకుంటోంది. స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాలు, కృత్రిమ మేధ వంటి ఆధునిక సాధనాలు వారి దైనందిన జీవితంలో భాగమయ్యాయి. అయితే సాంకేతికతను ఉపయోగించుకోవడం వేరు, దానికి బానిసలుగా మారడం వేరు. నిరంతరం డిజిటల్ ప్రపంచంలోనే గడుపుతూ కుటుంబ సభ్యులతో, స్నేహితులతో, సమాజంతో ప్రత్యక్ష సంబంధాలను తగ్గించుకోవడం వల్ల మానవ సంబంధాల సౌందర్యం దెబ్బతినే ప్రమాదం ఉంది. అందువల్ల యువత సాంకేతికతను తమ జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి, సృజనాత్మకతను వెలికితీయడానికి వినియోగించుకోవాలి. అదే సమయంలో పుస్తక పఠనం, ప్రకృతి పరిశీలన, సామాజిక సేవ, వ్యక్తిగత సంబంధాలకు కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వాలి. మానవ విలువలను పెంపొందించుకోవడానికి ప్రకృతి ఒక గొప్ప పాఠశాల. ప్రకృతిలోని వివిధ జీవరాశులను నిశితంగా పరిశీలిస్తే మనిషి నేర్చుకోవాల్సిన ఎన్నో మంచి లక్షణాలు కనిపిస్తాయి. చీమల క్రమశిక్షణ, తేనెటీగల సమష్టి కృషి, పక్షుల నిరంతర శ్రమ, చెట్ల నిస్వార్థ సేవ, నదుల నిరంతర ప్రవాహం మనకు ఎన్నో జీవన పాఠాలను నేర్పుతాయి. ముఖ్యంగా చెట్లు తమకు అందిన నీడను, ఫలాలను, ఆక్సిజన్‌ను ప్రతిఫలం ఆశించకుండా అందిస్తాయి. ప్రకృతిలోని ఇటువంటి లక్షణాలు నిస్వార్థత, క్రమశిక్షణ, సహనం,



పట్టుదల, సమష్టి కృషి వంటి విలువల ప్రాముఖ్యతను తెలియజేస్తాయి. యువత ఈ లక్షణాలను తమ వ్యక్తిత్వ వికాసంలో భాగంగా చేసుకుంటే వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ, దేశాభివృద్ధికి కూడా తమ వంతు సహకారం అందించగలుగుతుంది. మనిషి అంటే కేవలం శరీరం, విద్య, సంపద, హోదా మాత్రమే కాదు. అతని ఆలోచనలు, ప్రవర్తన, ఇతరుల పట్ల చూపే గౌరవం, కష్టాల్లో ఉన్నవారికి అందించే సహాయం, సమాజం పట్ల నిర్వహించే బాధ్యతలు కూడా అతని వ్యక్తిత్వాన్ని నిర్ణయిస్తాయి. ఉన్నత విద్యను అభ్యసించినా, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్నా, ఇతరుల పట్ల గౌరవం, నిజాయితీ, కరుణ, సహనం వంటి విలువలు లేకపోతే ఆ అభివృద్ధికి సంపూర్ణత ఉండదు. వ్యక్తిగత విజయాన్ని మాత్రమే లక్ష్యంగా పెట్టుకోకుండా, తన ఎదుగుదలతో పాటు సమాజంలోని ఇతరుల అభ్యున్నతికి కూడా కృషి చేయడం నిజమైన వ్యక్తిత్వ వికాసానికి నిదర్శనం. ప్రస్తుత సమాజంలో మతం, కులం, ప్రాంతం, భాష వంటి విభిన్న అంశాల ఆధారంగా ఏర్పడుతున్న విభేదాలను అధిగమించేందుకు మానవత్వాన్ని ప్రాతిపదికగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మతాలు మనిషికి ఆధ్యాత్మిక మార్గదర్శకత్వాన్ని అందించినప్పటికీ, పరస్పర గౌరవం, సహనం, సోదరభావం, ప్రేమ వంటి విలువలు అన్ని మతాల్లోనూ ప్రాధాన్యతను కలిగి ఉన్నాయి. అందువల్ల మతాలకు అతీతంగా మనిషిని మనిషిగా గౌరవించే సంస్కృతిని పెంపొందించాలి. భిన్నత్వంలో ఏకత్వం భారతదేశానికి ఉన్న ప్రత్యేకత. ఈ విలక్షణమైన సామాజిక సమైక్యతను కాపాడుకోవడంలో యువత చురుకైన పాత్ర పోషించాలి. పరస్పర ద్వేషానికి బదులుగా పరస్పర గౌరవాన్ని, విభేదాలకు బదులుగా సంభాషణను, స్వార్థానికి బదులుగా సమష్టి ప్రయోజనాన్ని ప్రోత్సహించాలి. మానవ విలువలు అనేవి కేవలం ప్రసంగాలకో, పుస్తకాలకో పరిమితమయ్యే అంశాలు కావు. అవి మన నిత్యజీవితంలో ఆచరణలో కనిపించాలి. వృద్ధులను గౌరవించడం, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావడం, ప్రజా ఆస్తులను కాపాడటం, సామాజిక బాధ్యతతో వ్యవహరించడం వంటి చిన్న చిన్న చర్యలే గొప్ప మార్పునకు పునాదులు వేస్తాయి. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు కేవలం విద్యా, సాంకేతిక నైపుణ్యాలనే కాకుండా నైతిక విలువలు, సామాజిక బాధ్యత, పౌర స్పృహ, సోదరభావం వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించాలి. ఇందుకోసం చర్చా వేదికలు, సేవా కార్యక్రమాలు, ప్రకృతి పరిరక్షణ కార్యక్రమాలు, వ్యక్తిత్వ వికాస శిబిరాలు, సామాజిక అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలి. కృత్రిమ మేధస్సు భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెంది మానవ జీవితంలో కీలకమైన మార్పులను తీసుకురావడం అనివార్యం. అయితే ఆ మార్పులు మానవాళికి ప్రయోజనం చేకూర్చేలా ఉండాలంటే సాంకేతిక అభివృద్ధికి తగిన నైతిక మార్గదర్శకాలు, మానవీయ దృక్పథం అవసరం. ఏఐ అందించే సమాచారాన్ని విచక్షణతో పరిశీలించడం, తప్పుడు సమాచారాన్ని గుర్తించడం, వ్యక్తిగత గోప్యతను గౌరవించడం, సాంకేతికతను బాధ్యతాయుతంగా వినియోగించడం వంటి అంశాలపై యువతకు అవగాహన కల్పించాలి. సాంకేతికత మనిషి జీవితాన్ని సులభతరం చేయాలి తప్ప, అతని ఆలోచనా స్వేచ్ఛను, సృజనాత్మకతను, మానవ సంబంధాలను బలహీనపరచకూడదు. దేశాభివృద్ధి అనేది కేవలం ఆర్థిక ప్రగతి, పారిశ్రామిక విస్తరణ, సాంకేతిక ఆవిష్కరణలతోనే కాలవలేం. సమాజంలో మానవత్వం, నైతికత, సమానత్వం, సోదరభావం, వరస్పర నమ్మకారం ఎంతగా పరిఢవిల్లుతున్నాయనే అంశాలు కూడా అభివృద్ధికి ముఖ్యమైన కొలమానాలు. సాంకేతికంగా అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడంతో పాటు, మానవ విలువలను గౌరవించే సమాజంగా భారతదేశం నిలవాల్సిన అవసరం ఉంది. ఇందుకు యువతలో సామాజిక స్పృహను పెంపొందించడం, వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడం అత్యంత ఆవశ్యకం. ముగింపుగా, కృత్రిమ మేధస్సు మనిషి సామర్థ్యాలను విస్తరించగలదే తప్ప, మానవత్వానికి ప్రత్యామ్నాయం కాలేదు. యంత్రాల వేగం ఎంత పెరిగినా, మనిషి హృదయంలోని కరుణ, సహానుభూతి, నైతిక విలువలే సమాజానికి నిజమైన బలాన్ని అందిస్తాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూనే సహజ మేధస్సును పదునుపెట్టుకోవడం, విజ్ఞానాన్ని పెంపొందించుకుంటూనే వివేకాన్ని అలవరచుకోవడం, వ్యక్తిగత విజయాన్ని సాధిస్తూనే సామాజిక బాధ్యతను నిర్వర్తించడం నేటి యువత ముందున్న ప్రధాన కర్తవ్యం. సాంకేతికత చేతిలో సాధనంగా ఉండాలి, మానవత్వం మనిషి జీవితానికి మార్గదర్శకంగా నిలవాలి. అప్పుడే కృత్రిమ మేధ యుగంలోనూ మానవ విలువలు సజీవంగా ఉంటాయి. మానవత్వంతో కూడిన సాంకేతిక ప్రగతే సమాజానికి, దేశానికిన నిజమైన అభివృద్ధి .

- కైలాస్ నాగేష్

క్రైస్తవులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించాలి

తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు బిషప్ సుదర్శనం



తల్లాడ ఆగస్టు 1 ప్రజాకలం న్యూస్ : రాష్ట్రంలో ఉన్న క్రైస్తవులకు ప్రభుత్వం సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత కల్పించాలని తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు బిషప్ ఎం డేవిడ్ సుదర్శనం డిమాండ్ చేశారు. గురువారం తల్లాడలో జరిగిన టిసిసి మండల పాస్టర్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాస్టర్లకు ఆంధ్ర రాష్ట్రంలో ఇచ్చిన విధంగా 5వేల గౌరవ వేతనాన్ని తెలంగాణ ప్రభుత్వం కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు, జిల్లా, మండల కేంద్రాల్లో స్మశాన వాటికలు, క్రైస్తవ కళ్యాణ మండపాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. క్రైస్తవులపై నిత్యం దాడులు జరుగుతున్నాయని, వాటిని అరికట్టే విధంగా నూతన చట్టాలు తీసుకురావాలని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆయనను స్థానిక పాస్టర్లు శాలువాలతో సన్మానించి సత్కరించారు. టిసిసి జిల్లా గాస్పెల్ సింగర్ ఖమ్మంపాటి ఇశ్రాయేలు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టిసిసి జిల్లా అధ్యక్షులు గుంటి బాబురావు, రాష్ట్ర కార్యదర్శి నిరీక్షణ రావు, మీడియా అధ్యక్షులు నారపోగు ప్రసాద్, తల్లాడ మండల అధ్యక్షులు ఇనపనూరి ప్రకాష్ రావు, సంఘసాని దానియేలు, దేవ సహాయం, కృష్ణ, సులోమాను తదితరులు పాల్గొన్నారు.

వైద్య చికిత్సకు ఆర్థిక భరోసా..

- తాటి సత్యంకు రూ.34 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు

- పేదల వైద్యానికి సీఎం సహాయనిధి అండ: వాసం శ్రీకాంత్



ఆళ్లపల్లి, అక్టోబర్ 1, (ప్రజాకలం) ఆళ్లపల్లి మండల పరిధిలోని పెద్ద వెంకటాపురం గ్రామానికి చెందిన తాటి సత్యంకు వైద్య చికిత్స నిమిత్తం రూ.34 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కును ఆళ్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాసం శ్రీకాంత్ గురువారం అందజేశారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఆళ్లపల్లి మండల కేంద్రంలో ఈ చెక్కును సత్యం కుటుంబ సభ్యులకు అందించారు.అనారోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తాటి సత్యం కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ ద్వారా అందిన ఈ ఆర్థిక సహాయం కొంత ఊరట కలిగించనుంది శ్రీకాంత్ మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అర్హులైన వారికి ఆర్థిక సహాయం అందేలా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కృషి చేస్తున్నారని వాసం శ్రీకాంత్ తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్కరూ వైద్య చికిత్సకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వ సహాయం అందేలా చొరవ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అవసరమైన సహాయం అందేలా కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా తాటి సత్యం కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు, సీఎంఆర్ఎఫ్ సహాయం అందేలా కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసు అభ్యర్థులు ఉచిత శిక్షణ అవకాశాన్ని వినియోగించుకోవాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ అక్టోబర్ 01 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) పోలీసు ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు జిల్లా కేంద్రంలోనే పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించిన ఉచిత శిక్షణ అవకాశాన్ని ఉద్యోగార్థులు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. గురువారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో జిల్లా పోలీసు



అభ్యర్థులకు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి కలెక్టర్ భవేశ్ మిశ్రా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలీసు అభ్యర్థులకు ఉచిత భోజనంతో పాటు శిక్షణ అందిస్తున్న జిల్లా ఎస్పీ, పోలీసులకు, సహకరిస్తున్నవారికి శుభాకాంక్షలు తెలియజేశారు. హైదరాబాదు లాంటి దూర ప్రాంతానికి వెళ్ళి ఉద్యోగ శిక్షణ పొందడం ఎంతో ఖర్చుతో కూడుకున్న విషయమని, జిల్లా కేంద్రంలోనే అభ్యర్థులకు అందుబాటులో ఉన్న ఈ శిక్షణ ఎంతో మందికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రస్తుత కృత్రిమ మేధ (ఏఐ) కాలంలో ఉద్యోగం పొందడం కష్టంతో కూడుకున్న పని అని, ప్రస్తుతం ఉద్యోగాలకు ఎంతో పోటీ ఉందని, ప్రతి ఒక్కరు కష్టపడి చదివి ఉద్యోగం సాధించాలని ఆకాంక్షించారు. సెల్ ఫోన్ కు దూరంగా ఉండాలని సూచించారు. దూర ప్రాంతాల విద్యార్థులకు వసతి సౌకర్య కల్పనలో తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు.

పోలీసు ఉద్యోగమే లక్ష్యంగా అభ్యర్థులు కష్టపడాలి:జిల్లా ఎస్పీ జానకి షర్మిల

పోలీసు ఉద్యోగమే లక్ష్యంగా ప్రతి ఒక్క అభ్యర్థి కష్టపడి చదువుకోవాలని జిల్లా ఎస్పీ జానకి షర్మిల అన్నారు. జిల్లా అభ్యర్థులకు ఉచిత పోలీసు శిక్షణలో సహకరించినవారికి, స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్న ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు. ఉచిత పోలీసు శిక్షణకు దాదాపు 300 మంది అభ్యర్థులు నమోదు చేసుకున్నారని అన్నారు. అభ్యర్థులకు ఒక పూట ఉచితంగా భోజనం, అల్పాహారం, అవసరమైన తదితర సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. సుదూర ప్రాంత విద్యార్థులకు అవసరమైన వసతి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉద్యోగ సన్నద్ధానికి అవసరమైన మెటీరియల్ సమకూర్చేలా చూస్తామన్నారు. ఉద్యోగార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు అనుభవజ్ఞులైన అధ్యాపకులను నియమించామని, అలాగే స్వయంగా బోధనా అనుభవం ఉన్న పోలీసు సిబ్బందిచే సైతం విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. ప్రతి రెండ్రోజులకు ఒకసారి పరీక్షలు కూడా నిర్వహిస్తామని చెప్పారు. దేహదారుఢ్య (ఫిజికల్ ఈవెంట్స్) పరీక్షలకు అవసరమైన శిక్షణ సైతం అందిస్తామన్నారు. ఎటువంటి ఇబ్బందులు కలిగినా అందుబాటులో ఉన్న సిబ్బందికి తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖైసా ఏఎస్పి సాయి కిరణ్, డీఎస్పి శ్రీనివాస్, ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే విజయరమణ రావు



పెద్దపల్లి,అక్టోబర్ 01:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) తెలంగాణ జానపద సంస్కృతి,సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని,కళలను, కళాకారులను ప్రోత్సహించడమే ఇందిరమ్మ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు పేర్కొన్నారు.మండలంలోని దేవునిపల్లి గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో తార ఆర్ట్స్ అకాడమీ ఆత్మీయ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల స్థాయి జానపద కళాకారుల ఆత్మీయ సమ్మేళన మహోత్సవం ఘనంగా నిర్వహించబడింది. పెద్దపల్లి, మంచిర్యాల, జగిత్యాల జిల్లాల నుంచి విచ్చేసిన పలువురు జానపద కళాకారులతో కూడిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ విజయరమణ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో జానపద కళాకారులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు,జానపద గేయాలు,నృత్యాలు ఆహుతులను విశేషంగా అలరించాయి.

అనంతరం ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న కళాకారుల ప్రతిభను వెలికితీసేందుకు తార ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన ఈ సమ్మేళనం ఎంతో అభినందనీయమని కొనియాడారు. సాంస్కృతిక వైభవాన్ని కాపాడుతూ భావితరాలకు అందించడంలో కళాకారుల పాత్ర కీలకమైనదని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్,పరిసర గ్రామాల సర్పంచ్ లు,తార ఆర్ట్స్ అకాడమీ ప్రతినిధులు,వివిధ జిల్లాల జానపద కళాకారులు,కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, దేవునిపల్లి గ్రామస్తులు,మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష - ఆరు నెలల్లో అంతర్గాం నూతన తహసీల్దార్ కార్యాలయ నిర్మాణం పూర్తి చేయాలి

- భూ రీసర్వేకు ముందే రైతులకు సమాచారం అందించాలి

- నవంబర్ 10లోగా భూ రీసర్వే పూర్తి చేయాలి

- అంతర్గాం,ఆకెనపల్లి,రామగుండంలో క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్



పెద్దపల్లి,అక్టోబర్ 01:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి,నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు.గురువారం అంతర్గాం మండలంలో నూతనంగా నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులను,ఆకెనపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే ప్రక్రియను, రామగుండం తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంతర్గాం మండలంలో నూతనంగా నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచి,రానున్న 6 నెలల్లో నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఏ ఈ ని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ,ఎలాంటి జాప్యం లేకుండా పనులు పూర్తి చేయాలని సూచించారు.

భూ రీసర్వేకు ముందే రైతులకు సమాచారం ఇవ్వాలి

అనంతరం ఆకెనపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే ప్రక్రియను పరిశీలించారు. భూ రీసర్వే నిర్వహించే ముందు సంబంధిత రైతులకు ముందస్తుగా సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు.ఆయా సర్వే నంబర్లకు సంబంధించిన రైతులు సర్వే సమయంలో తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా సమాచారం ఇవ్వాలని సూచించారు.భూ రీసర్వే ప్రక్రియను నవంబర్ 10లోగా పూర్తి చేయాలని ఆదేశించారు.అవసరమైతే అదనపు సర్వేయర్లను కేటాయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.సర్వే ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా,పకడ్బందీగా పనులు చేపట్టాలని సూచించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి

రామగుండం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్, ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఫారం-6 ద్వారా వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం వెరిఫికేషన్ పూర్తి చేయాలని సూచించారు.తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డులు, సంబంధిత ప్రక్రియల పురోగతిని పరిశీలించి,పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ పర్యటనలో ఏడీ సర్వేయర్ సోమేశ్వర్,అంతర్గాం తహసీల్దార్ పడాల ప్రసాద్ రావు,రామ గుండం తహసీల్దార్ రవీందర్‌రావు,అంతర్గాం మండల సర్వేయర్ లలిత,సంబంధిత శాఖలఅధికారులు,తదితరులు, పాల్గొన్నారు.

ఎన్సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలుగా ఆర్ఎం పద్మ



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: అక్టోబర్ 01:(ప్రజా కలం న్యూస్)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం ఎన్సిపి పార్టీ ఎన్డిఏ మహాకూటమి ఎన్సీపీ మహిళా విభాగాన్ని బలోపేతం చేసే దిశగా కీలక నియామకాలు చేపట్టారు. మండల మహిళా అధ్యక్షురాలు ఆర్ఎం పద్మను, మండల ప్రధాన కార్యదర్శిగా కొమరం చిలకమ్మను నియమిస్తూ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో నియామక పత్రాలను అందజేశారు.జిల్లా అధ్యక్షులు ఊకే వెంకన్న సూచనలు, ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు ఎన్సీపీ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మద్దిశెట్టి సామేలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, మండలంలోని ప్రతి గ్రామంలో మహిళా కమిటీలను ఏర్పాటు చేసి పార్టీని గ్రామ స్థాయి నుండి బలోపేతం చేయాలని నూతనంగా నియమితులైన మహిళ నాయకురాలను సూచించారు.మహిళా ప్రెసిడెంట్ ఆర్ఎం పద్మ మాట్లాడుతూ నాపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జిల్లా, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

మండలంలో మహిళా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ప్రభుత్వ పథకాలను అర్హులైన మహిళలకు అందేలా కృషి చేస్తామని, పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పని చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం మహిళా మండల అధ్యక్షురాలు ఊకే చిట్టెమ్మ, మండల ప్రధాన కార్యదర్శి మీసాల సుజాత,బిందు, వర్ష, వసంత, ఆలవాల ప్రమీల, కొమ్మూరు చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ పోలీస్‌స్టేషన్‌లో వీడ్కోలు వేడుకలు

నాలుగేళ్ల సేవలకు ఎస్సై వెంకటకృష్ణ ప్రత్యేక అభినందనలు - బదిలీపై వెళ్తున్న సిబ్బందికి ఘన సత్కారం



తల్లాడ సెప్టెంబర్ 30, ప్రజా కలం న్యూస్

తల్లాడ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ నాలుగేళ్లపాటు పోలీస్‌శాఖకు సేవలందించిన ఏఎస్ఐ,హెడ్ కానిస్టేబుల్‌కు బదిలీ నేపథ్యంలో ఘన వీడ్కోలు కార్యక్రమం నిర్వహించేందుకు పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.నాలుగేళ్ల సేవలకు గుర్తుగా ఆత్మీయ వీడ్కోలు ఎస్ఐ వెంకటకృష్ణ మరియు ఎస్సై వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సన్మానం ఘనంగా ఉన్నతంగా నిర్వహించారు. తల్లాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో విధులు నిర్వహించిన సమయంలో శాంతిభద్రతల పరిరక్షణ,ప్రజలకు అందుబాటులో ఉండటం, పోలీస్‌శాఖకు సంబంధించిన విధులను సమర్థవంతంగా నిర్వహించడంలో వారు అందించిన సేవలను ఈ సందర్భంగా సిబ్బంది గుర్తుచేసుకున్నారు. బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్తున్న ఏఎస్ఐ చెన్నారావు, పిచ్చయ్య, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు లను తల్లాడ పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఆత్మీయంగా సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందజేసి వీడ్కోలు పలికారు ఈ క్రమంలో సన్మాన గ్రహీతలు మమ్మల్ని గుర్తించి మాకు ఇచ్చిన గౌరవం కు వెంకటకృష్ణ మరియు వెంకటేష్ లకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామని వారు ఆనందాన్ని వ్యక్తపరిచారు.విధి నిర్వహణలో వారి సహకారం, సహచరులతో కలిసి మెలిసి పనిచేసిన తీరును సిబ్బంది ప్రశంసించారు. ఎస్సై వెంకటకృష్ణ మాట్లాడుతూ కొత్త బాధ్యతల్లోనూ విధి నిర్వహణలో మరింత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు, తల్లాడలో అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొంటూ,బదిలీపై వెళ్తున్న పోలీస్ సిబ్బంది నూతన విధుల్లోనూ విజయవంతంగా రాణించాలని పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఆకాంక్షించారు.

గువ్వల రామిరెడ్డికి నివాళులర్పించిన నాయకులు



తల్లాడ ఆగస్టు 1 ప్రజా కలం న్యూస్ : తల్లాడకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గువ్వల రామిరెడ్డి ఇటీవల మృతి చెందారు. గురువారం ఆయన దశదినకర్మ గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రెడ్డెం వీర మోహన్ రెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాప సానుభూతిని వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో నాయకులు బీఆర్ఎస్ పార్టీ తల్లాడ మండల ప్రధాన కార్యదర్శి దుగ్గిదేవర వెంకట లాల్, కాంగ్రెస్ నాయకులు పొన్నం కృష్ణయ్య, బీఆర్ఎస్ నాయకులు కొమ్మినేని శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నేత గోపిశెట్టి వెంకటేశ్వర్లును పరామర్శించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి..



తల్లాడ ఆగస్టు 1 ప్రజా కలం న్యూస్ తల్లాడ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గొపిశెట్టి వెంకటేశ్వర్లును రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఇండస్ట్రియల్ చైర్మన్ మువ్వా విజయబాబు పరామర్శించారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను మంత్రి పొంగులేటి పరామర్శించి ధైర్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గోపిశెట్టి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి యోగా క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ తల్లాడ పట్టణ అధ్యక్షులు, నీలాద్రి ఆలయ డైరెక్టర్ దగ్గుల నాగిరెడ్డిని పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొర్రా రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులు గొడుగునూరు లక్ష్మారెడ్డి, తుమ్మలపల్లి రమేష్, ఎర్రి నరసింహారావు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి గుర్తించాలి: తానూర్ తహశీల్దార్‌కు వినతి



తానూర్, అక్టోబర్ 01 (ప్రజా కలం): గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులకు ప్రభుత్వ జీవో ప్రకారం శిక్షణ ఇచ్చి, అధికారికంగా గుర్తించాలని తానూర్ మండల డాక్టర్ల అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. గురువారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ మహేందర్ నాథ్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.

ఈ సందర్భంగా డాక్టర్ల అసోసియేషన్ మండల అధ్యక్షుడు డాక్టర్ రాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం చొరవ తీసుకుని ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు నాగభూషణ్, కార్యదర్శి ప్రసాద్, వైద్యులు ఆలే, కేకే దత్తా, సూర్యకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్య ఘర్‌తో సౌర విద్యుత్ సద్వినియోగం

- గృహ విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చు

- సేవా సేతు కార్యక్రమంలో అవగాహన సదస్సు



నిర్మల్ అక్టోబర్ 01 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) గృహ వినియోగదారులు సౌర విద్యుత్‌ను సద్వినియోగం చేసుకుని విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవాలని విద్యుత్, బ్యాంకింగ్ శాఖల అధికారులు సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'పీఎం సూర్య ఘర్-ముఫ్త్ బిజ్లీ యోజన' పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గురువారం నిర్మల్ పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో సేవా సేతు కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. పథకం కింద గృహాలపై రూఫ్‌టాప్ సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా సొంత అవసరాలకు విద్యుత్ ఉత్పత్తి చేసుకోవడంతో పాటు విద్యుత్ బిల్లుల భారాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ, రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు విధానం, దరఖాస్తు ప్రక్రియ, బ్యాంకు రుణ సదుపాయాలపై వినియోగదారులకు వివరించారు. పథకం ప్రయోజనాలు అర్హులైన ప్రతి గృహ వినియోగదారుడికి చేరేలా విద్యుత్, బ్యాంకింగ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై ఆసక్తి ఉన్నవారికి దరఖాస్తు విధానం, అవసరమైన పత్రాలపై పూర్తి సహకారం అందించాలని తెలిపారు. అర్హత కలిగిన దరఖాస్తుదారులకు బ్యాంకులు సకాలంలో రుణ సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సౌర విద్యుత్ వినియోగం వల్ల సంప్రదాయ విద్యుత్‌పై ఆధారపడటం తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని అధికారులు వివరించారు. ప్రజలు పథకంపై పూర్తి అవగాహన పెంచుకుని అందుబాటులో ఉన్న ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజీఎన్పీడీసీఎల్ డివిజనల్ ఇంజినీర్ నాగరాజు, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్, టౌన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ శ్రీనివాస్‌తో, విద్యుత్, బ్యాంకింగ్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సమరసతకు ప్రతీక భోసి వినాయక ఉత్సవాలు: అప్పాల ప్రసాద్



తానూర్, అక్టోబర్ 01 (ప్రజా కలం): భోసి గ్రామంలోని శ్రీ వరసిద్ధి కర్ర వినాయక దేవాలయ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి, గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు సమావేశంలో 'సామాజిక సమరసత వేదిక' రాష్ట్ర ప్రముఖ్ అప్పాల ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "ఊరంతా ఏకమై, కులమతాలకు అతీతంగా గణేష్ ఉత్సవాలను జరుపుకోవడం ఎంతో ఆదర్శనీయం. ప్రతి ఒక్కరూ సనాతన ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి" అని పిలుపునిచ్చారు,ఈ వేడుకల్లో భాగంగా గ్రామాభివృద్ధికి తోడ్పడుతున్న ప్రజాప్రతినిధులను, దేశ రక్షణలో ఉన్న జవాన్లను, అన్నదాతలైన రైతులను ఘనంగా సన్మానించారు, అలాగే, దేవాలయ అభివృద్ధి నిమిత్తం రూ. 51,000 విరాళంగా అందజేసిన కారగిరి లక్ష్మీబాయి దాతృత్వాన్ని కొనియాడుతూ, ఆలయ కమిటీ సభ్యులు ఆమెను ప్రత్యేకంగా సత్కరించారు, ఈ కార్యక్రమంలో సుజన్ రెడ్డి, దేవాలయ కమిటీ చైర్మన్ ఉత్తమ్ భాలేరావు, ఉపసర్పంచ్ సల్ల లక్ష్మణ్, వార్డు సభ్యులు, వీడీసీ కమిటీ ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం

- 59 మంది స్వచ్ఛందంగా రక్తదానం



ప్రజాకలం ప్రతినిధి, భద్రాచలం, అక్టోబర్ 1:

జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆధ్వర్యంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా ఇంజిరామ్లోని 219వ బెటాలియన్ సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆపరేషన్ కొంటా అధికారి శ్రీ రాజేష్ పాండే, డీఐజీ, ఓపీఎస్ కుంట ప్రారంభించారు.ఈ సందర్భంగా రాజేష్ పాండే మాట్లాడుతూ రక్తదానం గొప్ప మానవతా సేవ అని అన్నారు. ప్రమాద బాధితులు, తలసేమియా, సికిల్ సెల్ అనీమియా, క్యాన్సర్ తదితర వ్యాధులతో బాధపడుతున్న వారికి అత్యవసర సమయాల్లో రక్తం ఎంతో అవసరమని తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్లు ప్రేమ్ జీత్ కుమార్, విజయ భాస్కర్, పార్థసారథి ఘోష్, విశ్వదీప్, సుధీర్ కుమార్ చౌహాన్, మెడికల్ ఆఫీసర్ డా. సుప్రియతో పాటు సీఆర్‌పీఎఫ్ జవాన్లు పాల్గొన్నారు. మొత్తం 59 మంది రక్తదానం చేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చైర్మన్ డా. ఎస్.ఎల్. కాంతారావు, వైస్ చైర్మన్ చల్లగుళ్ల నాగేశ్వరరావు హాజరై రక్తదాతలను అభినందించారు. భద్రాచలంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ ఆధునిక సౌకర్యాలతో సురక్షితమైన రక్తాన్ని అవసరమైన వారికి అందిస్తోందని వారు తెలిపారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సీఆర్‌పీఎఫ్ అధికారులను సత్కరించి, వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డా. ఎ.ఎస్.ఆర్. చంద్ర ప్రసాద్, జిల్లా కోశాధికారి టి.వి. బాలయోగి, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.బి.జి. తిలక్, ఎం.బి. నర్సారెడ్డి, పల్లంటి దేశప్ప, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవి/ఎయిడ్స్‌పై కళాజాత ద్వారా విస్తృత అవగాహన

- చికిత్స కంటే నివారణే మేలు: డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం.డి. రఫీక్



నాగర్‌కర్నూల్ అక్టోబర్ 01ప్రజాకలం : హెచ్ఐవి/ఎయిడ్స్ నివారణ, నియంత్రణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కళాజాత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అక్టోబర్ 1న నాగర్‌కర్నూల్ ఆర్టీసీ బస్టాండ్‌లో డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం.డి. రఫీక్ కళాజాతను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ హెచ్ఐవి/ఎయిడ్స్ వ్యాప్తి, నివారణ మార్గాలపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా వ్యాధి నియంత్రణ సాధ్యమవుతుందని తెలిపారు. చికిత్స కంటే నివారణే మేలని, ప్రతి ఒక్కరూ హెచ్ఐవి వ్యాప్తి మార్గాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కళాజాత బృందాలు పాటలు, నాటికలు, కళారూపాల ద్వారా హెచ్ఐవి వ్యాప్తి, నివారణ చర్యలు, హెచ్ఐవి నిర్ధారణ పరీక్షల ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయి. జిల్లాలోని ఐసీటీసీ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న హెచ్ఐవి నిర్ధారణ పరీక్షలు, ఏఆర్టీ చికిత్సా విధానాలపై కూడా ప్రచారం చేస్తున్నారు. హెచ్ఐవి సోకే ప్రమాదం ఉన్న వర్గాలపై ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కళాజాత ప్రదర్శనలతో పాటు ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేస్తూ హెచ్ఐవి/ఎయిడ్స్‌పై అపోహలను తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. అక్టోబర్ 2న కల్వకుర్తి, 3న తెలకపల్లి–అచ్చంపేట ప్రాంతాల్లో, 4న పెంట్లవెల్లి–కొల్లాపూర్ ప్రాంతాల్లో కళాజాత ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కళాజాత బృందాల సభ్యులు పాల్గొన్నారు.

"స్వచ్ఛతా హి సేవా"లో భాగంగా "వ్యర్థాల నుండి కళాకృతులు తయారీ"

ఇబ్రహీంపట్నం అక్టోబర్ 01(ప్రజా కలం ప్రతినిధి)

ఇబ్రహీంపట్నం మండలంలోని కోజన్‌కొత్తూరు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా కోజన్‌కొత్తూరు మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ఆధ్వర్యంలో "వేస్ట్ టూ వెల్త్ -- వ్యర్థాల నుండి కలకృతులు తయారీ " ప్రదర్శన నిర్వహించారు.ఈ ప్రదర్శనలో విద్యార్థులు పనికిరాని వస్తువులు, ప్లాస్టిక్, పేపర్, కార్డ్‌బోర్డ్ తదితర వ్యర్థ పదార్థాలను సృజనాత్మకంగా వినియోగించి వివిధ రకాల అలంకరణ వస్తువులు, బొమ్మలు, మోడల్స్, వాహనాలు మరియు ఉపయోగకరమైన వస్తువులను తయారు చేసి ప్రదర్శించారు. రెడ్యూస్ రేస్.రేసైకిల్ విధానంలో వ్యర్థాలను తిరిగి వినియోగించుకోవచ్చని విద్యార్థులు తమ ప్రదర్శనల ద్వారా చాటిచెప్పారు.

ఈ సందర్భంగా ఎంపీడీవో చెప్పు. గణేష్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణపై అవగాహన పెంపొందించడం ఎంతో ముఖ్యమని అన్నారు. విద్యార్థులు తమ సృజనాత్మకతతో వ్యర్థ పదార్థాలకు కొత్త రూపం ఇవ్వడం అభినందనీయమని తెలిపారు.సబీమ్ జిల్లా కోఆర్డినేటర్ హరిణి మాట్లాడుతూ, "వ్యర్థాలు అంటే పనికిరాని వస్తువులు మాత్రమే కాదు. విద్యార్థుల సృజనాత్మకత, ఆలోచనా శక్తి, నైపుణ్యంతో వాటికి కొత్త అర్థం, కొత్త రూపం, కొత్త ఉపయోగం ఇవ్వవచ్చు. పనికిరావని భావించిన వ్యర్థ పదార్థాలతో అందమైన, ఉపయోగకరమైన వస్తువులను తయారు చేయడం విద్యార్థుల సృజనాత్మకతకు నిదర్శనం. 'వేస్ట్ టూ వెల్త్ ' భావనను ఆచరణలో చూపిస్తూ, వ్యర్థాలను వనరులుగా మార్చే ఆలోచనను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి" అని అన్నారు.





ఎంపీవో రామకృష్ణ రాజు విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను పరిశీలించి, వారి ప్రతిభను మరియు సృజనాత్మకతను అభినందించారు. విద్యార్థులు స్వచ్ఛత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని తమ కుటుంబాలు, గ్రామ ప్రజల్లో కూడా అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చెప్పు. గణేష్, సబీమ్ జిల్లా కోఆర్డినేటర్ హరిణి, ఎంపీవో రామకృష్ణ రాజు, సర్పంచ్ చల్లా రక్షిత, పంచాయతీ కార్యదర్శి కె. రాకేష్, హెచ్ఎం. శోభా రాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల ప్రదర్శనలను అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించి అభినందించారు.

ఆదర్శ ఉపాధ్యాయుడు తాటి బిక్షమయ్య మృతి

ఉపాధ్యాయ లోకానికి తీరని లోటు



ఆళ్లపల్లి,అక్టోబర్ 1 (ప్రజాకలం) గిరిజన మొదటి తరం ఉపాధ్యాయులలో తాటి బిక్షమయ్య ఒకరని, ఆయన అనేక మంది గిరిజన, గిరిజనేతర విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో సఫలీకృతులయ్యారని, అటువంటి వ్యక్తి అకాల మరణం చెందడం ఉపాధ్యాయ లోకానికి, సమాజానికి, టీపీటీఎఫ్ ఉద్యమానికి తీరని లోటని టీపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యాయ దర్శిని పత్రిక సంపాదకులు పి.నాగిరెడ్డి అన్నారు.టేకులపల్లిలోని మూడ్ తండాలోని ఆయన స్వగృహంలో తెలంగాణ ప్రోగ్రెస్ టీచర్స్ ఫెడరేషన్ ఆళ్లపల్లి, టేకులపల్లి మండల శాఖల ఆధ్వర్యంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్ నాయక్ అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు.మొదట తాటి బిక్షమయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం పి.నాగిరెడ్డి మాట్లాడుతూ, బిక్షమయ్య 40 సంవత్సరాలుగా గిరిజన సంక్షేమ శాఖలోని అనేక పాఠశాలల్లో వేలాది మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. ఆ రోజుల్లో గ్రామాలకు కనీస రవాణా సౌకర్యాలు, సరైన దారులు లేని కాలంలో కూడా పాఠశాల విధులకు క్రమం తప్పకుండా హాజరై విద్యాబోధన చేశారని, ఆయన వద్ద చదువుకున్న అనేక మంది గిరిజన విద్యార్థులు నేడు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారని తెలిపారు.టీపీటీఎఫ్ సంఘంలో వివిధ హోదాల్లో పనిచేస్తూ ఉపాధ్యాయ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని, ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం టీపీటీఎఫ్ కృషి చేస్తుందని, ప్రభుత్వపరంగా ఆయన కుటుంబ సభ్యులకు రావాల్సిన అన్ని రకాల బెనిఫిట్స్ ఇప్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. చివరిగా ఆయన ఆళ్లపల్లి మండలంలోని జీపీఎస్ రామచంద్రయ్యగూడెం పాఠశాలలో పనిచేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జోగరాంబాబు, పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఎస్.పూర్ణచంద్రరావు, పూర్వ రాష్ట్ర కౌన్సిలర్ పి.శ్రీనివాసరావు, ఆళ్లపల్లి ఎంఈఓ కొమరం శాంతారావు, ఏజీహెచ్ఎస్ అనంతోగు ప్రధానోపాధ్యాయురాలు భద్రమ్మ, పూర్వ జిల్లా అధ్యక్షులు గుమ్మడి సమ్మయ్య, జిల్లా కార్యదర్శి జి.భాగ్యరావు, పూర్వ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ఆంతోని, టేకులపల్లి, ఇల్లందు, గుండాల, ఆళ్లపల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.రామరాజు, పి.సమ్మయ్య, కె.వెంకటేశ్వర్లు, ఈ.ముత్తయ్య, పి.సర్వేశ్వరరావు, బి.వెంకట్రామ్, టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి హతిరాం, ఉపాధ్యాయులు కొమరం వసంతరావు, పాషా, రామకృష్ణ, వీరన్న, చిన్న, లక్ష్మీనారాయణ, కొమరం లాలయ్య, శ్రీను, రామయ్య, సీఆర్పీ రామయ్య, ప్రేమ్ సింగ్, కృష్ణ, మోహన్ బాబు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌ను బలోపేతం చేయాలి

ప్రభుత్వ విప్ శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

పేదలకు మెరుగైన వైద్యం కోసం ఆధునిక భవన నిర్మాణం

అత్యాధునిక పరికరాలతో డయాగ్నోస్టిక్ సేవలు

దాతలు, ప్రముఖులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపు

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 01:

సమాజంలోని పేదలు, నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు రెడ్‌క్రాస్ సొసైటీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి అన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ ప్రధాన కార్యాలయంలో సోషల్ జస్టిస్, వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్, రెడ్‌క్రాస్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు దాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వారికి ఆయన ప్రశంసావత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మహబూబ్‌నగర్ రెడ్‌క్రాస్ సొసైటీకి నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. నూతన చైర్మన్, వైస్ చైర్మన్, ట్రెజరర్ సహా కార్యవర్గ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం ఉన్న రెడ్‌క్రాస్ కార్యాలయం చిన్నదిగా, ఇరుకుగా ఉండటంతో సేవల విస్తరణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా అత్యాధునిక వైద్య పరికరాలు, ఆధునిక డయాగ్నోస్టిక్ సేవలతో కూడిన నూతన భవన నిర్మాణాన్ని చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పెరుగుతున్న వైద్య ఖర్చుల దృష్ట్యా పేదలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోకుండా, నామమాత్రపు ఖర్చుతోనే అన్ని రకాల వైద్య పరీక్షలు, చికిత్స అందేలా ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

రెడ్‌క్రాస్ వంటి సంస్థల సేవలను విస్తరించడానికి రాజకీయాలకు అతీతంగా పట్టణ ప్రముఖులు, వ్యాపారవేత్తలు, సేవా భావం ఉన్న ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజ భాగస్వామ్యం, విరాళాల ద్వారానే వేలాది మంది పేదలకు సహాయం అందించవచ్చన్నారు. అలాగే గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ఆరోగ్యం, పరిశుభ్రత, మహిళా మరియు శిశు సంరక్షణపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. రెడ్‌క్రాస్‌ను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా నిలవాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ విప్ గారిని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కె ఎస్ రవికుమార్, వైస్ చైర్మన్ రామకృష్ణయ్య, , ట్రెజరర్ జి .రమణయ్య తో పాటు సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హుమన్ రైట్స్ కౌన్సిల్ కార్యదర్శి దివ్య జ్యోతి, మాజీ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ లయన్ నటరాజ్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు మెట్టుకాడి ప్రభాకర్,వివిధ ప్రజా సంఘాల నాయకులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆసరా కోల్పోయిన మహిళలకు ప్రభుత్వం అండ..!

- టిడిపి రాష్ట్ర నాయకులు మువ్వా శ్రీనివాస్

- ఐ టిడిపి మండల అధ్యక్షులు బాచినేని శ్రీకాంత్

- ఎటపాక మాజీ సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు

- బొజ్జిగుప్పలో నూతన స్పాజ్ పింఛన్ల పంపిణీ

ప్రజాకలం ప్రతినిధి ఎటపాక ,అక్టోబర్ 01 : భర్త మరణంతో ఆసరా కోల్పోయిన మహిళలకు కూటమి ప్రభుత్వం స్పాజ్ పింఛన్ అందజేసి ఆర్థిక భరోసా కల్పిస్తోందని టిడిపి రాష్ట్ర నాయకులు మువ్వా శ్రీనివాస్ , ఐ టిడిపి మండల అధ్యక్షులు బాచినేని శ్రీకాంత్ , ఎటపాక మాజీ సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు అన్నారు. ఎటపాక మండల పరిధిలోని బొజ్జిగుప్ప గ్రామంలో నూతన స్పాజ్ పింఛన్లను వారి చేతుల మీదుగా గురువారం నాడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మువ్వ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి భాస్కర్ ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం నిర్ణయంలో భాగంగా ఎటపాక పంచాయతీ బొజ్జిగుప్ప గ్రామంలో నూతన స్పాజ్ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ రాష్ట్ర ప్రభుత్వం రూ. 4వేలు అందించడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఎల్లప్పుడు ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను , ప్రతి హామీని నెరవేర్చటంలో చిత్తశుద్ధితో ఉందని పేర్కొన్నారు. దేశంలో వృద్ధులకు , వితంతువులకు రూ. 4 వేలు పెన్షన్ , వికలాంగులకు రూ. 6 వేలు దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న తలసేమియా బాధితులు , కిడ్నీ బాధితులకు రూ. 10 వేలు అందజేసి భరోసా ఇస్తూ చరిత్రలో మిగిలిపోయే విధంగా పాలన అందిస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం ఒక్కటేనని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అనుగోజు మురళి , సచివాలయ సిబ్బంది , పింఛన్ దారులు , తదితరులు పాల్గొన్నారు.



స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ దిశానిర్దేశం

- ఎటపాక మండల స్థాయి సమావేశం అక్టోబర్ 3న..

ప్రజాకలం ప్రతినిధి, ఎటపాక:అక్టోబర్ 01

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వైఎస్సార్‌సీపీ ఎటపాక మండల స్థాయి సమావేశాన్ని అక్టోబర్ 3వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు గన్నవరం గ్రామంలో నిర్వహించనున్నట్లు మండల కమిటీ తెలిపింది. మండల ప్రధాన కార్యదర్శి ఆకుల దయాకర్ నివాసంలో జరిగే ఈ సమావేశానికి రంపచోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అధ్యక్షత వహించనున్నారు. ఈ సమావేశంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే పదవీకాలం పూర్తయిన సర్పంచులు, ఎంపీటీసీలను వేదికపై ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు, కార్యకర్తల కోసం చేపట్టిన రూ. 5 లక్షల బీమా పథకానికి సంబంధించిన పార్టీ గుర్తింపు కార్డులను కూడా ఈ కార్యక్రమంలో అందజేయనున్నట్లు వెల్లడించారు.

ఎటపాక మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ హోదాల్లో ఉన్న పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కమిటీ కోరింది.

తల్లాడలో సెంట్రల్ లైటింగ్, డివైడర్ ఏర్పాటు చేయాలని

ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌కి వినతి



తల్లాడ. అక్టోబర్ 1 ప్రజాకలం న్యూస్ ఖమ్మంజిల్లాలో ప్రధాన నగరాలకు కూడలిగా ఉన్న తల్లాడ పట్టణంలో సెంట్రల్ లైటింగ్, డివైడర్ ఏర్పాటుకు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులు గొడుగునూరి లక్ష్మారెడ్డి గారి ఆధ్వర్యంలో సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి గారికి వినతిపత్రం అందించారు. గురువారం తల్లాడ మండలంలో పర్యటించిన ఎమ్మెల్యేకు వారు వినతిని అందించారు. జిల్లాలో ప్రధాన నగరాలకు కూడలిగా ఉన్న తల్లాడలో సెంట్రల్ లైటింగ్, డివైడర్ లేకపోవడంతో ఈ ప్రాంత వాసులు, వాహనదారులు అనేక అవస్థలు పడుతున్నారని వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే గారు వెంటనే ఈ విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారులకు ఫోన్ ద్వారా వివరాలు అందించి, సెంట్రల్ లైటింగ్, డివైడర్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు, జిల్లా కమిటీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు ,

కరెంట్ కోతలతో బీటలుగ మారిన వరిపంటలు

బిజెపి మండలాధ్యక్షులు వడ్ల అరవింద్ చారి

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.. రైతుపంటకి నీళ్ళులేవు

మరికంచంలోకి ముద్ద ఎక్కనుండి వస్తది

నందిగామ అక్టోబర్ ప్రజా కలం ప్రతినిధి : నందిగామ: రైతు సంక్షేమ ప్రభుత్వంగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం వేళాపాళా లేని కరెంట్ కోతలతో అన్నదాతల కుటుంబాలను ఆందోళనకు గురి చేస్తున్నదని భారతీయ జనతాపార్టీ నందిగామ మండలాధ్యక్షులు వడ్ల అరవింద్ చారి ఆరోపించారు. వ్యవసా యరంగానికి 24గంటల ఉచిత విద్యుత్తు ఇవ్వాల్సిన రాష్ట్ర ప్రభుత్వ అసమర్థ విధానాలతో ఉదయం నుండి సాయంత్రం వరకు మాత్రమే విద్యత్తు సరఫరా చేస్తుండడంతో నీరు సరిపోక పొట్టకొచ్చిన వరి పంటలు ఎండిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు నీరు లేక తమ కళ్ళముందే ఎండిపోతుండడం చూసి రైతన్నల కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయని అరవింద్ చారి విచారం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రత్యామ్నాయ చర్యలతో వ్యవసాయరంగానికి 24గంటల నిరంతర విద్యుత్తును సరఫరా చేసి రైతన్నలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఉదయం నందిగామ మండలం నర్సప్పగూడ శివారులో కరెంట్ కోతలతో నీరు లేక ఎండిన వరిపంటలను రైతులతో కలిసి అరవింద్ చారి పరిశీలించారు.



ఉదండపూర్ ఆర్ అండ్ ఆర్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

– సర్పంచులు గ్రామసభలు నిర్వహించి ప్లాట్ల కేటాయింపు వేగవంతం చేయాలి
– జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 01:

ఉదండపూర్ రిజర్వాయర్ భూ నిర్వాసితులకు సంబంధించిన పునరావాసం ఉ పునర్నిర్మాణం (ఆర్ అండ్ ఆర్) సమస్యల పరిష్కారంపై జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా గురువారం కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వల్లూరు, ఉదండపూర్ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, సంబంధిత జిల్లా అధికారులతో సమావేశమై ఆర్ అండ్ ఆర్‌కు సంబంధించిన సమస్యలను కలెక్టర్ తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అధికారులు ఉదండపూర్, వల్లూరు తదితర గ్రామాలకు సంబంధించిన పరిహారం, పునరావాస ప్రక్రియపై వివరాలను కలెక్టర్, ఎమ్మెల్యేలకు వివరించారు. ఉదండపూర్, వల్లూరుకు, పోలేపల్లికి ఒంటిగుడిసె, శామగడ్డ తండా, చిన్నగుట్ట తండా,తుమ్మలగుట్ట తండా, రేగడిపట్టీ తండా, లలో నిర్వాసితునదరిని గుర్తించి భూ పరిహారం అవార్డులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఆ గ్రామాలలో ఉన్న మొత్తం ఇళ్లను కూడా గుర్తించి నోటిపై చేసి, వాటికి కూడా అవార్డులు జారీ చేయడంతో పాటు దాదాపు అన్ని పరిహారాలు చెల్లించినట్లు అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, ఇప్పటివరకు దాదాపు 99 శాతం భూ సేకరణ అవార్డులు పూర్తయ్యాయని, భూ సేకరణ, ఇళ్ల ప్యాకేజీ, ఇళ్ల స్థలాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి చెల్లించాల్సిన మొత్తాలను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. మిగిలిన ఒక శాతం లబ్ధిదారుల సమస్యలను కూడా ఒక్కొక్కటిగా పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. ఆర్ అండ్ ఆర్ లేఅవుట్‌లో కేటాయించిన ప్లాట్లలో ఇళ్ల నిర్మాణానికి వీలుగా సర్పంచులు వెంటనే గ్రామసభలు నిర్వహించి ప్లాట్ల కేటాయింపులు, ఇతర అవసరమైన తీర్మానాలు చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామసభల తేదీ, ప్రదేశాన్ని సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులతో చర్చించి త్వరగా ఖరారు చేసి, ప్లాట్ల కేటాయింపు ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించారు.

ఆర్ అండ్ ఆర్ లబ్ధిదారుల నుంచి వచ్చే ఫిర్యాదులను క్రమబద్ధంగా స్వీకరించి, ప్రతి కేసుపై లిఖితపూర్వకంగా స్పష్టమైన సమాధానం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అర్హత లేని దరఖాస్తులను తిరస్కరిస్తే అందుకు గల కారణాలను, అర్హత ఉన్న కేసులను ఆమోదిస్తే సంబంధిత వివరాలను స్పష్టంగా తెలియజేయాలని సూచించారు.ప్రతి 15 రోజులకు ఒకసారి ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు సమావేశమై పెండింగ్ సమస్యల పరిష్కారంపైసమీక్షించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అధికారుల మధ్య సమాచార లోపం లేకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ప్లాట్ల కేటాయింపుతో పాటు రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, పారిశుద్ధ్యం, శ్మశానవాటిక/ఖబరస్తాన్ తదితర మౌలిక వసతులకు సంబంధించిన అవసరాలను కూడా ముందుగానే గుర్తించి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

15 రోజుల్లో సమస్యల పరిష్కారానికి కృషి: జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ.. ఆర్ అండ్ ఆర్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగంతో కలిసి కృషి చేస్తామని తెలిపారు. సర్పంచులుం గ్రామసభలను త్వరగా నిర్వహించి, వచ్చే 15 రోజుల్లోపు పెండింగ్ అంశాలను సాధ్యమైనంత వరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్లాట్ల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని, పెండింగ్ కేసులను కూడా పరిశీలించి పరిష్కరించాలని అధికారులను కోరారు.పునరావాస ప్రాంతంలో ఖబరస్తాన్/శ్మశానవాటిక, ఫంక్షన్ హాళ్లు, రహదారులు తదితర మౌలిక వసతుల అంశాలపై కూడా సంబంధిత అధికారులతో సమస్వయం చేసుకుంటూ చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపుకు సంబంధించిన అంశంపై ఇప్పటికే చర్యలు కొనసాగుతున్నాయని, సంబంధిత శాఖతో సమన్వయం చేసి త్వరితగతిన ఉత్తర్వులు వచ్చేలా ప్రయత్నిస్తామని చెప్పారు.ఆర్ అండ్ ఆర్‌కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల పూర్తి జాబితాను తదుపరి సమావేశానికి సిద్ధం చేయాలని అధికారులను కోరారు. ప్రతి దరఖాస్తును ఒక్కొక్కటిగా పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిష్కరించలేని కేసుల విషయంలో కూడా కారణాలను స్పష్టంగా లిఖితపూర్వకంగా తెలియజేయాలని అన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, భూ సేకరణ డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, ఆర్‌డీఓ నవీన్, పంచాయతీరాజ్ ఎన్ఈ, ఇరిగేషన్ శాఖ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు, వల్లూరు, ఉదండపూర్ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలల అభివృద్ధి కి
4 కోట్ల 72 లక్షల నిధులు

- గిరిజన తండాల్లో కమ్యూనిటీ హాల్ లకు కోటీ 60 లక్షల నిధుల మంజూరు
- ప్రెస్ మీట్ లో వివరాలు వెల్లడించిన ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్



నిర్మల్ అక్టోబర్ 01 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ముధోల్ నియోజకవర్గంలో గిరిజన పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని, ఆశ్రమ పాఠశాలల్లో సౌకర్యాల కల్పన, అభివృద్ధి పనులకు నాలుగు కోట్ల 72 లక్షల నిధులు మంజూరు చేయడం జరిగిందని ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ వెల్లడించారు. గురువారం లోకేశ్వరం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పలమార్లు గిరిజన ఆశ్రమం పాఠశాలలకు వెళ్లి సమస్యలు తెలుసుకుని నిధులు ఇవ్వాలని సంబంధిత శాఖ మంత్రికి విన్నవించడంతో నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. భైంసా లోని గిరిజన ఆశ్రమ పాఠశాలకు ఒక కోటి 90 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందని అదనపు తరగతి గదుల నిర్మాణం, కిచెన్ సెడ్ డైనింగ్ హాల్ కోసం నిధులు ఇచ్చామని చెప్పారు. అదేవిధంగా కుబీర్ మండలంలోని దోదర్న గిరిజన ఆశ్రమ పాఠశాలకు 99 లక్షల రూపాయల నిధులు కేటాయించమన్నారు. తానూర్ మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలకు కోటి 73 లక్షల రూపాయలు నిధులు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ నిధులతో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

గిరిజన తండాల్లో 15 కమ్యూనిటీ హాల్ లకు కోటి 60లక్షల రూపాయల నిధులు

నియోజకవర్గంలో ని 15 గిరిజన తండాల్లో కమ్యూనిటీ హాల్ ల నిర్మాణానికి కోటి 60 లక్షల రూపాయల నిధులు వెచ్చించడం జరిగిందన్నారు. ఒక్కో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 10 లక్షల రూపాయలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కుభీర్ మండలంలోని రంగశివిని తండా, బ్రహ్మేశ్వర్ తండా, ఫకీర్ నాయక్ తాండ, దోదర్న తండా నెంబర్5, రంజని తాండ, లోకేశ్వరం మండలం లోని నరసింహ నగర్ తాండ, నగర్ తండా, తానూర్ మండలంలో ఝరితండా, హిప్నల్లి తాండ, బామ్ని తాండ, ముధోల్ మండలంలో చింతకుంట తండా, ఎడ్ బిడ్ తండా, విట్టాలి తండా, కుంటాల మండలంలో అంబకంటి తండా, హన్య తండాల్లో కమ్యూనిటీ హాల్ ల నిర్మాణానికి నిధులు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సంబంధిత శాఖ మంత్రి ఆడ్లురి లక్ష్మణ్ కు జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు ధన్యవాదాలు తెలిపారు.

అభివృద్ధికి నిధులు తెచ్చినందుకు ధన్యవాదాలు

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సౌకర్యాల కోసం నాలుగు కోట్ల 72 లక్షల రూపాయలు నిధులు, తండాల్లో కమ్యూనిటీ హాల్ ల నిర్మాణానికి కోటి ?60 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయించినందుకు ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ కు బైంసా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ బాబు ధన్యవాదాలు తెలియజేశారు.

ఆల్లపల్లిలో పారిశుద్ధ్య పనులపై సర్పంచ్ ప్రత్యేక దృష్టి

చెత్తాచెదారం తొలగింపు.. పరిశుభ్రతకు పెద్దపీట
ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా సర్పంచ్ వాసం సుస్మిత ఆధ్వర్యంలో శుభ్రత కార్యక్రమాలు



ఆల్లపల్లి, అక్టోబర్ 1 (ప్రజాకలం) ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ ఆల్లపల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. గ్రామంలోని ప్రధాన రహదారులు, వీధుల్లో రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించారు. రోడ్ల వెంట ఎత్తుగా పెరిగిన మండలు, పిచ్చిమొక్కలను నరికివేసి పరిసరాలను పరిశుభ్రంగా మార్చే పనులు చేపట్టారు.ఈ పారిశుద్ధ్య పనులను గ్రామ సర్పంచ్ వాసం సుస్మిత స్వయంగా పర్యవేక్షిస్తూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య పనులను నిరంతరం కొనసాగించాలని సూచించారు.ఈ సందర్భంగా సర్పంచ్ వాసం సుస్మిత మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం గ్రామపంచాయతీ ప్రధాన బాధ్యత అని అన్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడంతోపాటు, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రజలు సహకరించాలని కోరారు.గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచడమే మా లక్ష్యం. పారిశుద్ధ్య పనులు ఒక్కరోజుతో ముగిసేవి కావు. నిరంతరం కొనసాగిస్తాం. ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ గ్రామపంచాయతీకి సహకరించాలి. పరిశుభ్రమైన వాతావరణం ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. ప్రతి కుటుంబం పరిసరాల పరిశుభ్రతపై బాధ్యత తీసుకోవాలి అని సర్పంచ్ వాసం సుస్మిత అన్నారు

వృద్ధురాలి పరిస్థితిపై అదనపు కలెక్టర్ పరిశీలన

అనంతమ్మ ఆరోగ్య, ఆర్థిక పరిస్థితులపై ఆరా
కుటుంబ సభ్యులు బాధ్యత తీసుకునేలా నోటరీ హామీ పత్రం పొందాలని ఆదేశం
సురక్షిత ఆశ్రయం, వైద్యం, సంక్షేమ సహాయం అందేలా చర్యలు



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 01:

జిల్లా కేంద్రంలో ని బండమీదిపల్లిలో 63 ఏళ్ల కురువ అనంతమ్మ చెట్టు కింద, ఆరుబయట జీవనం సాగిస్తున్నారంటూ సోషల్ మీడియాలో వచ్చిన వార్తలపై అదనపు కలెక్టర్ (ఎల్‌బీ) స్పందించారు. వృద్ధురాలి పరిస్థితిని స్వయంగా పరిశీలించేందుకు బండమీదిపల్లికి వెళ్లిన ఆయన, అనంతమ్మను కలిసి ఆమె ఆరోగ్య పరిస్థితి, ఆర్థిక పరిస్థితి, కుటుంబ సభ్యుల వివరాలు, భూమి, ఆస్తులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధాప్యంతో పాటు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న అనంతమ్మకు ప్రస్తుతం ఎలాంటి వైద్య సహాయం అందుతోంది, ఆమెను ఎవరు సంరక్షిస్తున్నారు, రోజువారీ అవసరాలు ఎలా తీరుతున్నాయనే అంశాలపై అదనపు కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వృద్ధురాలికి అవసరమైన వైద్యం, సంరక్షణ, ఇతర ప్రభుత్వ సహాయం అందేలా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

కుటుంబ సభ్యులు బాధ్యత తీసుకోవాలి

అనంతమ్మను కుటుంబ సభ్యులు బాధ్యతగా చూసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ మేరకు కుటుంబ సభ్యుల నుంచి నోటరీ చేయించిన హామీ పత్రం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వృద్ధురాలికి అవసరమైన ఆహారం, వైద్యం, భద్రత, రోజువారీ సంరక్షణ వంటి అంశాల్లో కుటుంబ సభ్యులు తగిన బాధ్యత వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కుటుంబ సభ్యులు హామీ ఇచ్చిన మేరకు వృద్ధురాలిని సంరక్షించకుండా నిర్లక్ష్యం చేస్తే, వర్తించే నిబంధనలు, చట్టపరమైన ప్రక్రియలకు అనుగుణంగా ఆమె భూమి, ఆస్తులకు సంబంధించి తదుపరి చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ సూచించారు. అవసరమైన సందర్భంలో వృద్ధురాలి సంరక్షణ కోసం ట్రస్ట్ లేదా తగిన సంస్థ ద్వారా కేర్‌టేకర్లను ఏర్పాటు చేసి, ఆమెకు అవసరమైన నిర్వహణ, వైద్య సహాయం అందించే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

సురక్షిత ఆశ్రయం కల్పించాలి... అనంతమ్మ ఇకపై చెట్టు కింద లేదా ఆరుబయట జీవించాల్సిన పరిస్థితి లేకుండా సురక్షితమైన ఆశ్రయం కల్పించే అంశాన్ని పరిశీలించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఆమె ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్స అందించడంతో పాటు, ప్రభుత్వ ఆసుపత్రి లేదా సంబంధిత ఆరోగ్య సదుపాయాల ద్వారా నిరంతర వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అలాగే అనంతమ్మకు అర్హత ఉన్న వృద్ధాప్య పింఛన్, రేషన్, ఆరోగ్య సేవలు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అనే విషయాన్ని పరిశీలించి, అర్హత మేరకు అవసరమైన పథకాలను అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమెకు అవసరమైన ఆర్థిక, సామాజిక సహాయం అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించాలని ఆదేశం

వృద్ధురాలి కుటుంబ పరిస్థితి, ఆరోగ్య స్థితి, ఆస్తులు, భూమి వివరాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హత, కుటుంబ సభ్యుల నుంచి తీసుకున్న హామీ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి వివరమైన నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోషల్ మీడియాలో వచ్చిన వార్తను పరిగణనలోకి తీసుకుని వృద్ధురాలి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించి, ఆమెకు అవసరమైన సహాయం అందేలా అధికారులను ఆదేశించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. వృద్ధురాలికి నిరంతర సంరక్షణ, వైద్యం, సురక్షిత జీవనానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

జిల్లాలో అటవీ ప్రాంతాల్లో అక్రమ కార్యకలాపాల నియంత్రణ

అటవీ భూముల పరిరక్షణ, వెట్‌ల్యాండ్స్ గుర్తింపు - జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 01:


గురువారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అటవీ, రెవెన్యూ, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ ప్రాంతాల్లో అక్రమ మైనింగ్, ఇసుక తవ్వకాలు, చెట్ల నరికివేత వంటి అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. అటవీ ప్రాంతాల్లో రెవెన్యూ పట్టాల కింద ఉన్న భూములకు సంబంధించిన వివరాలను మండలాల వారీగా పరిశీలించి, పూర్తి సమాచారాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో గుర్తించిన 521 వెట్‌ల్యాండ్స్‌లో ఇప్పటివరకు ఆరు వెట్‌ల్యాండ్స్‌కు సంబంధించిన ప్రక్రియ పూర్తయిందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. మిగిలిన వెట్‌ల్యాండ్స్‌ను డిమార్కేషన్ చేసి, క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ ప్రక్రియలో ఇరిగేషన్, ఫిషరీస్ శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అలాగే, కోడంగల్–కోస్గి రహదారికి సంబంధించి వెంకటాపూర్ గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 23లో నేషనల్ హైవే శాఖకు కేటాయించిన ప్రభుత్వ భూమికి సంబంధించిన వివాదాలను పరిశీలించి, స్పష్టమైన నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా మంజూరైన గుడేబల్లూర్ వరకు రహదారికి అవసరమైన ప్రభుత్వ భూమిని గుర్తించి, సంబంధిత శాఖకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పిల్లలమర్రి ప్రాంతానికి సంబంధించిన అంశంపై పర్యాటక శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో వ్యక్తిగతంగా పరిశీలించి, నివేదికలను ధ్రువీకరించిన అనంతరం తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్.పి డి. జానకి, జిల్లా అటవీశాఖ అధికారి ఎం. నవీన్ రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, ఆర్.డి.ఓ నవీన్, సంబంధిత రెవెన్యూ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలి

ఓటర్లను కార్యాలయాలకు పిలిచి నోటీసులు, పత్రాల స్వీకరణ చేయరాదు - రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

నిర్మల్ అక్టోబర్ 01 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ఎస్ఐఆర్–2026 ప్రక్రియను భారత ఎన్నికల సంఘం తాజా మార్గదర్శకాలకు అనుగుణంగా, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం ఎస్ఐఆర్–2026, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సీఈఓ సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లను నోటీసులు అందుకోవడానికి లేదా అవసరమైన పత్రాలు సమర్పించడానికి కార్యాలయాలకు పిలవరాదని స్పష్టం చేశారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేయడంతో పాటు, అవసరమైన పత్రాలను వారి ఇళ్ల వద్దే స్వీకరించాలని సూచించారు.



ఇకపై సాధారణంగా ఓటర్లను విచారణ (హియరింగ్) కోసం కార్యాలయాలకు పిలవరాదని చెప్పారు. తప్పనిసరి పరిస్థితుల్లో విచారణ నిర్వహించాల్సి వస్తే ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కొత్త ఓటరు నమోదు కోసం ఫారం–6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ తప్పనిసరిగా ఉండాలని సీఈఓ స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ నిర్వహించని రాష్ట్రాల్లో డిక్లరేషన్ అవసరం లేకపోయినప్పటికీ, తెలంగాణలో కొత్త ఓటర్ల నమోదు సందర్భంగా డిక్లరేషన్ తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు.

ఈఆర్ఓ కార్యాలయాల నోటీసు బోర్డులపై ఫారం–6, ఫారం–7కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను ప్రదర్శించాలని సూచించారు. ఓటర్లకు జారీ చేయాల్సిన పెండింగ్ నోటీసులపై కూడా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదును భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాలని సీఈఓ సూచించారు.

ఎస్ఐఆర్–2026 ప్రక్రియలో భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేస్తూ, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి దశను పారదర్శకంగా పూర్తి చేయాలని సీఈఓ తెలిపారు. ఈ వీసీలో భాగంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని అన్నారు. ఎస్ఐఆర్ వివరాలు ఎన్నికల ఉన్నతాధికారులకు వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను మొత్తం నిబంధనల ప్రకారం పూర్తి చేస్తామని తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శుభం నొక్వాల్‌కు ఘన వీడ్కోలు



ప్రజాకలం ప్రతినిధి, చింతూరు, అక్టోబర్ 01

చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా సేవలందించి, పోలవరం ప్రాజెక్టు ఆర్‌అండ్‌ఆర్ ప్రక్రియ సజావుగా సాగడంలో తనవంతు పాత్ర పోషించిన ఐఏఎస్ అధికారి శుభం నొక్వాల్ రాజమండ్రి సబ్‌కలెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న సందర్భంగా చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, ఎటపాక మండల ప్రధాన కార్యదర్శి కణితి మధు హాజరయ్యారు. ఈ సందర్భంగా శుభం నొక్వాల్‌ను సాలువాతో ఘనంగా సత్కరించి, ఆయన అందించిన సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. చింతూరు ఐటీడీఏ పరిధిలో అధికారిగా పనిచేసిన సమయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి, పోలవరం ప్రాజెక్టు పునరావాసం, పునరావాస పరిహారం (ఆర్‌అండ్‌ఆర్) ప్రక్రియలో ఆయన అందించిన సేవలను వారు ఈ సందర్భంగా కొనియాడారు. రాజమండ్రి సబ్‌కలెక్టర్‌గా కొత్త బాధ్యతల్లోనూ విజయవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు.

పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి కొత్త శ్రీనివాసులు



నాగర్‌కర్నూల్ అక్టోబర్ 01 (ప్రజా కలం):

పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని డీసీసీ కార్యదర్శి కొత్త శ్రీనివాసులు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎలుమ ఫంక్షన్ హాల్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. పేదల సంక్షేమమే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యత అని, ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన జీవనం, సొంతింటి భద్రత కల్పించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి అన్యాయానికి తావులేకుండా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, నాగర్‌కర్నూల్ అభివృద్ధి, పేదల సంక్షేమం, ప్రజల హక్కుల కోసం ప్రజాప్రతినిధులు నిరంతరం ప్రజల మధ్య ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ హేమంత్ కేశవ్ పాటిల్, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ సునేంద్ర, తహసీల్దార్ తబితా రాణి, ఆర్డీవో అర్చన, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, మున్సిపాలిటీ పరిధిలోని 2,13వ వార్డుల లబ్ధిదారులు పాల్గొన్నారు.

వరి పంటలో మొగి పురుగు, కంకి నల్లి నివారణపై రైతులకు అవగాహన, ఏవో రామడుగు వాణి.

పాలేరు అక్టోబర్ 01(ప్రజా కలం న్యూస్)కూసుమంచి మండలం పరిధిలోని భగత్వీడు గ్రామంలో మొగి పురుగు, కంకి నల్లి ఆశించిన వరి పొలాలను మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి గురువారం సందర్శించారు. పంటలను పరిశీలించి రైతులకు పురుగుల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.



ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులు మొగి పురుగు ఉధృతికి అనుకూలంగా ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మొగి పురుగు ఆశించిన చిన్న మొక్కల్లో మధ్య కాడ ఎండిపోవడం, పిలకలు వచ్చిన దశలో తెల్ల కంకులు ఏర్పడటం, కాండంలో పురుగు రంధ్రాలు, వ్యర్థాలు కనిపించడం వంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు. పురుగు ఉధృతి అధికంగా ఉంటే దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు.మొగి పురుగు నివారణకు పొలంలో కలుపు మొక్కలు, పంట అవశేషాలను తొలగించాలని, అధిక మోతాదులో నత్రజని ఎరువుల వినియోగాన్ని నివారించాలని సూచించారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఎకరానికి 200 లీటర్ల నీటిలో కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50% శ్రా 400 గ్రాములు, కొరాజెన్ 18.5% శాజ 60 మి.లీ., కార్బోసల్ఫాన్ 25% జుజ 400 మి.లీ. లేదా ఫిప్రోనిల్ 5% శాజ 400 గ్రాములు చొప్పున పిచికారీ చేయవచ్చని తెలిపారు.అదేవిధంగా వరి పంటలో కంకి నల్లి ఉనికిని కూడా గుర్తించినట్లు తెలిపారు. కంకి నల్లి ఆశించినప్పుడు ఆకులపై పసుపు లేదా గోధుమ రంగు మార్పులు, ఆకుల్లో పత్రహరితం తగ్గి తెల్లటి మచ్చలు ఏర్పడటం, కంకి బయటకు రావడంలో ఆటంకం కలగడం, గింజలు సరిగా నిండకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయని వివరించారు. దీని నివారణకు స్పైరోమెసిఫిన్ 22.9% శాజ లీటరు నీటికి 1.0 గ్రాము చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు. రైతులు తమ పొలాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పురుగుల ఉధృతి ప్రారంభ దశలోనే నివారణ చర్యలు చేపట్టాలని రామడుగు వాణి సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వేదవ్యాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్య సేవా సంస్థ (పి ఏ ఎస్ ఎస్) ఆధ్వర్యంలో

ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాకలం ప్రతినిధి బూర్గంపహాడ్ అక్టోబర్ 01

బూర్గంపాడు మండల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రజా ఆరోగ్య సేవా సంస్థ (పి ఏ ఎస్ ఎస్) ఆధ్వర్యంలో, మోక్షిత డెంటల్, దయాబెటిక్ అండ్ జనరల్ హాస్పిటల్, సారపాక మరియు పద్మావతి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్, భద్రాచలం వారి సహకారంతో బుధవారం నాడు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరం పి ఏ ఎస్ ఎస్ వ్యవస్థాపకులు మరియు అధ్యక్షులు డా. ఎస్ మురళి కృష్ణ ప్రారంభించారు, ఉచిత మెగా వైద్య శిబిరానికి బూర్గంపాడు మండలం ఎస్సై మేడ ప్రసాద్, సారపాక మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్, ఉపసర్పంచ్ కన్నదారి రమేష్, మరియు బూర్గంపాడు సర్పంచ్ మందా నాగరాజు, మండల అధ్యక్షులు పూల పెల్లి సుధాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి, తమ అమూల్యమైన సందేశాన్ని అందించారు, ఈ సందర్భంగా ఎస్సై మెడ ప్రసాద్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రజా ఆరోగ్య సేవా సంస్థ (పి ఏ ఎస్ ఎస్), పద్మావతి మెడికల్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ద్వారా పేద, మధ్యతరగతి ప్రజల కొరకు ఇటువంటి మెడికల్ క్యాంపులను నిర్వహిస్తూ వారి ఆరోగ్య సమస్యల పట్ల అవగాహన కల్పిస్తూ వారికి కావలసిన వైద్య పరీక్షలను మరియు వారికి మందులను ఉచితముగా అందిస్తున్న మోక్షిత దయాబెటిక్ అండ్ డెంటల్ హాస్పిటల్ యజమాన్యానికి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ బూర్గంపాడు మండల ప్రజలు ఇటువంటి వైద్య శిబిరాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు, సారపాక మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఇటువంటి మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమని,



దీనిని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని, మండలంలో ఉన్న ప్రజల ఆరోగ్య సమస్యల పట్ల మరియు క్యాన్సర్ మహమ్మారి, వాటి లక్షణాలు గురించి కూడా ప్రజలలో పూర్తి స్థాయి అవగాహన కల్పించి వారిని చైతన్యవంతులుగా చేయాలని కోరారు, ఇటువంటి మంచి కార్యక్రమాలు ప్రజా ఆరోగ్య సేవా సంస్థ ద్వారా మరిన్ని నిర్వహించి ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని తెలియజేశారు, ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రజా ఆరోగ్య సేవా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గల ప్రజలకు సేవ చేయాలని ఉద్దేశంతో ఇక్కడికి వచ్చానని, వారి ఆరోగ్య సమస్యల పట్ల పూర్తిస్థాయిలో సేవలను అందిస్తామని, 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఇటువంటి మెగా వైద్య శిబిరాలను నెలకు ఒకటి లేదా రెండు ఏర్పాటు చేసి పేద మరియు మధ్య తరగతి ప్రజలకు వైద్య సేవలను అందిస్తామని తెలియజేశారు, ఈ మెగా వైద్య శిబిరంలో దాదాపు 134 మందికి వైద్య సేవలు, అవసరతను బట్టి పరీక్షలు, చికిత్స మరియు వైద్య నలహాలు అందించడం జరిగిందని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో సారపాక మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ కన్నదారి రమేష్, బూర్గంపాడు సర్పంచ్ మంద నాగరాజు, బూర్గంపాడు మండల అధ్యక్షులు పూల పెల్లి సుధాకర్ రెడ్డి, యడారి శివరామకృష్ణ (టీ టైప్స్), గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కత్తిమీద సాములాంటిది పోలీసు వృత్తి

- నిబద్ధతే ఆయుధం, నిజాయితే మార్గదర్శకం
- సిబ్బందికి మార్గదర్శిగా, ప్రజాసేవలో ఎస్సై వెంకటకృష్ణ ప్రత్యేక ముద్ర
- బదిలీపై వెళ్తున్న ఏఎస్సైలు,హెడ్ కానిస్టేబుళ్లకు ఘన సన్మానం

తల్లాడ, అక్టోబర్ 1, ప్రజా కలం న్యూస్

పోలీసు వృత్తి కత్తిమీద సాములాంటిదని, ఎన్నో ఒత్తిళ్లు, సవాళ్లను అధిగమిస్తూ చట్టాన్ని గౌరవిస్తూ విధులు నిర్వహించడం గొప్ప బాధ్యత అని తల్లాడ ఎస్సై వెంకటకృష్ణ అన్నారు.పోలీసు శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ తాము ఉద్యోగంలో చేరిన రోజున చేసిన ప్రమాణానికి కట్టుబడి,ప్రజా భద్రతే లక్ష్యంగా నిస్వార్థంగా సేవ చేయాలని సూచించారు. తల్లాడ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై వెంకటకృష్ణ ఆధ్వర్యంలో విధులు నిర్వహించి,వివిధ ప్రాంతాలకు ఏఎస్సైలుగా,హెడ్ కానిస్టేబుళ్లుగా బదిలీపై వెళ్తున్న సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న పోలీసు సిబ్బందికి ఎస్సై వెంకటకృష్ణ ఘనంగా సన్మానించారు. ఈ క్రమంలో ఎస్సై వెంకటకృష్ణ అందించిన సహకారం, ప్రోత్సాహం, మార్గదర్శకత్వాన్ని సిబ్బంది ప్రత్యేకంగా గుర్తుచేసుకున్నారు. శాఖ గౌరవం.స్వీయ ఆత్మగౌరవం కాపాడుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు.పోలీసులు విధి నిర్వహణలో ఎన్ని సవాళ్లు ఎదురైనా చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా వనిచేయాలని ఎస్సై వెంకటకృష్ణ సూచించారు.పోలీసు శాఖ గౌరవాన్ని కాపాడటంతో పాటు ప్రతి ఉద్యోగి తన ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకోవాలని అన్నారు.ప్రజల సమస్యలను ఓపికగా విని,చట్టపరిధిలో పరిష్కరించేందుకు కృషి చేయడం ద్వారా పోలీసులపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. విధి



నిర్వహణలో సిబ్బందికి మార్గనిర్దేశం చేస్తూ, వారి సమస్యలను అర్థం చేసుకుని ప్రోత్సహించడం ద్వారా ఎస్సై వెంకటకృష్ణ సిబ్బంది మన్ననలు పొందారని బదిలీపై వెళ్తున్న పోలీసులు పేర్కొన్నారు. తల్లాడలో కలిసి పనిచేసిన అనుభవాలు తమకు ఎప్పటికీ గుర్తుండిపోతాయని తెలిపారు.ఆయన సూచనలు, సహకారం భవిష్యత్ విధి నిర్వహణలో తమకు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రజల అండతోనే సమర్థవంతమైన పోలీసింగ్ ఏర్పడుతుందని ప్రజల రక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఎస్సై వెంకటకృష్ణ విజ్ఞప్తి చేశారు.ప్రజలు పోలీసుల మధ్య పరస్పర విశ్వాసం, సహకారం ఉంటే శాంతిభద్రతలను మరింత సమర్థవంతంగా పరిరక్షించవచ్చన్నారుఅనంతరం బదిలీపై వెళ్తున్న సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాభీష్టం మేరకు ఐదు గ్రామపంచాయతీలను తెలంగాణలో కలపాలి

కన్నాయిగూడెం నుంచి భద్రాచలం వరకు రహదారిని చూస్తే పాలన తీరు అర్థమవుతుంది
ఆంధ్రప్రదేశ్ సిపియం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు.
ముంపు మండలాల సమస్యలపై సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మోటార్‌సైకిల్ యాత్ర
యాత్రకు రాజుపేటలో సీపీఎం భద్రాచలం పట్టణ కమిటీ ఘన స్వాగతం

ప్రజాకలం ప్రతినిధి
భద్రాచలం,అక్టోబర్ 01

పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు, ప్రజాభీష్టం మేరకు ఐదు గ్రామపంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాలని సీపీఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ముంపు మండలాల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు సీపీఎం పోలవరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన మోటార్‌సైకిల్ యాత్ర భద్రాచలం సరిహద్దుకు చేరుకుంది.

ఈ సందర్భంగా భద్రాచలం పట్టణంలోని రాజుపేట వద్ద సీపీఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో యాత్రకు ఘన స్వాగతం పలికారు. సిపిఐఎం భద్రాచలం పట్టణ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని యాత్రకు సంఘీభావం తెలిపారు. రాజుపేట సెంటర్లో ఉన్న మాజీ ఎమ్మెల్యే అమరజీవి కామ్రేడ్ కుంజ బొజ్జి స్మారక స్థూపానికి ఏపీ రాష్ట్ర కార్యదర్శి బి శ్రీనివాసరావు, పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం లు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన సభలో ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివానరావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు కారణంగా ముంపు ప్రభావానికి గురైన గ్రామాల ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు తగిన శ్రద్ధ చూపడం లేదని అన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు వారి సమస్యల పట్ల వివక్ష చూపుతున్నాయని ఆరోపించారు.

కన్నాయిగూడెం నుంచి భద్రాచలం వరకు ఉన్న రహదారి దుస్థితిని చూస్తే కూటమి ప్రభుత్వ పాలన ఎలా ఉందో అర్థమవుతుందని ఆయన విమర్శించారు. సరిహద్దు గ్రామాల అభివృద్ధి, రహదారులు, రవాణా, మౌలిక వసతుల విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఎటపాక భద్రాచలం సరిహద్దులో ఉన్న కరకట్ట స్లూయిజ్ మరమ్మత్తుల విషయంలో రెండు ప్రభుత్వాలు ఎవరికి వారే పట్టనట్టు వ్యవహరిస్తూ ప్రజలను ప్రమాదంలోకి నెట్టేస్తున్నారని శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావం నుంచి భద్రాచలం పట్టణాన్ని రక్షించేందుకు



కరకట్టను పునర్నిర్మించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని వి. శ్రీనివాసరావు అన్నారు. భద్రాచలం రక్షణకు శాశ్వత పరిష్కారం చూపేలా కరకట్ట పునర్నిర్మాణ పనులను చేపట్టాలని డిమాండ్ చేశారు. పోలవరం ముంపుపై శాస్త్రీయమైన అంచనా లేకుండా అడ్డగోలుగా విభజించడం వల్ల ఇప్పుడు అనేక సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన ఆరోపించారు. పోలవరం ప్రాజెక్ట్ తో భద్రాచలం పట్టణానికి రామాలయానికి సైతం ముంపు తప్పదని నీటిపారుదల శాఖ నిపుణులు హెచ్చరిస్తున్న కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమని అన్నారు.

ముంపు మండలాల ప్రజల సమస్యలు పునరావాసం, మౌలిక వసతులు, సరిహద్దు గ్రామాల సమస్యలను ప్రస్తావిస్తూ మోటార్‌సైకిల్ యాత్ర కొనసాగుతోందని వి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ప్రజల అభిప్రాయాలు, స్థానిక సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ మోటార్ సైకిల్ యాత్రలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయకులు లోత రామారావు, పోలవరం జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్, కార్యదర్శి వర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు ఐ వెంకటేశ్వర్లు పాల్గొనగా సిపిఐ ఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి భద్రాచలం గ్రామపంచాయతీ ఫ్లోర్ లీడర్ బండారు శరత్ బాబు జిల్లా కమిటీ సభ్యురాలు సున్నం గంగ, ఐలు జిల్లా నాయకులు ఎం వి ప్రసాద్ రావు,పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రం శెట్టి వెంకట రామారావు, డి సీతాలక్ష్మి, పట్టణ కమిటీ సభ్యులు నాదెళ్ల లీలావతి,శ్రీ కొలగాని రమేష్, జీవనజ్యోతి, కనక శ్రీ, డి రాఘవయ్య, అజయ్ కుమార్, కుంజ శ్రీనివాస్ లు పాల్గొని మోటార్ సైకిల్ ర్యాలీకి ఘన స్వాగతం పలికారు.

ఎడ్లపల్లి మోడల్ స్కూల్‌లో గెస్ట్ టీచర్ పోస్టు...

- 7వ తేదీలోపు దరఖాస్తులు...

మల్హర్, అక్టోబర్ 1 ప్రజాకలం ప్రతినిధి... మండలంలోని ఎడ్లపల్లి మోడల్ స్కూల్‌లో గెస్ట్ స్పెషల్ ఎడ్యుకేటర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సిహెచ్. పూర్ణచందర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలకు రూ.16,500 గౌరవ వేతనం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులు ఈ నెల 2 నుంచి 7వ తేదీలోపు మోడల్ స్కూల్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదు

'పబ్లిక్ ఫస్ట్' నినాదంతో ఎన్నికల సిబ్బంది పనిచేయాలి: కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్
ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, కచ్చితంగా పూర్తి చేయాలి: సీఈఓ సుదర్శన్ రెడ్డి



నాగర్‌కర్నూల్, అక్టోబర్ 01 (ప్రజా కలం): ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు కలగకుండా ఎన్నికల సిబ్బంది 'పబ్లిక్ ఫస్ట్' నినాదంతో పనిచేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హేమంత్ కేశవ్ పాటిల్ ఆదేశించారు. ఎస్ఐఆర్, ఓటరు నమోదు ప్రక్రియపై జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు హియరింగ్‌కు హాజరుకాని పక్షంలో బీఎల్ఓలు వారి ఇళ్ల వద్దకే వెళ్లి అవసరమైన ధ్రువపత్రాలను సేకరించాలని కలెక్టర్ సూచించారు. అవసరమైతే డాక్యుమెంట్ వెరిఫికేషన్‌కు ఆన్‌లైన్ సౌకర్యాన్ని కూడా వినియోగించుకోవచ్చన్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా, వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్‌లో భాగంగా అన్‌మ్యాపింగ్‌కు సంబంధించిన వివరాలను సంబంధిత కార్యాలయాల నోటీసు బోర్డుల్లో ప్రచురించాలని సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇప్పటివరకు 263 ఇన్‌ఎలిజిబుల్ ఓట్లు గుర్తించినట్లు తెలిపారు. ఫామ్-6, ఫామ్-7, ఫామ్-8 ద్వారా జిల్లాలో 6,665 దరఖాస్తులు అందాయని, వాటిని ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. రాష్ట్రంలో 100 శాతం నోటీసులు పంపిణీ చేసిన తొలి జిల్లా నాగర్‌కర్నూల్ అని కలెక్టర్ తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, కచ్చితంగా, నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని ఎన్నికల సిబ్బందికి సూచించారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై సూచనలు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదును ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చేపట్టాలని సీఈఓ సుదర్శన్ రెడ్డి సూచించారు. 31.10.2023 నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అర్హులు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రస్తుత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు 01.11.2026 అర్హత తేదీగా పేర్కొన్నారు.గతంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదైన వారు కూడా ప్రస్తుత ప్రక్రియలో మళ్లీ నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇందుకోసం మార్కుల మెమో జిరాక్స్ కాపీని గెజిటెడ్ అధికారి ధ్రువీకరణతో సమర్పించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియతో పాటు ఫామ్-6, 7, 8 దరఖాస్తుల పరిష్కారం, అన్‌మ్యాపింగ్ వివరాల ప్రచురణ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు తదితర అంశాలపై కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

చింతూరు నూతన సబ్ కలెక్టర్‌గా చిట్టపులి నరేంద్ర పడాల్ బాధ్యతల స్వీకరణ

- మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ వైస్ ఎంపీపీ దొంతు
- సబ్ కలెక్టర్ కు శాలువా కప్పి ఘనంగా సన్మానం



ప్రజాకలం ప్రతినిధి చింతూరు , అక్టోబర్ 01 : చింతూరు నూతన సబ్ కలెక్టర్‌గా 2024 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి చిట్టపులి నరేంద్ర పడాల్ గురువారం నాడు బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో సీనియర్ నాయకులు , ఎటపాక మండల మాజీ వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు సబ్ కలెక్టర్ చిట్టపులి నరేంద్ర పడాల్ ను ఐటీడీఏలోని తన ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం , భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ప్రసాదాన్ని అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపి ఎటపాక మండలంలో నెలకొన్న సమస్యలను సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దాంతో ఆయన సానుకూలంగా స్పందించినట్లు మాజీ వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు మీడియాకు తెలిపారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలి:- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ అక్టోబర్ 01 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) ప్రభుత్వ విద్యాసంస్థల్లో అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారు.



గురువారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో, ప్రభుత్వ విద్యాసంస్థల్లో వసతుల కల్పనపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన బడుల్లో అదనపు తరగతు గదుల నిర్మాణం, తాగునీటి వసతి కల్పన, మరుగుదొడ్లు, డ్రైనేజీ, నిర్మాణం మరమ్మత్తులు, ఇతర నిర్మాణ, మరమ్మత్తుల పనులు చేపట్టాలన్నారు. ఆయా పాఠశాలల్లో నిర్మాణంలో ఉన్న పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులన్నీ నాణ్యవంతంగా చేపట్టడంతో పాటు, వెంటనే పూర్తి చేయాలని పేర్కొన్నారు. విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యను అభ్యసించేలా అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, ఈడబ్ల్యుఐడిసి డిప్యూటీ ఈఈ గంగాధర్ గౌడ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీని పరిరక్షించే బాధ్యత కాంగ్రెస్ దే:

టీడబ్ల్యూయూకు మద్దతుగా ప్రచారం నిర్వహించిన మహేశ్వరం నియోజకవర్గ ఐఎన్టిసియు కార్మిక శాఖ అధ్యక్షులు నడికుడ శివ

మహేశ్వరం, సెప్టెంబర్ 29 (ప్రజా కలం):

ఆర్టీసీని పరిరక్షించే బాధ్యత కాంగ్రెస్ పార్టీదేనని, రాబోయే టీజీఎస్ ఆర్ టి సి యూనియన్ ఎన్నికల్లో బాణం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని నాయకులు పిలుపునిచ్చారు.ఐఎన్టీయూసీ జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంపీ జి. సంజీవరెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు మహేశ్వరం నియోజకవర్గ ఐ ఎన్ టి సి



యు కార్మిక శాఖ అధ్యక్షులు నడికుడ శివ ఆధ్వర్యంలో మహేశ్వరం ఆర్టీసీ బస్సు డిపో వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీజీఎస్ ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ, ఐ ఎన్ టి సి యు, ఎస్ డబ్ల్యు యు, టీఎంయూ,, ఎస్ డబ్ల్యూ ఎఫ్ బలపరిచిన టీఎంయూ – తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ల రాజిరెడ్డి బాణం గుర్తుకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఆవుల యాదయ్య, మహేశ్వరం మండల గ్రామీణ, పట్టణ అధ్యక్షులు బంగరుగళ్ల లాజర్, మండల సోషల్ మీడియా అధ్యక్షులు ఎర్ర నవీన్ కుమార్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కప్పల రాజు, మండల క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షులు బుసనగారి స్వామి, ఎస్సి డిపార్ట్మెంట్ ఉపాధ్యక్షులు బాట రాజు, కందుకూర్ మండల ఐఎన్టిసియూ కు అధ్యక్షులు గాదే కుమార్, గంగారం తండా వార్డు మెంబర్ రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఏఐసీసీ విచార్ విభాగ్ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (ప్రజా కలం):

రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డిని ఏఐసీసీ విచార్ విభాగ్ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం, బడంగ్‌పేట్ సర్కిల్-16, నాదర్‌గుల్ డివిజన్-57 పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న అత్యవసర మౌలిక వసతుల సమస్యలు, ప్రధాన రహదారుల విస్తరణ అవసరం తదితర అభివృద్ధి అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్న ప్రధాన రహదారుల విస్తరణతో పాటు, డివిజన్‌లో అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి తగిన నిధులు మంజూరు అయ్యేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సహకరించాలని రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిని కోరారు.ప్రజల అవసరాలను సంబంధిత ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి నాదర్‌గుల్ డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని బోయపల్లి రాఘవేందర్ రెడ్డి తెలిపారు.



కూలీ డబ్బుల విషయంలో గొడవ..

దంపతులపై స్ట్రాడ్రైవర్లతో దాడి

మల్కాజిగిరి, అక్టోబరు 1 (ప్రజా కలం ప్రతినిధి): కూలీ డబ్బుల విషయంలో తలెత్తిన వివాదం దంపతులపై దాడికి దారితీసింది. నరసింహారెడ్డి నగర్‌లో బుధవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. జారుపుల హరిచందర్ ఇంటి వద్ద గతంలో టైల్స్ పని చేసిన శివ (21), అనిల్ (25) సెప్టెంబరు 30న రాత్రి 11 గంటల సమయంలో అక్కడికి వచ్చారు. కూలీ డబ్బుల విషయంలో హరిచందర్‌తో గొడవపడి, ఇద్దరూ కలిసి స్ట్రాడ్రైవర్లతో హరిచందర్, ఆయన భార్యపై దాడి చేశారు. ఈ దాడిలో దంపతులకు తలకు గాయాలయ్యాయి.బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులు శివ, అనిల్‌ను అదుపులోకి తీసుకుని గురువారం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు





ఎస్ఐఆర్‌లో పెండింగ్ నోటీసుల జారీని రెండు రోజుల్లో పూర్తి చేయాలి

బీఎల్‌వోలు ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేయడంతో పాటు అవసరమైన పత్రాలు సేకరించాలి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ .



సంగారెడ్డి, ప్రతినిధి
అక్టోబర్ 01(ప్రజా కలం):

ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లలో నోటీసులు పెండింగ్‌లో ఉన్న వారందరికీ రెండు రోజుల్లోగా నోటీసులు జారీ చేసే ప్రక్రియను పూర్తి చేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా నోటీసుల జారీ, డిక్లరేషన్ ఫారాలు, ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సుదర్శన్ రెడ్డి గురువారం హైదరాబాద్ నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా సీఈఓ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లలో నోటీసులు పెండింగ్‌లో ఉన్న వారందరికీ త్వరితగతిన నోటీసులు జారీ చేయాలని ఆదేశించా రు. ఏ ఒక్క ఓటరు కూడా కార్యాలయా లకు రావాల్సిన అవసరం లేకుండా బీఎల్‌వోలు స్వయంగా ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేయడంతో పాటు అవసరమైన పత్రాలను సేకరించాలని సూచించారు. ఇల్లు లేని వారు, అవసరమైన పత్రాలు అందుబాటులో లేని ఓటర్ల కోసం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి, అవసరమైన సందర్భాల్లో పంచనామా తదితర ప్రక్రియల ద్వారా క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. అనర్హులు లేదా ఇతర ప్రాంతాలకు తరలిపోయిన ఓటర్లకు సంబంధించి ఫారం-6 ప్రక్రియలో స్పీకింగ్ ఆర్డర్ తరహాలో డిక్లరేషన్ ఫారం ఇవ్వాలని సూచిం చారు. ఫారం-7కు సంబం ధించి బల్క్‌గా దరఖాస్తులను స్వీకరించరాదని, ప్రతి దరఖాస్తును విడివిడిగా పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించాలని ఈఆర్వోలను ఆదేశించారు. అలాగే ఈఆర్వోలు, ఏఈఆర్వోలు తమ నోటీస్ బోర్డులపై ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిష్కారం, అనామలీస్ మరియు మ్యాపింగ్ కాని ఓటర్లకు సంబంధించిన పరిష్కార వివరాలను ప్రతిరోజూ ప్రదర్శించాలని సూచిం చారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, సంగారెడ్డి జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా మొత్తం 4,60, 387 నోటీసులు జనరేట్ చేయగా, ఇప్పటివరకు 4,44,175 మంది ఓటర్లకు నోటీసులు అందజేశామని తెలిపారు. 3,52,256 మంది ఓటర్లకు సంబంధించి హియరింగ్ ప్రక్రియ పూర్తయిందని వివరించారు. జిల్లాలో ఇంకా 16,212 మంది ఓటర్లకు నోటీసులు అందజేయాల్సి ఉందని, పెండింగ్‌లో ఉన్న వారందరికీ బీఎల్‌వోల ద్వారా రెండు రోజుల్లోగా నోటీసులు అందజేసి, అవసరమైన పత్రాలను సేకరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఫారం-7కు సంబంధించి జిల్లాలో ఎలాంటి బల్క్ దరఖాస్తులను స్వీకరించడం లేదని సీఈఓకు వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ప్రతిరోజూ పరిష్కరించిన ఫారం-6, ఫారం-7, ఫారం-8, అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు సంబంధించిన పరిష్కార వివరాలను నోటీస్ బోర్డులపై ప్రదర్శిస్తామని తెలిపారు. జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ పాండు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీఎంజేఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా వత్తుల రఘుపతి నియామకం

ఎస్సీ కమిషన్ చైర్మన్ నియామకంలో రొటేషన్ పద్ధతి పాటించాలి మాదిగ జర్నలిస్టులకు ప్రాధాన్యత ఇవ్వాలి: వత్తుల రఘుపతి



మహేశ్వరం , అక్టోబర్ 01 (ప్రజా కలం): తెలంగాణ రాష్ట్ర మాదిగ జర్నలిస్టుల ఫోరం (టీఎంజేఎఫ్) నూతన కమిటీని ఎన్నుకుంది. ఫోరం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా మహేశ్వరం ప్రాంతానికి చెందిన వత్తుల రఘువతిని నియమించారు.

ఈ సందర్భంగా హైదరాబాద్ హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్ మీడియా సెంటర్‌లో ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు భూర్గుల నాగేందర్ మాదిగ, ప్రధాన కార్యదర్శి బొల్లెపాక రాజేష్ మాదిగ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వత్తుల రఘువతి మాట్లాడుతూ.. తెలంగాణ ఎస్సీ కమిషన్ ప్రస్తుత పదవీకాలం అక్టోబర్ 3, 2026తో ముగియనున్న నేపథ్యంలో, తదుపరి కమిషన్ చైర్మన్ నియామకంలో రొటేషన్ పద్ధతిని పాటించాలని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో కమిషన్‌కు కల్పించిన ప్రాతినిధ్యాన్ని సమీక్షించి, ఒకే ఉపకులం లేదా ఒకే ప్రాంతానికే పరిమితం కాకుండా మాదిగ, మాలలతో పాటు అన్ని ఎస్సీ కులాలు, ప్రాంతాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి, మంత్రిమండలి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎస్సీ కమిషన్‌లో మాదిగ, అనుబంధ కులాలకు చెందిన జర్నలిస్టులకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు.కుల అణచివేత, వివక్ష నిర్మూలనపై అవగాహనతో పాటు సామాజిక సమస్యలపై లోతైన అవగాహన, దూరదృష్టి ఉన్నవారికి కమిషన్‌లో అవకాశం కల్పించాలని అన్నారు. కుల వివక్ష, బహిష్కరణ, గ్రామస్థాయి ఘర్షణలు తీవ్రరూపం దాల్చిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే గుర్తించి నివారించే విధంగా కమిషన్ కార్యాచరణ ఉండాలని కోరారు.ఈ సమావేశంలో రాష్ట్ర గౌరవ సలహాదారులు మైలారపు ప్రేమ్, సుంచు లింగయ్య, పసుల తిరుపతి, జిలకర కృష్ణాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కడియం నాగయ్య, దుబ్బ నగేష్, కార్యదర్శులు చెల్మెడ్ అనీల్, గంట వెంకన్న, మహంకాళి భిక్షపతి, ప్రచార కార్యదర్శులు కల్మకోల్ యాదయ్య, చింత ప్రవీణ్, కోశాధికారి బొట్ల నదానందం, అధికార ప్రతినిధి పంగిడిచెరువు వెంకటేష్, సహాయ కార్యదర్శి కాడేవగ శ్రీనివాన్, నాయకులు బొల్లె రాజయ్య, దరువుల శంకర్, మీసాల సైదులు, లంక స్వామి, రాయుడు, బాలకృష్ణ, రామస్వామి, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి 30 మంది బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు.

వీరారెడ్డిపల్లి గ్రామ కాంగ్రెస్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక.

దుబ్బాక ప్రజాకలం అక్టోబర్ 01.

రాయపోల్ మండలం వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సుమారు 30 మంది బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వీరారెడ్డిపల్లి గ్రామ కాంగ్రెస్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా గిరిపల్లి మహిపాల్, ఉపాధ్యక్షులుగా వేముల నర్సింలు, నత్తయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్యమంతుల సాయికుమార్, ప్రధాన కార్యదర్శులుగా రాగి మల్లేశం, వేముల నాగరాజు, కార్యదర్శిగా గొల్ల రాజును ఎన్నుకున్నారు. మహిళా కార్యదర్శులుగా నర్సవ్వ, బచ్చోల్ల లక్ష్మి, యూత్ అధ్యక్షుడిగా వగ్గు చందు, ఉపాధ్యక్షుడిగా ప్రభాకర్, మహిళా సభ్యులుగా కవిత, సలహాదారుగా పిట్ల మల్లేశంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పీఎం సూర్య ఘర్ పథకంపై అవగాహన కార్యక్రమం

వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి మహేశ్వరం ఏఈ చక్రపాణి

కందుకూరు, సెప్టెంబర్ 29 (ప్రజా కలం):

పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన, రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు టీజీ ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారని మహేశ్వరం ఏఈ చక్రపాణి తెలిపారు. డిఈ,ఓపి, కందుకూరు మార్గద ర్శకత్వంలో, ఏడిఈ, మామిడిపల్లి మరియు ఏ డి ఈ, ఆమనగల్ సబ్-డివిజన్ల పరిధిలోని వినియోగదారుల కోసం ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆమనగల్, కందుకూరు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి, బాలాపూర్, పహాడీ షరీఫ్ మరియు మహేశ్వరం మండలాల పరిధిలోని గృహ విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి వేదిక అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ తుక్కుగూడ కార్యాలయం, టీజీ ఎస్పీడీసీఎల్ తేదీలు:02, 03, 04 అక్టోబర్, 2026 సమయం ఉదయం 10:00 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు ఈ కార్యక్రమంలో బ్యాంకర్లు, అధీకృత సోలార్ విక్రేతలు పాల్గొని రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు, ప్రభుత్వ సబ్సిడీ, బ్యాంకు రుణ సదుపాయాలు, దరఖాస్తు విధానం తదితర అంశాలపై పూర్తి వివరాలు అందిస్తారు.అర్హత కలిగిన గృహ వినియోగదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని సౌర విద్యుత్ ద్వారా విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవాలని అధికారులు సూచించారు.



టీజీఎస్ఆర్టీసీ యూనియన్ ఎన్నికలకు 15 మందితో కమిటీ ఏర్పాటు

- అక్టోబర్ 9 వరకు ఎన్నికల కార్యక్రమాల సమన్వయం

-మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం, అక్టోబర్ 01 (ప్రజా కలం):

టీజీఎస్ఆర్టీసీ యూనియన్ ఎన్నికలు-2026 నేపథ్యంలో ఎన్నికల కార్యక్రమాలను సమన్వయం చేసేందుకు 15 మందితో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. టీజీఎస్ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో అధ్యక్ష అభ్యర్థి మొగుల్ల రాజిరెడ్డికి అవసరమైన సంస్థాగత సహకారం అందించడంతో పాటు, సంబంధిత ఉద్యోగులు, ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఈ కమిటీ పనిచేస్తుందని పేర్కొన్నారు.

కమిటీ సభ్యులు:

మల్లేష్ యాదవ్, నడికుడ శివ (ఐ ఎన్ టి సి యూ), రాజు నాయక్, రఘుపతి, చాకలి యాదయ్య, ప్రశాంత్ రెడ్డి, కాకి ఈశ్వర్, అల్లె కుమార్, ఆవుల యాదయ్య, కూన యాదయ్య, పరిగి రాఘవేందర్ రెడ్డి, నందిగామ నర్సింహ, అంద్యానాయక్, యాదగిరి గౌడ్, దశరథ్.ఎన్నికల ప్రక్రియ అక్టోబర్ 9వ తేదీ వరకు కమిటీ సభ్యులు సంబంధిత ఉద్యోగులు, ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సహకారం అందించాలని కేఎల్ఆర్ సూచించారు. ఎన్నికల కార్యక్రమాలు సజావుగా జరిగేలా ప్రతి సభ్యుడు క్రమశిక్షణ, సమన్వయం, అంకితభావం, నిబద్ధతతో తన బాధ్యతలను నిర్వర్తించాలని కోరారు.టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు, హక్కులు, సంక్షేమ అంశాలపై ఉద్యోగులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ఎన్నికల కార్యక్రమాలను నిర్వహించాలని కమిటీ సభ్యులను ఆదేశించారు.

పదో తరగతి విద్యార్థులకు టేబుల్ ల్యాంపుల వితరణ.

దుబ్బాక ప్రజాకలం అక్టోబర్ 01.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాంసాగర్‌లో 2025--26 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థి వివేక్ చారి ప్రస్తుత పదో తరగతి విద్యార్థులకు టేబుల్ ల్యాంపులను వితరణ చేశారు. ఇంటి వద్ద రాత్రివేళల్లో చదువుకునేందుకు ఇవి ఉ



పయోగపడతాయని ప్రధానోపాధ్యాయురాలు శైలజ తెలిపారు. తాను చదువుకున్న పాఠశాలపై అభిమానంతో విద్యార్థుల చదువుకు సహకరించిన వివేక్ చారి సేవాభావాన్ని ఆమెతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. పూర్వ విద్యార్థుల సేవా కార్యక్రమాలు ప్రస్తుత విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, నరేందర్‌రెడ్డి, యాదయ్య, మహేష్, శ్యామ్‌సుందర్ శర్మ, నవీన్‌కుమార్, మంజుల, ఉమా, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.



వనస్థలిపురంలో ఘనంగా

సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం

తొలి కొనుగోలుదారుగా పి. కృష్ణయాదవ్

ప్రత్యేక ఆకర్షణగా నటి మీనాక్షి చౌదరి

ప్రారంభోత్సవ కానుకగా రూ.89కే ప్రింటెడ్ క్రేప్ చీర





హైదరాబాద్, అక్టోబర్ 1 (ప్రజా కలం ప్రతినిధి)

నాణ్యత, విస్తృత కలెక్షన్లు, వినియోగదారుల సంతృప్తికి ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతున్న సీ ఎం ఆర్ షాపింగ్ మాల్.. వనస్థలిపురంలో నూతన షోరూమ్‌ను గురువారం ఘనంగా ప్రారంభించింది. దీంతో వనస్థలిపురం, పరిసర ప్రాంతాల ప్రజలకు సరికొత్త షాపింగ్ అనుభూతి అందుబాటులోకి వచ్చింది.

ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటి మీనాక్షి చౌదరి ముఖ్య అతిథిగా హాజరై నూతన షోరూమ్‌ను ప్రారంభించారు. సీ ఎం ఆర్ గ్రూప్ చైర్మన్ మావూరి వెంకట రమణ, డైరెక్టర్ మావూరి బాలాజీ పాల్గొన్నారు. మాజీ ఎంపీ, ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్ మధు యాష్కీ గౌడ్, తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్లారెడ్డి రెడ్డి, ఎల్బీనగర్ భాజపా ఇన్‌ఛార్జి సామ రంగారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, మాజీ కౌన్సిలర్, యాదగిరిగుట్ట బోర్డు సభ్యురాలు పి. ఈశ్వరమ్మ యాదవ్, షోరూమ్ యజమాని పి. కృష్ణయాదవ్, సురేష్ యాదవ్ తదితరులు హాజరయ్యారు.

చీరల కలెక్షన్లు నచ్చాయి: మీనాక్షి

ప్రారంభోత్సవం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మీనాక్షి చౌదరి మాట్లాడుతూ.. సీ ఎం ఆర్ షాపింగ్ మాల్‌లోని చీరల కలెక్షన్లు తనకు ఎంతో నచ్చాయని తెలిపారు. తాను కూడా క్రమం తప్పకుండా సీ ఎం ఆర్‌లో షాపింగ్ చేస్తుంటానని చెప్పారు. విభిన్న డిజైన్లు, ఆకర్షణీయమైన కలెక్షన్లు అందుబాటులో ఉండటం ప్రత్యేకతగా పేర్కొన్నారు.

వనస్థలిపురం ప్రజలు తనపై ఎంతో అభిమానం చూపిస్తారని, అదే విధంగా తనకూ ఇక్కడి ప్రజలంటే ఎంతో ఇష్టమని ఆమె తెలిపారు. అనంతరం వేదికపై పాటలకు నృత్యం చేస్తూ ప్రేక్షకులను అలరించారు. దీంతో ప్రారంభోత్సవ వేడుక సందడిగా మారింది.

తొలి కొనుగోలు పి. కృష్ణయాదవ్‌దే

నూతన షోరూమ్‌లో తొలి కొనుగోలుదారుగా పి. కృష్ణయాదవ్ నిలిచారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.

కుటుంబమంతటికీ.. ఒకే చోట

నూతనంగా ప్రారంభమైన షోరూమ్‌లో చీరలు, సంప్రదాయ దుస్తులతో పాటు పురుషులు, మహిళలు, చిన్నారులకు సంబంధించిన వస్త్రాలు అందుబాటులో ఉంచారు. ఫ్యాషన్, లైఫ్‌స్టైల్‌కు సంబంధించిన విభిన్న కలెక్షన్లను సైతం అందిస్తున్నారు. అన్ని వయసుల వారికి, కుటుంబ సభ్యులందరికీ ఒకే చోట షాపింగ్ చేసేలా మాల్‌ను రూపొందించారు.

నాణ్యతతో కూడిన ధరలు: చైర్మన్

సీ ఎం ఆర్ షాపింగ్ మాల్ చైర్మన్ మావూరి వెంకట రమణ మాట్లాడుతూ.. వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను ఆకర్షణీయమైన ధరలకు అందించడమే తమ లక్ష్యమన్నారు. ప్రతి షాపింగ్ అనుభవాన్ని మధుర జ్ఞాపకంగా మార్చేలా సేవలు అందిస్తున్నామని తెలిపారు. వినియోగదారుల ఆదరణతో మరిన్ని ప్రాంతాలకు సేవలను విస్తరిస్తున్నామని చెప్పారు.

రూ.89కే ప్రింటెడ్ క్రేప్ చీర

ప్రారంభోత్సవ కానుకగా ప్రింటెడ్ క్రేప్ చీరను కేవలం రూ.89కే అందిస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది. వివిధ కేటగిరీల్లో మరెన్నో ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొంది. వనస్థలిపురం, పరిసర ప్రాంతాల ప్రజలు నూతన షోరూమ్‌ను సందర్శించి విస్తృతమైన కలెక్షన్లను వీక్షించాలని సీ ఎం ఆర్ యాజమాన్యం కోరింది.





బౌరంపేట 60గజాలు లక్ష్మినగర్ ఫేస్ 2లో నూతన ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటుకు ఏఈ ప్రసూన వినతి పత్రం అందజేత

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) బౌరంపేట 60గజాలు లక్ష్మినగర్ ఫేస్ 2లో నూతన ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటుకు ఏఈ ప్రసూనకు వినతి పత్రం బీజేపీ బౌరంపేట్ డివిజన్ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఫేస్ 1 లో 4 ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. అందులో నుండి కనీసం ఒక ట్రాన్స్ ఫార్మర్ ఫేస్ 2 లో పెట్టాలని విజ్ఞప్తి చేశారు. 60గజాలు ఫేస్ 2లో ప్రభుత్వం ఇచ్చిన 500లకు పైగా ప్లాట్లు ఉన్నాయి. సుమారు 150పైగా పేదలు ఇండ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. వారికి ఎలాంటి విద్యుత్ సౌకర్యం లేక చీకట్లోనే నానా అవస్థలు పడుతున్నారు. వెంటనే నూతన ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఏఈ కి వినతి పత్రం అందజేశారు. అప్పటివరకు యిఅబతీఎ గృహల కోసం కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్ నుండి తాత్కాలికంగానైన కనెక్షన్ ఇవ్వాలని విద్యుత్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. వారు సానుకూలంగా స్పందించి తప్పకుండ వెంటనే పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు .ఈకార్యక్రమంలో లైన్ ఇన్స్పెక్టర్ వై.లక్ష్మారెడ్డి, లైన్ మెన్ శివకుమార్, బీజేపీ నాయకులు డి.ప్రభాకర్ రెడ్డి, కాలనీ వాసులు కొమ్ము యాదయ్య, ఎం. ప్రమీల, పర్వతాలు యాదవ్, చిత్తారి యాదవ్, శివకుమార్ యాదవ్, కుమ్మరి మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్ పంపిణీ

సంగారెడ్డి ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్01 నారాయణఖేడ్ నగల్ గిద్దా మండల పరిధిలోని ఇరాక్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్ పంపిణీ సంగారెడ్డి అపెక్స్ శిశురక్ష ఆసుపత్రి యాజమాన్యం సునీల్ కుమార్ సహకారంతో విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్‌ను నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు ప్రతిరోజూ శుభ్రమైన తాగునీటిని వినియోగించేలా ప్రోత్సహించడం మంచి అలవాట్లను పెంపొందించడంలో దోహదపడుతుందని విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి తోడ్పాటు నందిస్తున్న సంగారెడ్డి అపెక్స్ శిశురక్ష ఆసుపత్రి యాజమాన్యానికి, ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ పై దాడి

పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు, కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నాం-- ఎస్.ఐ బుగ్గ శ్రీశైలం

బొమ్మలరామారం, అక్టోబర్ 01 (ప్రజా కలం)

మండల తహసిల్దార్ కార్యాలయంలో గురువారం రోజున మధ్యాహ్నం 3.30 గంటలకు మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న కొండం వెంకట్ రెడ్డి పై దాడి జరిగిన సమాచారం పై రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకట్ రెడ్డి ని వివరణ కోరగా వారు తెలిపిన వివరాల ప్రకారం మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో నేను విధులలో ఉండి తహసీల్దార్ కార్యాలయానికి నుండి బయటకు వచ్చి క్షేత్ర పరిశీలన కు వెళ్దామని పోతుంటే బొమ్మలరామారం గ్రామానికి చెందిన బెజ్జంకి వెంకట్ రెడ్డి మరియు అతని కుమారుడు బెజ్జంకి మధుమోహన్ రెడ్డి నన్ను ఆపి అరే నా రిపోర్ట్ ఇవ్వావారా, నువ్వు నా భూమి మొత్తం నాకు పట్టా కాకుండా చేస్తున్నావురా లంజకొడుక అని,భూతు మాటలు తిట్టి,నా మీద భౌతిక దాడి చేసి,నా కాలరు పట్టు కోవడం జరిగింది అని తెలిపారు నిన్ను చంపేస్తా అని, నానా దుర్భాషలు మాట్లాడడం జరిగింది అని తెలిపారు ఈ సంఘటనపై రెవెన్యూ సంఘాలు స్పందిస్తూ
ప్రభుత్వ ఉద్యోగి విధులలో ఉండగా ఆటంకం కలిగించడంతో వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బొమ్మలరామారం పోలీస్ స్టేషన్ ఎస్.ఐ బుగ్గ శ్రీశైలంకి రెవిన్యూ సంఘాల తరుపున ఫిర్యాదు చేయడం జరిగింది బొమ్మలరామారం ఎస్ఐ వివరణ మండల తాహసిల్దార్ కార్యాలయంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న కొండం వెంకట్ రెడ్డి పై దాడి జరిగిన విషయంలో రెవిన్యూ సంఘాల ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నామని అన్నారు



అంగరంగ వైభవంగా బక్కని రవి మాదిగ జన్మదిన వేడుకలు

- జన్మదిన వేడుకలకు భారీగా తరలివచ్చిన ప్రజా ప్రతినిధులు అభిమానులు

- సంతోషం వ్యక్తం చేస్తూ అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన

- జిల్లా ఎమ్మార్పీఎస్ మాజీ అధికార ప్రతినిధి బక్కని రవి మాదిగ

మహేశ్వరం, సెప్టెంబర్ 29 (ప్రజా కలం):

రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ మాజీ అధికార ప్రతినిధి, కల్వకోల్ గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ తనయుడు బక్కని రవి మాదిగ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. అమీర్‌పేటలోని ఆవుల శివాజీ గార్డెన్‌లో నిర్వహించిన ఈ వేడుకలు అంగరంగ వైభవంగా, నందడిగా కొనసాగాయి. రవి మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని కుటుంబ సభ్యులు, బంధువులు, బీఆర్ఎస్, ఎమ్మార్పీఎస్ నాయకులు, మిత్రులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రవి మాదిగ కేక్ కట్ చేయగా, హాజరైన నాయకులు, అభిమానులు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.బక్కని రవి మాదిగకు ఉన్న స్నేహ సంబంధాలు, రాజకీయ పరిచయాల కారణంగా వేడుకలకు పెద్ద సంఖ్యలో మిత్రులు, నాయకులు తరలివచ్చారు. పలువురు నాయకులు మాట్లాడుతూ రవి మాదిగతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ, సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.బక్కని రవి మాదిగ గతంలో రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధిగా కీలక బాధ్యతలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు. మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు, మునిగపాటి నవీన్, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గాదే థామస్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, రమేష్ యాదవ్, మల్లేష్ యాదవ్, రవీందర్, బక్కని అశోక్, అంజయ్య రామస్వామి, బదుసు ప్రవీణ్, బబ్లు, దుబాయ్ చంద్ర సర్పంచ్ సెల్వ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు ఉపసర్పంచులు గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





డ్యూటీలో ఉన్న డాక్టర్ పై దాడి

దాడికి పాల్పడిన వ్యక్తి దుద్యాల వెంకట తిరుపతి

భూదాన్ పోచంపల్లి అక్టోబర్ 1 (ప్రజా కలం)

డ్యూటీలో ఉన్న డాక్టర్ పై దాడి చేసిన దుద్యాల వెంకట తిరుపతిని కఠినంగా శిక్షించాలని పోచంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు నిరసన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మున్సిపల్ పట్టణ కేంద్రంలో గురువారం రోజున ఉదయం మహమ్మాయమ్మ కాలనీకి చెందిన దుద్యాల వెంకట తిరుపతి కాలికి దెబ్బ తగలడంతో కట్టించుకునేందుకు పోచంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కి వచ్చాడు. ఇక్కడ నిధులు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీవాణి విధుల నిమిత్తం యాదగిరిగుట్టకు వెళ్లడంతో జిబ్లాక్ పల్లి గ్రామానికి పల్లె దవాఖానాలో వైద్యురాలిగా పనిచేస్తున్న డాక్టర్ శ్వేత పోచంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి విధుల నిమిత్తంపై ఇక్కడికి వచ్చారు. అందరిని వరుస క్రమంలో వైద్యం అందిస్తున్న డాక్టర్ శ్వేతని వరుస క్రమంలో లేకుండా తరచూ అరుస్తూ ఉండడంతో డాక్టర్ అతని పిలిపించి వైద్యం అందించారు. వైద్యం అందిన తర్వాత బయటికి వెళ్లి పది నిమిషాల తర్వాత మళ్లీ లోపలికి వచ్చి డాక్టర్ పై విచక్షణ రహితంగా దాడికి పాల్పడ్డాడు. అడ్డువచ్చిన వ్యక్తిపై దురుసుగా ప్రవర్తించి అతనిపై దాడిక, పాల్పడ్డాడు. విధుల్లో ఉన్న ఇద్దరు మహిళ వైద్య సిబ్బందిని దుర్భసలాడే వారిపై దాడికి పాల్పడ్డాడు. డాక్టర్ చేతిలో ఉన్న మొబైల్, స్టెతస్కోప్ లాక్కొని, పోలీస్ స్టేషన్ కి వెళ్ళాడు. ఈ ఘటనపై బాధితులు కేసు నమోదు చేయడానికి వెళితే అక్కడ కూడా దాడికి పాల్పడినట్లు తెలిపారు. దాడికి పాల్పడిన దృశ్యాలు సీసీ కెమెరాలు రికార్డు అయ్యాయి. ప్రజల ఆరోగ్యాల కోసం ఉన్న డాక్టర్ పై దాడికి పడిన వ్యక్తిని వెంటనే శిక్షించాలని ఆస్పత్రి ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తూ మాకు రక్షణ కల్పించాలని, న్యాయం జరగాలని ధర్నాకు చేశారు.



ప్రజలు ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాలను నివారించండి

రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో ఉప్పల్ ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ ఎస్.సంపత్ కుమార్

ఉప్పల్ అక్టోబర్ 1(ప్రజాకలం న్యూస్)

ప్రజలందరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటిస్తూ, బాధ్యతాయుతమైన రహదారి వినియోగదారులుగా వ్యవహరించాలని, రోడ్డు ప్రమాదాలను నివారించి అందరి ప్రాణాలను కాపాడేందుకు సహకరించాలని ఉప్పల్ ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ ఎస్.సంపత్ కుమార్ సూచించారు. ఈ మేరకు గురువారం ఉప్పల్ జంక్షన్‌లో Arrive Alive రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఉప్పల్ ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ ఎస్.సంపత్ కుమార్,ఉప్పల్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ ఇతర సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ, అతివేగం,మద్యం సేవించి వాహనాలు నడపడం,మైనర్ల డ్రైవింగ్,ట్రిపుల్ రైడింగ్,వాహనం నడిపేటప్పుడు మొబైల్ ఫోన్ వినియోగం వంటి ప్రమాదకర చర్యల గురించి వివరించారు. హెల్మెట్,సీట్ బెల్ట్ ధరించడం,ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించడం, లేన్ క్రమశిక్షణను అనుసరించడం ఇతర రహదారి భద్రతా నియమాల ప్రాముఖ్యతను తెలియజేశారు.



పేరు మార్పు ప్రకటన

ఇంతకు ముందు నా కుమార్తె పేరు లవణం లక్ష్మీగా ఉండేది. ప్రస్తుతం ఆ పేరును లవణం లక్ష్మీ దీపికగా మార్చుతున్నాము. ఇకపై అన్ని ప్రభుత్వ, విద్యా మరియు ఇతర అధికారిక రికార్డులు, ధ్రువపత్రాలలో నా కుమార్తె పేరు లవణం లక్ష్మీ దీపికగా నమోదు చేయవలసిందిగా తెలియజేయుచున్నాము.

తండ్రి పేరు: లవణం కిరణ్ కుమార్
తల్లి పేరు: లవణం ప్రియాంక
పుట్టిన తేదీ: 31.10.2010

చిరునామా:
ఇంటి నం. 2-110, రామన్నపేట గ్రామం మరియు మండలం,
యాదాద్రి జిల్లా, తెలంగాణ -- 508113.

ఇంతకు ముందు ఉన్న పేరు "లవణం లక్ష్మీ" మరియు ప్రస్తుతం మార్చుకున్న పేరు "లవణం లక్ష్మీ దీపిక" ఒకే వ్యక్తికి సంబంధించినవని తెలియజేయుచున్నాము.



బీబీనగర్‌లో ఎయిమ్స్ లో

పరిశుభ్రతకు కొత్త ప్రాధాన్యత

- పరిశుభ్రతపై ఎయిమ్స్ ప్రత్యేక దృష్టి - రెండు నెలలుగా పర్యవేక్షణ..

-ఆసుపత్రి ప్రాంగణంలో మెరుగైన పారిశుధ్య నిర్వహణ...



యాదాద్రి/బీబీనగర్ అక్టోబర్ 1 ప్రజాకలం:

ప్రతి రోజూ వేలాది మంది రోగులు, వారి నహాయకులు రాకపోకలు సాగించే బీబీనగర్ ఎయిమ్స్ లో పరిశుభ్రత,పారిశుధ్య నిర్వహణకు అధికారులు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. గత రెండు నెలలుగా ఆసుపత్రి యాజమాన్యం చేపడుతున్న కఠిన పర్యవేక్షణ,నిబంధనల అమలు,నర్సింగ్ మరియు హౌస్ కీపింగ్ సిబ్బంది చురుకైన భాగస్వామ్యంతో పరిశుభ్రతలో స్పష్టమైన మార్పులు కనిపిస్తున్నాయి.ఇటీవల ఆసుపత్రి అధికారులు రౌండ్లు, ప్రాంగణ తనిఖీలను మరింత పెంచారు.ఈ సందర్భంగా పరిశుభ్రతకు సంబంధించిన సమస్యలను వెంటనే గుర్తించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపడుతు న్నారు. ముఖ్యంగా ఓపిడిలు,రోగులు వేచి ఉండే ప్రదేశాలు,టాయిలెట్లు,అధిక రద్దీ ఉండే ప్రాంతాల్లో పరిశుభ్రత ప్రమాణాలు పాటించేలా హౌస్ కీపింగ్ సిబ్బందికి నిరంతరం సూచనలు చేస్తున్నారు.అదే విధంగా ఆసుపత్రికి వచ్చే రోగులు,వారి సహాయకులు, సందర్శకులు కూడా పరిశుభ్రత పరిరక్షణలో భాగస్వాములు కావాలని అధికారులు సూచిస్తున్నారు.చెత్తను నిర్దేశిత డస్ట్‌బిన్లలోనే వేయడం, ఆసుపత్రి ప్రాంగణంలో చెత్త వేయకుండా ఉండడం, ఆసుపత్రి నిబంధనలను పాటించడం,ప్రభుత్వ ఆస్తులు మరియు ఆసుపత్రి సౌకర్యాలను జాగ్రత్తగా వినియోగించడం ద్వారా నహకరించాలని కోరుతున్నారు.ఆసుపత్రుల్లో పరిశుభ్రత కేవలం పరిసరాల అందం కోసం మాత్రమే కాకుండా,ఇన్ఫెక్షన్ల నియంత్రణకు,రోగులు,వారి సహాయకులు,వైద్యులు, నర్సింగ్ మరియు ఇతర సిబ్బందికి సురక్షితమైన వాతావరణాన్ని కల్పించేందుకు కీలకమైనదని అధికారులు పేర్కొంటున్నారు.ఆసుపత్రి యాజమాన్యం,నర్సింగ్,హౌస్ కీపింగ్ సిబ్బంది,రోగులు, సందర్శకుల సమిష్టి నహకారంతోనే ఈ మార్పు సాధ్యమవుతోందని తెలుస్తోంది.పరిశుభ్రతలో సాధించిన పురోగతిని కొనసాగించేందుకు నిరంతర పర్యవేక్షణ,తగిన వనరులు, సిబ్బంది నమన్వయం,ప్రజల చురుకైన భాగస్వామ్యం అవసరం.ఎయిమ్స్ లో పరిశుభ్రతను ఒకసారి చేపట్టే కార్యక్రమంగా కాకుండా, నాణ్యమైన వైద్య సేవలు, ఇన్ఫెక్షన్ నియంత్రణ, సమర్థవంతమైన ఆసుపత్రి నిర్వహణలో నిరంతర ప్రక్రియగా కొనసాగించే దిశగా ఆనువత్రి అధికారులు చర్యలు చేపడుతున్నారు.



మోర్తాడ్‌లో డబుల్ ఇళ్ల డ్రాపై అభ్యంతరాలు

మరోసారి సర్వే చేయాలని ఎంపీడీఓకు వినతి

నిజామాబాద్, (ప్రజా కలం ప్రతినిధి) అక్టోబర్ 01:

నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని మోర్తాడ్ మండల కేంద్రంలో ఇటీవల (సెప్టెంబరు 30న) నిర్వహించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక డ్రా ప్రక్రియపై పలువురు స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. డ్రాలో ఎంపికైన వారిలో కొందరు అనర్హులు ఉన్నారని ఆరోపిస్తూ గురువారం మోర్తాడ్ మండల అభివృద్ధి అధికారికి (ఎంపీడీఓ) ఒక వినతిపత్రాన్ని సమర్పించారు.



ఈ నందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం లబ్ధిదారుల ఎంపిక కోసం చేపట్టిన డ్రా ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో మరోసారి సమగ్ర సర్వే నిర్వహించి, అర్హులైన పేదలను పారదర్శకంగా ఎంపిక చేయాలని కోరారు. మండలంలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల ఖాళీలను పూర్తిస్థాయిలో గుర్తించి, అనర్హులను జాబితా నుంచి తొలగించాలన్నారు. మిగిలి ఉన్న ఇళ్లను కూడా అర్హులైన పేదలకు కేటాయించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హాజీ, జావిద్, సబ్బని సంపత్, శివకుమార్, హాబిద్ తదితరులు పాల్గొన్నారు

విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడపాలి

-ఆర్మూర్ డిపో మేనేజర్‌కు ఎన్ఎస్‌యూఐ వినతి

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబర్ 01:

మోర్తాడ్ -- భీంగల్ రూట్లలో ప్రయాణించే విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసులను నడపాలని ఎన్ఎస్‌యూఐ నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్ రెహమాన్ డిమాండ్



చేశారు. ఈ మేరకు గురువారం ఆయన నాయకులతో కలిసి ఆర్మూర్ డిపో మేనేజర్ (డీఎం)కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సయ్యద్ రెహమాన్ మాట్లాడుతూ.. మోర్తాడ్, రామన్నపేట్, జాగిర్యాల్, సుంకేట్ తదితర పరిసర గ్రామాల నుండి ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో విద్యార్థులు భీంగల్‌లోని వివిధ కళాశాలలకు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. అయితే, సరైన సమయానికి ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని, దీనివల్ల విద్యార్థులపై అదనపు ఆర్థిక భారం పడటంతో పాటు ప్రయాణ సమయం వృథా అవుతోందని డీఎం దృష్టికి తీసుకెళ్లారు.

విద్యార్థుల విద్యా ప్రయోజనాలను, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే మోర్తాడ్ -- భీంగల్ మధ్య తగినన్ని బస్సు సర్వీసులు నడపాలని కోరారు. దీనిపై ఆర్మూర్ డీఎం సానుకూలంగా స్పందిస్తూ, విద్యార్థుల ఇబ్బందులను తొలగించేందుకు త్వరలోనే ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు సిద్ధు, నందు, సిద్ధార్థ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అంతమ్మగూడెం, దోతిగూడెం కెమికల్ పరిశ్రమలను వెంటనే మూసివేయాలి

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా డిమాండ్



భూదాన్ పోచంపల్లి అక్టోబర్ 1(ప్రజా కలం)

పోచంపల్లి మండలం పరిధిలోని అంతమ్మగూడెం, దోతిగూడెం గ్రామాలలో కొనసాగుతున్న కెమికల్ పరిశ్రమల వల్ల స్థానిక ప్రజలు, రైతాంగం తీవ్ర నష్టాన్ని , అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆ పరిశ్రమలను ప్రభుత్వం వెంటనే మూసివేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ నభ్యులు కొండమడుగు నర్సింహ్మా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పోచంపల్లి సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో అంతమ్మగూడెం, దోతిగూడెం గ్రామాలలో ఉన్న కెమికల్ పరిశ్రమలను ఎత్తివేయాలని, పరిశ్రమల వల్ల నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ అంతమ్మగూడెం, దోతిగూడెం గ్రామాలల నుండి చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయం వరకు 11 కిలోమీటర్ల పాదయాత్రను సిపిఎం రాష్ట్ర కమిటీ నభ్యులు కొండమడుగు నర్సింహ్మా, సీనియర్ నాయకులు గూడూరు అంజిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా కొండమడుగు నర్సింహ్మా మాట్లాడుతూ ఈ కెమికల్ పరిశ్రమల నుండి వెలువడుతున్న విషపూరిత రసాయనాలు, పొగ, వ్యర్థాల కారణంగా వాయు, నీటి కాలుష్యం కోరలు చాచిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్యం వల్ల వ్యవసాయ భూములు, పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. పండించిన పంటలు కూడా విషతుల్యంగా మారుతున్నాయని తెలిపారు. వ్యవసాయంతో పాటు పశు పోషణ, చేతివృత్తులపై ఆధారపడిన వృత్తిదారులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల నుంచి వదిలే వాయువుల్లో 12 రకాల ప్రమాదకరమైన రసాయనాలు గాలిలో కలుస్తున్నాయని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సి.పి.సి.బి.) అధికారులు గుర్తించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ కాలుష్య గాలిని పీల్చడం వల్ల స్థానిక ప్రజలు క్యాన్సర్, చర్మవ్యాధులు, నాడీ వ్యవస్థ దెబ్బతినడం, కిడ్నీ సమస్యలు వంటి అనేక ప్రాణాంతక రోగాల బారిన పడుతున్నారని మండిపడ్డారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీల్లో స్థానికులకు అవకాశం కల్పించకపోవడం, నష్టపోతున్న రైతులను గుర్తించకపోవడం దారుణమన్నారు. కాలుష్యానికి కారణమవుతున్న ఈ కెమికల్ పరిశ్రమలను తక్షణమే ఇక్కడి నుండి తరలించాలని, అలాగే కాలుష్యం వల్ల నష్టపోయిన రైతాంగానికి పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో బాధితుల పక్షాన పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు గూడూరు అంజిరెడ్డి, మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, మండల కార్యదర్శివర్గ సభ్యులు పగిల్ల లింగారెడ్డి, ప్రసాదం విష్ణు, మంచాల మధు, మండల కమిటీ సభ్యులు సామ జంగారెడ్డి, కల్కూరి బిక్షపతి, నెల్లికంటి జంగయ్య, వడ్డేపల్లి యాదగిరి, బుగ్గ లక్ష్మయ్య, రైతులు జి. దామోదర్ రెడ్డి, కే మహేష్, ఆర్ రామిరెడ్డి, ఆర్ ధనలక్ష్మి, వీ రేణుక, జి. రామచంద్రారెడ్డి, ఎం సత్తయ్య, సత్యం, అర్జున్ రెడ్డి, జి మల్లేష్, బి బిక్షపతి, మల్లారెడ్డి, ఎల్లమ్మ, రాకేష్, శ్రీశైలం తో పాటు స్థానిక గ్రామ ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పార్టీ అధికారంలో ఉన్నా.. లేకున్నా



ఆదే పయనం

నమ్ముకున్న సిద్ధాంతాలకోసం

పార్టీ వీడని పాషా

ప్రజా కలం ప్రత్యేకం..

కార్యకర్త నుంచి పట్టణ అధ్యక్షుడి వరకు

పోరాటాలు.. అరెస్టులు.. దీక్షలు.. అయినా వెనుకడుగు లేదు

ఎట్టకేలకు జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు

కార్యకర్తగా మొదలైన ప్రస్థానం..
పట్టణ అధ్యక్షుడిగా సాగిన పయనం..
ఇప్పుడు జిల్లా ప్రధాన కార్యదర్శి బాధ్యతల వరకు..
పాషా రాజకీయ ప్రయాణంలో మరో మలుపు!

మెట్‌పల్లి: (కోరుట్ల) అక్టోబర్ 1 (ప్రజా కలం ప్రతినిధి)

కాంగ్రెస్ పార్టీని తన ఊపిరిగా భావిస్తూ పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్న నాయకుల్లో మహమ్మద్ ఖుతుబోద్దీన్ పాషా ఒకరు. పార్టీ అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. తాను నమ్ముకున్న సిద్ధాంతాలకు కట్టుబడి ముందుకు సాగిన పాషా, కార్యకర్త స్థాయి నుంచి పట్టణ అధ్యక్షుడి వరకు అంచెలంచెలుగా ఎదిగారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తీసుకున్న నిర్ణయంపై అసంతృప్తితో కొంతకాలం ఇతర పార్టీ వైపు చూసినా.. అది మూడునాళ్ల ముచ్చటగానే ముగిసింది. గుండెల్లో కాంగ్రెస్ భావజాలం ఉండటంతో సుమారు ఇరవై రోజులకే సొంత గూటికి చేరి హస్తం జెండాను భుజాన వేసుకున్నారు.



పార్టీ బలోపేతానికి కృషి..

సామాన్య కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన పాషా.. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉన్న సమయంలో 2012లో మెట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తూ ముందుకు సాగారు. యువత ఉద్యోగాలు, రైతులు, ఆర్టీసీ కార్మికులు, విద్యార్థుల సమస్యలపై పోరాటాలు నిర్వహించారు. అప్పటి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పాలన, పట్టణ అభివృద్ధిపై ప్రశ్నిస్తూ కాంగ్రెస్ పార్టీ తరఫున పలు ఆందోళనలు చేపట్టారు.



అధిష్టానం గుర్తింపు దక్కేనా..?

గతంలో పాషాపై నమ్మకం ఉంచి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానం.. ఆయన సేవలను మరోసారి గుర్తిస్తుందా అన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో సాగుతోంది. పార్టీ కోసం నిరంతరం పనిచేసిన పాషాకు మరింత కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందనే సంకేతాలు వినిపిస్తున్నాయి. పలువురు కాంగ్రెస్ నాయకులు, మంత్రులతో ఆయనకు ఉన్న సాన్నిహిత్యం కూడా ఇందుకు కారణంగా పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, టీపీసీసీ డెలిగేట్ సభ్యుడు కల్వకుంట్ల సుజీత్‌రావుతో పాషాకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. కాంగ్రెస్ పార్టీ పట్ల విధేయతతో పనిచేసిన పాషాకు అధిష్టానం తగిన గుర్తింపు ఇస్తే.. పార్టీ బలోపేతానికి మరింతగా సేవలందించే అవకాశం ఉంటుందని ఆయన అనుచరులు అభిప్రాయపడుతున్నారు.



అరెస్టులు.. కేసులు.. అయినా వెనక్కి తగ్గలేదు

బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ, వివిధ ప్రజా సంఘాలు ఇచ్చిన ఆందోళన పిలుపుల్లో పాషా చురుకుగా పాల్గొనేవారు. దీంతో పోలీసుల ముందస్తు అరెస్టుల్లో ఆయన పేరు తరచూ వినిపించేది. అర్ధరాత్రి అరెస్టులు, పోలీస్ స్టేషన్‌లో నిర్బంధం, కేసులు ఎదురైనా ఆయన వెనక్కి తగ్గకుండా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పదేళ్లపాటు ఎన్నో అడ్డంకులు ఎదురైనా కాంగ్రెస్ పార్టీని వీడకుండా పార్టీ కోసం పనిచేశారు.

ప్రలోభాలకు లొంగకుండా..
కాంగ్రెస్‌లో పాషా సుదీర్ఘ ప్రస్థానం

చిన్న చిన్న ప్రలోభాలకు పార్టీలను మారుతున్న నేటి రాజకీయ పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలంగా కొనసాగుతూ పాషా అరుదైన నాయకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నా, అధికారంలో ఉన్నా పార్టీ నిర్ణయాలే శిరోధార్యంగా భావిస్తూ క్రమశిక్షణతో పనిచేస్తూ వస్తున్నారు. ఇతర పార్టీల నుంచి పదవులు, టికెట్ల పేరుతో ప్రలోభాలు ఎదురైనప్పటికీ తాను నమ్ముకున్న సిద్ధాంతాలకు కట్టుబడి కాంగ్రెస్‌ను వీడకుండా కొనసాగడం ఆయన రాజకీయ నిబద్ధతకు నిదర్శనంగా అభిమానులు పేర్కొంటున్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తున్నారు. అంచెలంచెలుగా కార్యకర్త స్థాయి నుంచి పట్టణ నాయకుడిగా ఎదిగిన పాషా సేవలను పార్టీ అధిష్టానం గుర్తించి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించడం పట్ల ఆయన అభిమానులు, పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా లభించిన ఈ బాధ్యతతో మరింత ఉత్సాహంతో ప్రజలకు, పార్టీకి సేవ చేస్తానని పాషా పేర్కొన్నారు.





సమస్యల పరిష్కారం కోసం దీక్షలు..

మెట్‌పల్లి పట్టణంతో పాటు రాష్ట్రంలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారం కోసం పాషా దీక్షలు, ఆందోళనలు చేపట్టారు. మైనార్టీ ఉర్దూ మీడియం పాఠశాల, షాదీఖానా నిర్మాణం కోసం నిరాహార దీక్ష చేపట్టి నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా పోరాటం చేశారు.మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులను నిరసిస్తూ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఆయన చేపట్టిన ఆందోళనలకు కాంగ్రెస్ నాయకులు, వివిధ యువజన సంఘాలు మద్దతు తెలిపిన సందర్భాలు ఉన్నాయి.

పాషా సేవలకు గుర్తింపు..

కాంగ్రెస్ పార్టీలో చురుకైన నాయకుడిగా కొనసాగుతున్న పాషా, ఇతర పార్టీల నుంచి పదవులు, టికెట్లతో ప్రలోభాలకు గురిచేసినా తాను నమ్ముకున్న సిద్ధాంతాలకు కట్టుబడి నిలిచారు. ఇతర పార్టీల వైపు మొగ్గు చూపకుండా ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ ప్రజల పక్షాన నిలుస్తూ వచ్చారు. ఎట్టకేలకు అలస్యమైనా కాంగ్రెస్ పార్టీ ఆయన సేవలను గుర్తించి కీలక పదవి అందజేయడం పట్ల పట్టణ ప్రజలు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాషా

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గజంగి నందయ్య పాషా ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. టీపీసీసీ డెలిగేట్ మెంబర్ కల్వకుంట్ల సుజిత్ రావు పాషాకు నియామక ఉత్తర్వులు అందజేశారు. రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండే పాషాకు జిల్లా స్థాయి పదవి దక్కడంపై నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వానికి పాషా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వార్డు స్థాయి నుంచి తనకు అండగా నిలిచి ఈ నియామకానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ వాకిటి సత్యం రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com

పితృపక్షాల్లో పుణ్యకార్యం

పేదల ఆకలి తీర్చిన అన్నదానం

-పితృదేవతల జ్ఞాపకార్థం పేదలకు అల్పాహార వితరణ

- అంతునూరి శివకుమార్

గజ్వేల్: 01అక్టోబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

పితృదేవతల జ్ఞాపకార్థం దానధర్మాలు, అన్నప్రసాద వితరణ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వారి ఆత్మలకు శాంతి చేకూరుతుందని విశ్వాసం ఉందని అంతునూరి శివకుమార్ అన్నారు. పితృపక్షాలను పురస్కరించుకుని గజ్వేల్‌లోని వాసవి చలివేంద్రం ఆధ్వర్యంలో 15 రోజులుగా పితృదేవతల జ్ఞాపకార్థం



అల్పాహార వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.అందులో భాగంగా గురువారం అంతునూరి చంద్రశేఖర్ జ్ఞాపకార్థం పేదలు, కూలీలకు అల్పాహారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు జీవించి ఉన్నప్పుడే వారిని ప్రేమగా ఆదరించడం, సంరక్షించడం పిల్లల బాధ్యత అన్నారు. వారు మరణించిన అనంతరం వారి జ్ఞాపకార్థం పుణ్యకార్యాలు, దానధర్మాలు, అన్నప్రసాద వితరణ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వారిని స్మరించుకోవచ్చన్నారు.వివిధ పార్టీ చౌరస్తా వద్ద ప్రతిరోజూ వివిధ ప్రాంతాల నుంచి కూలీలు, నిరుపేదలు వస్తుంటారని తోట భిక్షపతి తెలిపారు. వారికి తమకు తోచిన విధంగా ఆహారం అందించాలనే ఉద్దేశంతో పితృపక్షాల సందర్భంగా 15 రోజులపాటు అల్పాహార వితరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. పితృదేవతల జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న ఈ సేవా కార్యక్రమం ద్వారా పేదలకు ఆహారం అందించే అవకాశం కలుగుతోందన్నారు.ఈ కార్యక్రమంలో మరుమాముల ఓంకార్,మరియాల లింగం,మరియాల శ్రీనివాస్,సిరిపురం సత్యనారాయణ, దూపకుంట లచ్చయ్య,కాశీనాథ్, కసనగొట్టు లింగం,అత్తిలి నాగేంద్రం, కైలాస ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన విధులకు ఆటంకం.. వ్యక్తికి జైలు శిక్ష

మల్కాజిగిరి,అక్టోబరు 1 (ప్రజా కలం ప్రతినిధి): వినాయక నిమజ్జనం సందర్భంగా విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి ఆటంకం కలిగిస్తూ ప్రజా శాంతికి భంగం కలిగించిన వ్యక్తికి నేరేడ్మెట్ పోలీసులు కేసు నమోదు చేశారు.జేకే కాలనీకి



చెందిన అంబటి నాగరాజు (32)పై నేరేడ్మెట్ పోలీసులు బీఎన్ఎస్ 221,292 సెక్షన్లతో పాటు హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్‌లోని 70(బి) సెక్షన్ కింద కేసు నమోదు చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు. కేసును విచారించిన గౌరవ మెజిస్ట్రేట్ నిందితుడికి ఒక రోజు జైలు శిక్షతో పాటు రూ. 500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

నేడు జరిగే కృతజ్ఞత సభకు జగ్గారెడ్డి ని ఆహ్వానించిన గ్రామ పాలనాధికారులు.

సంగారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 01 (ప్రజా కలం):

గ్రామ పాలన అధికారులుగా నియామకం జరిగి సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా శుక్రవారం సంగారెడ్డి లో నిర్వహిస్తున్న కృతజ్ఞత సభ కు హాజరుకావాలని జిపివో ల సంఘం నాయకులు జగ్గారెడ్డి ని అహ్వానించారు.



గురువారం ఐబీ గెస్ట్ హౌస్ లో కలిసి ఈ మేరకు ఆహ్వానం పలికారు. గత ప్రభుత్వం లో విఆర్వో వ్యవస్థ ను చిన్నా భిన్నం చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం లో తిరిగి తమ స్వంత శాఖలకు వచ్చామని జగ్గారెడ్డి కి వివరించారు. ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞత తెలియజేస్తూ సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిపివో ల కు జగ్గారెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో జిపివో ల సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, సహాయ కార్యదర్శి , సుజాత లు , నాయకులు బొంగుల రవి, కూన సంతోష్ , మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, టౌన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్ లు పాల్గొన్నారు.

కొత్తపల్లి వద్ద ఆర్టీసీ బస్సు అడ్డగింత.

విద్యార్థుల కోసం ఉదయం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయాలి.

దుబ్బాక ప్రజాకలం అక్టోబర్ 01.

రాయపోల్ మండలం కొత్తపల్లి బస్టాండ్ వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్టీసీ బస్సును అడ్డుకుని నిరసన తెలిపారు. ఉదయం వేళల్లో బస్సులు గ్రామం వద్ద నిలపకపోవడంతో విద్యార్థులు కళాశాలలకు ఆలస్యంగా చేరుతున్నారని



ఆవేదన వ్యక్తం చేశారు. గజ్వేల్ తదితర ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులు నెలనెలా బస్సు పాస్‌లు తీసుకుంటున్నప్పటికీ, బస్సులు నిలపకపోవడంతో వాటి ప్రయోజనం లేకుండా పోతోందన్నారు. టెంకంపేట విద్యార్థులు నాలుగు కిలోమీటర్లు, కొత్తపల్లి విద్యార్థులు సుమారు కిలోమీటరు నడిచి బస్టాండ్‌కు చేరుకుంటున్నారని తెలిపారు. అయినా బస్సులు నిలపకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రాయపోల్--గజ్వేల్ మార్గంలోని కొత్తపల్లి, లింగారెడ్డిపల్లి, చిన్న మాసంపల్లి, ఆరేపల్లి, జాలిగామ తదితర గ్రామాల విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఉదయం 8.30 నుంచి 9 గంటల మధ్య రాయపోల్ నుంచి గజ్వేల్‌కు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. అన్ని గ్రామాల వద్ద బస్సులు నిలిపేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



సీపీఎస్ విధానం రద్దు చేయాలి

- పెండింగ్ డీఏలు, పీఆర్సీని వెంటనే అమలు చేయాలి: టీపీటీఎఫ్

గజ్వేల్:01అక్టోబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి):

సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, ఉద్యోగులు,ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీపీటీఎఫ్ జోన్ కన్వీనర్ జల్లెల్ల శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) గజ్వేల్ మండల శాఖ అధ్యక్షుడు తాళ్ల నాగరాజు,ప్రధాన కార్యదర్శి గోక విద్యాసాగర్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని గజ్వేల్ ఎడ్యుకేషన్ హబ్,జాలిగామ, బెజుగామ,కోల్గూరు,పిడిచేడ్,ఆరెపల్లి, అహ్మదీపూర్,బయ్యారం,గిరిపల్లి, ప్రజ్ఞాపూర్,గజ్వేల్ తదితర గ్రామాల్లోని పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు,ఉపాధ్యాయుల సమస్యల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు.ఉపాధ్యాయులు,ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. 2023 జూలై నుంచి అమలు కావాల్సిన పీఆర్సీని ఇప్పటికీ అమలు చేయకపోవడం విచారకరమన్నారు. వెంటనే పీఆర్సీ కమిటీ నివేదికను తెప్పించుకుని పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు,ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని,సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. జీవో 25ను సవరించి ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్ దమ్మని మల్లయ్య,ఆకుల శ్రీనివాస్, నాయకులు ఓటకారి శ్రీనివాస్, పోచయ్య,ఎర్రవాడ నర్సిములు,మెట్టు రాములు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల హక్కుల కోసం

-అక్టోబర్ 2 న గాంధీ జయంతి నాడు నిరసన !

- ఆరు డిమాండ్లపై ప్రభుత్వం తక్షణ జోక్యం అవసరం .

- కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని డిమాండ్ .

- టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి.



సంగారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 01(ప్రజా కలం):

జర్నలిస్టుల హక్కులను సాధించడానికి ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయు) పిలుపుమేరకు అక్టోబర్ 2 న గాంధీ జయంతి నాడు జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో నిరసన కార్యక్రమం చేపట్టినట్లు టి యు డబ్ల్యూ జే సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ అనిల్ కుమార్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా విభాగం అధ్యక్షుడు ఆసిఫ్, ప్రధాన కార్యదర్శి బసవేశ్వర్, చిన్న మధ్య తరహా పత్రికల సంఘం అధ్యక్షుడు సిద్ధిక్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ చవాన్

తెలిపారు. డిమాండ్స్ డే లో భాగంగా జాతిపిత గాంధీజీ విగ్రహం వద్ద ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి చెప్పారు. ఇటీవల బెంగళూరు లో నిర్వహించిన ఐజేయు కార్యవర్గ సమావేశంలో జర్నలిస్టుల సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించడంపై సమావేశం ఖండించిందని అన్నారు.

పెద్ద ఎత్తున నిరసన తెలిపాలని నిర్ణయించిందన్నారు. బెంగళూరు సమావేశంలో చేసిన తీర్మానం మేరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో గాంధీ జయంతి నాడు ఉదయం 10 గంటలకు నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఏ కే ఫైసల్ తో పాటు జిల్లాలోని జర్నలిస్టులు పెద్ద ఎత్తున పాల్గొంటారని యాదగిరి అన్నారు. నిరసన అనంతరం జిల్లా కలెక్టర్ కు, స్థానిక ప్రజాప్రతినిధులకు వినతి పత్రం సమర్పిస్తామని చెప్పారు.

ప్రధాన డిమాండ్లు ఈ కింది విధంగా ఉన్నాయని వివరించారు.ముఖ్యంగా నూతన మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి.మీడియా సిబ్బందికి రక్షణ కల్పించాలి.అందుకు ప్రత్యేక చట్టం తేవాలి.

రద్దు చేయబడిన చట్టాల స్థానంలో చట్టబద్దంగా హక్కులు పునరుద్ధరించాలి.

నూతన వేజ్ బోర్డు ఏర్పాటు చేయాలి.

రాష్ట్రంలో ఇళ్లస్థలాలు, హెల్త్ కార్డులు ఇవ్వాలి.

జర్నలిస్టుల భద్రతా కోసం చట్టం తేవాలి అని యాదగిరి డిమాండ్ చేశారు. మీడియా నిపుణులు ఎదుర్కొంటున్న కీలకమైన నిర్మాణాత్మక చట్టపరమైన సమస్యలపై తక్షణం కేంద్రం జోక్యం కోరుతున్నామన్నారు. గౌరవనీయ రాష్ట్రపతి ఈ విషయంలో స్పందించాల్సిందిగా తమ సంఘం కోరుతుందన్నారు.వత్రికా స్వేచ్ఛను,మీడియా కార్మికుల సామాజిక-ఆర్థిక భద్రతను పరిరక్షించడానికి కీలకమైన ఆరు ముఖ్యమైన డిమాండ్లను కేంద్రం వెంటనే పరిష్కరించాలని యాదగిరి డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తన ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ళు, ఇళ్లస్థలాలు ఇవ్వాలి.

ఉద్యోగులకు ఇస్తున్న విధంగా హెల్త్ కార్డులు ఇచ్చి,క్యాష్ లెస్ ట్రీట్మెంట్ అందించాలని టీయూడబ్ల్యూజే కోరుతోందని యాదగిరి పేర్కొన్నారు.

చిన్నారుల సంక్షేమంలో అంగన్‌వాడీల సేవలు కీలకం

అంగన్‌వాడీ సిబ్బందికి ఘన సన్మానం.. చిన్నారులకు బిస్కెట్లు పంపిణీ



గజ్వేల్: 01అక్టోబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి):

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ జన్మదిన ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్లో భాగంగా గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ముట్రాజ్‌పల్లి 13వ వార్డులో 'అంగన్ మిలన్ సేవ'కార్యక్రమాన్ని నిర్వహించారు.పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు మంతురి మమత ఆధ్వర్యంలో ముట్రాజ్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రాలు--1, 2లను సందర్శించి అంగన్‌వాడీ టీచర్లు,ఆయాలతో మాట్లాడారు.ఈ సందర్భంగా కేంద్రాల్లోని వసతులు, సౌకర్యాలు,చిన్నారులకు అందుతున్న సేవలు, పోషకాహారం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నారులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. చిన్నారులు,గర్భిణీలు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మరింత మెరుగైన సేవలు అందేలా సహకారం అందించడంతో పాటు, అవసరమైన వసతుల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు.అనంతరం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను శాలువాలతో సత్కరించి, చిన్నారులు మరియు మహిళల సంక్షేమం కోసం వారు అందిస్తున్న సేవలను అభినందించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్,సిద్దిపేట జిల్లా బీజేపీ కౌన్సిల్ సభ్యుడు చెప్యాల వెంకట్ రెడ్డి,జిల్లా బీజేపీ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సిల్వేరి కుంకుమ రాణి, ఉపాధ్యక్షురాలు ఆలేటి సుమతి, మున్సివల్ ప్రధాన కార్యదర్శి నాయిని నందీప్ కుమార్,మహిళా మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యురాలు స్వరాజ్యలక్ష్మి, మున్సిపల్ బీజేవైఎం అధ్యక్షుడు గడియారం రాజేశ్వర్ చారి,మహిళా మోర్చా నాయకురాలు చింత సరిత తదితరులు పాల్గొన్నారు.



హర్షం వ్యక్తం చేసిన బండారు రామ్మోహన్ రావు


ప్రజ్ఞాపూర్ ఖ్యాతిని విశ్వవేదికకు చేర్చిన నర్సింగరావు

కళా ప్రస్థానానికి కిరీటం..

నర్సింగరావుకు గౌరవ డాక్టరేట్

- బండారు రామ్మోహనరావు

గజ్వేల్:01 అక్టోబర్ 2026(ప్రజా కలం ప్రతినిధి): అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ప్రముఖ దర్శకుడు బి. నర్సింగరావుకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ,హైదరాబాద్ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడం ప్రజ్ఞాపూర్ గ్రామానికి గర్వకారణమని మాజీ సర్పంచ్ బండారు రామ్మోహనరావు అన్నారు.'మా భూమి', 'దాసి', 'రంగుల కల', 'హరివిల్లు', 'మనుషులు' తదితర విప్లవాత్మక, కళాత్మక చిత్రాలను రూపొందించి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన నర్సింగరావుకు గౌరవ డాక్టరేట్ లభించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.ప్రజ్ఞాపూర్‌లో జన్మించి,పెరిగిన నర్సింగరావు ఐదో తరగతి వరకు ఇక్కడే విద్యాభ్యాసం చేశారని రామ్మోహనరావు తెలిపారు.తన ప్రతిభతో అనేక అంతర్జాతీయ అవార్డులను అందుకున్న ఆయనకు గౌరవ డాక్టరేట్ దక్కడం ద్వారా ప్రజ్ఞాపూర్ ఖ్యాతి మరింత ఇనుమడించిందన్నారు.గ్రామంలో పుట్టి అంతర్జాతీయ స్థాయిలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించిన నర్సింగరావు ప్రస్థానం ప్రజ్ఞాపూర్ ప్రజలకు గర్వకారణమని, యువతకు స్ఫూర్తిదాయకమని రామ్మోహనరావు పేర్కొన్నారు.



మామిడి సుశీల ప్రథమ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

గజ్వేల్:01 అక్టోబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

మామిడి రాములు సతీమణి మామిడి సుశీల ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం గజ్వేల్‌లోని సాయిరాం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు



ప్రతాప్ రెడ్డి,మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్‌పర్సన్ కళ్యాణ్కర్ పద్మబాయి నర్సింగ్‌రావు, కౌన్సిలర్ మామిడి శ్రీధర్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా మామిడి సుశీల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల కదం..సంగారెడ్డికి పిలుపు

అక్టోబర్ 2న సంగారెడ్డి నిరసనకు పటాన్‌చెరు నుంచి భారీగా తరలిరావాలి: పత్తి నరసింహ..

పటాన్‌చెరు, అక్టోబర్ 1 (ప్రజా కలం) ప్రతినిధి

జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, వృత్తిపరమైన భద్రత, సంక్షేమం, గుర్తింపు కార్డుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలనే డిమాండ్‌తో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్, ఐజేయూ ఆధ్వర్యంలో అక్టోబర్ 2న సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి జర్నలిస్టులు భారీగా తరలిరావాలని నియోజకవర్గ అధ్యక్షుడు పత్తి నరసింహ పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన భద్రత, గుర్తింపు కార్డుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని పత్తి నరసింహ కోరారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా కమిటీల పిలుపు మేరకు చేపడుతున్న నిరసనను విజయవంతం చేయడంలో ప్రతి జర్నలిస్టు భాగస్వామి కావాలని విజ్ఞప్తి చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని ముద్రిత, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ప్రతినిధులు ఐక్యంగా కదిలి సంగారెడ్డి జిల్లా కేంద్రానికి పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి నేతృత్వంలో జరిగే కార్యక్రమానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫైజల్ హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కూడా జర్నలిస్టుల తరలింపులో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు..

